
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
అన్నమయ్య
జిల్లా వార్తలు
5
శనివారం 22 ఫిబ్రవరి 2025



జలగల్లా.. వడ్డీ వ్యాపారులు



- సామాన్యులే టార్గెట్‌గా..
- వడ్డీపై వడ్డీ వేస్తూ వసూళ్లు
- లబోదిబోమంటున్న బాధితులు
- పోలీసుస్టేషన్లకు చేరుతున్న పేచీలు

7

ఆక్రమణలపై కొరడా

- రాజంపేటలో భూకబ్జాలపై అధికారుల చర్యలు
- మొన్న అన్నమాచార్య ఇంజనీరింగ్ కళాశాల..
- నిన్న ఎన్టీఆర్ కాలనీ ఎదురుగా ఆక్రమణల కూల్చివేత
- తాజాగా ఎమ్మెల్యే ఆకేపాటికి జాయింట్ కలెక్టర్ నోటీసు
- నేడు విచారణకు హాజరుకానున్న ఆకేపాటి కుటుంబసభ్యులు

రాజంపేటలో అక్రమార్కులపై అధికారులు కొరడా ఝులిపించనున్నారు. ఆక్రమణలకు పాల్పడితే ఎంతటి వారిపైన అయినా చర్యలు తీసుకునేందుకు తగ్గేదేలే అంటున్నారు. దీంతో భూకబ్జాదారుల్లో దడ మొదలైంది. మొన్న అన్నమాచార్య ఇంజనీరింగ్ కళాశాల ప్రహరీ కూల్చివేయగా, నిన్న ఎన్టీఆర్ కాలనీ ఎదురుగా ఉన్న ఆక్రమణలను నేలమట్టం చేశారు. తాజాగా శుక్రవారం ఎమ్మెల్యే ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి, ఆయన కుటుంబీకులకు జాయింట్ కలెక్టర్ నోటీసులు ఇవ్వడం రాజంపేటలో హాట్ టాపిక్‌గా మారింది.



ఇటీవలే తొలగించిన అన్నమాచార్య కళాశాల ప్రహరీగోడ (ఫైల్)



ఎన్టీఆర్ కాలనీ ఎదురుగా ఉన్న భవనాన్ని ఎక్స్‌కవేటర్‌తో పూర్తిగా నేలమట్టం చేసిన భవనం

రాజంపేట, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): ఇటీవల అన్నమాచార్య కళాశాల వారు పక్కనే ఉన్న తాళ్లపాక చెరువును ఆక్రమించి ప్రహరీగోడను ఏర్పాటు చేశారని పెద్దఎత్తున విద్యార్థి సంఘాలు ఆందోళనకు దిగారు. దీంతో కలెక్టర్ శ్రీధర్ ఈ ఆక్రమణపై విచారణ చేయాలని, ఆక్రమణలు ఉన్నట్లు తేలితే చర్యలు తీసుకోవాలని ఆదేశాలిచ్చారు. ఆ మేరకు స్థానిక తహసీల్దారు విచారించి చెరువు ఆక్రమణలో ప్రహరీ గోడను ఎక్సకవేటర్ ద్వారా తొలగించారు. అదేవిధంగా రాజంపేట మండలం ఎన్టీఆర్ కాలనీ రహదారి పక్కనే గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ప్రభుత్వ భూమిలో ఏర్పాటు చేసిన భారీ వ్యాపార సముదాయాల భవనాలను, దాని వెనక 50 సెంట్లలో పలువురు ఏర్పాటు చేసిన భవనాలను రెవెన్యూ అధికారులు భారీ పోలీసు బందోబస్తు నడుమ శాశ్వత కట్టడాలను తొలగించారు. ఈ భూముల్లో లక్షలాది రూపాయలు ఖర్చు చేసి నిర్మించిన కట్టడాలను తొలగించారు. ఎన్టీఆర్ కాలనీ ఎదురుగా ఉన్న ప్రభుత్వ భూముల్లో వేసిన కట్టడాలను నేలమట్టం చేయడంతో ఒక్కసారిగా ఆక్రమణదారులు హడలెత్తిపోతున్నారు. ఈ నేపథ్యంలోనే ఎమ్మెల్యే ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి ఆధ్వర్యంలో రెండురోజుల క్రితం అక్కడికి వెళ్లి నిరసన వ్యక్తం చేసిన విషయం తెలిసిందే. వైసీపీ లీగల్‌సెల్ న్యాయవాదుల సమక్షంలో ఎస్సీలకు సంబంధించిన భవనాలను తొలగించడం దారుణమని దీనిపై తాము న్యాయ పోరాటానికి వెళుతున్నట్లు తెలిపారు. రాజంపేట చుట్టుపక్కల అనేకమంది ప్రభుత్వ భూముల్లో అక్రమ భవనాలు నిర్మించారని, వాటిపై కూడా తాము ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

దీనిపై టీడీపీ జిల్లా అధ్యక్షుడు జగన్ మోహన్‌రాజు, మండల టీడీపీ అధ్యక్షుడు గన్నే సుబ్బనరసయ్యనాయుడు, 6మండలాల టీడీపీ అధ్యక్షులతో కలిసి శుక్రవారం వేర్వేరుగా విలేకర్ల సమావేశం ఏర్పాటు చేసి ఎమ్మెల్యే అమర్‌నాథ్‌రెడ్డి తీరుపట్ల తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆకేపాటి అవినీతి కోటను కూల్చేవరకు నిద్రపోమని హెచ్చరించారు. స్వయంగా ఎమ్మెల్యేనే భారీ ఆక్రమణలు చేసి తమ ఇంటి పేరిట ఎస్టేట్ నామకరణం చేసి భారీ భవంతులు కట్టారని, ముందు వాటిపై విచారణ చేసి తొలగించాలని డిమాండ్ చేశారు. దీంతో ఈ భూకబ్జాలపై ఇరు పార్టీల నాయకులు విమర్శలకు దిగడం తీవ్ర ఉద్రిక్తతకు దారి తీస్తోంది. ప్రధానంగా శనివారం భూ ఆక్రమణలపై విచారణకు రావాలని జేసీ ఆదర్శ రాజేంద్రన్ ఎమ్మెల్యేకు నోటీసులు ఇచ్చారు. ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డితో పాటు ఆయన సతీమణి జ్యోతమ్మ, తమ్ముడు అనిల్‌కుమార్‌రెడ్డి, అతని సతీమణి సుజనలకు నోటీసులు ఇచ్చారు. మందపల్లె, ఆకేపాడు చుట్టుపక్కల ప్రాంతాల్లో భారీఎత్తున భూములు ఆక్రమించడం, ప్రధానంగా దానవిక్రయం పేరిట ప్రభుత్వ భూములను రిజిస్ట్రేషన్ చేసుకోవడం అనే అంశంపై శనివారం జేసీ కోర్టుకు హాజరై వివరణ ఇవ్వాలని నోటీసులు జారీ చేయడంతో రాజంపేట నియోజకవర్గంలో ఇప్పుడు ఇదే పెద్ద హాట్‌టాపిక్‌గా మారింది. ఈ భూ వివాదాలపై తహసీల్దారు పీరు మున్నీని ఆంధ్రజ్యోతి వివరణ కోసం ప్రయత్నించగా ఆమె అందుబాటులోకి రాలేదు.



ఆకేపాటి ఎస్టేట్‌లో నిర్మించిన వ్యాపార సముదాయం



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న టీడీపీ పార్లమెంట్ అధ్యక్షుడు జగన్‌మోహన్‌రాజు

పోలీసుశాఖకు 'మ్యాగీ' సేవలు అమోఘం

- పోలీసు జాగిలం పదవీ విరమణ సందర్భంగా ఎస్పీ సత్కారం

రాయచోటిటౌన్, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): పోలీసు జాగిలం మ్యాగీ 11 ఏళ్ల పాటు విశిష్ట సేవలందించి పలు కీలక విధులను సమర్థవంతంగా నిర్వర్తించడం అమోఘం, అభినందనీయమని ఎస్పీ విద్యాసాగర్ నాయుడు పేర్కొన్నారు. శుక్రవారం జిల్లా పోలీసు కార్యాలయంలో మ్యాగీ పదవీ విరమణ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఎస్పీ మాట్లాడుతూ జర్మన్ షెపర్డ్ జాతికి చెందిన ఈ జాగిలం 2013 అక్టోబరు 23న జన్మించిందని, ఉద్యోగ సర్వీస్ 9 ఏళ్లు అయినప్పటికీ అదనంగా మరో రెండేళ్లు విధులు నిర్వర్తించిందన్నారు. మర్డర్లు, రేప్‌లు, దొంగతనాలు చేసిన వారిని గుర్తించడంలో ఈ జాగిలానికి పేరుందన్నారు. 2014లో మొయినాబాద్, హైదరాబాద్‌లోని ఇంటలిజెన్స్ సెక్యూరిటీ వింగ్ వారి వద్ద ట్రాకర్ విభాగంలో 8 నెలలు శిక్షణ పొందిందని, అనంతరం 6ఏళ్ల పాటు చిత్తూరు జిల్లాలో విధులు నిర్వర్తించి, 2022లో జిల్లాల పునర్విభజన నేపథ్యంలో అన్నమయ్య జిల్లాకు బదిలీపై వచ్చినట్లు తెలిపారు. అనంతరం సుదీర్ఘకాలం పాటు పోలీసు శాఖలో విధులు నిర్వర్తించిన మ్యాగీని ఎస్పీ పూలమాల వేసి శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. అంతేకాకుండా ఈ జాగిలాన్ని సంపూర్ణ ఆరోగ్యంతో, చురుగ్గా ఉండేలా కంటికి రెప్పలా చూసుకున్న హ్యాండ్లర్ బి.మణిగండన్‌ను ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు. మున్ముందు కూడా జాగ్రత్తగా చూసుకోవాలని ఎస్పీ ఆదేశించారు.

జాగిలం సేవలు ఇలా..

- 2015లో చిత్తూరు జిల్లా పెనుమూరు మండలం దిగువపూనేపల్లి గ్రామంలో రేప్ అండ్ మర్డర్ కేసును ఛేదించినందుకు గానూ అప్పటి అనంతపురం రేంజ్ డీఐజీ చేతుల మీదుగా రూ.250 క్యాష్ రివార్డ్ అందుకుంది.
- రాష్ట్ర స్థాయిలో రెండు సార్లు ఎంపికై మన రాష్ట్రం తరపున ట్రాకర్ విభాగంలో 2016లో మైసూర్‌లో, 2017లో చెన్నైలో ఆలిండియా పోలీస్ డ్యూటీ మీట్‌లో పాల్గొంది.
- చిత్తూరు జిల్లాలోని తవనంపల్లిలో మర్డర్ కేసును క్షణాల్లో ఛేదించి నిందితుడిని పట్టించినందుకు గానూ అప్పటి చిత్తూరు ఎస్పీ మెడల్‌తో సన్మానించి జిల్లా పోలీసు కార్యాలయం చుట్టూ బ్యాండు మేళాలతో ఊరేగించారు.
- 2016లో గణతంత్ర దినోత్సవం రోజున డాగ్‌షోలో భాగంగా మ్యాగీ పనితనాన్ని మెచ్చుకొని అప్పటి చిత్తూరు కలెక్టర్ రూ.లక్ష చెక్కును అందించారు. ఈ నగదును చిత్తూరు జిల్లా డాగ్ కెనాల్ పునరుద్ధరణకు ఉపయోగించారు.
- జిల్లా పరిధిలోని ఓబులవారిపల్లె పోలీస్‌స్టేషన్ పరిధిలో గల చిన్నఓరంపాడు గ్రామంలో జరిగిన మర్డర్ కేసును క్షణాల్లో ఛేదించి పోలీసు ఉన్నతాధికారుల ప్రశంసలను పొందింది.
- జిల్లాకు బదిలీపై వచ్చిన తర్వాత గణతంత్ర, స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా డాగ్ షో చేస్తూ పిల్లల కేరింతల మధ్య, చూపరులను ఆకట్టుకుంటూ అధికారుల మన్ననలు పొందింది.

మ్యాగీ పదవీ విరమణ కార్యక్రమంలో జిల్లా అదనపు ఎస్పీ(అడ్మిన్) ఎం.వెంకటాద్రి, ఏవో క్రిష్ణుడు, ఆర్‌ఐలు, వీజే రామక్రిష్ణ, జాన్‌జోషఫ్, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ రాజారమేశ్, ఆర్‌ఎస్‌ఐలు, డీపీవో సిబ్బంది, పోలీసు సిబ్బంది, మహిళా పోలీసులు పాల్గొన్నారు.



పదవీవిరమణ పొందిన జాగిలాన్ని సన్మానిస్తున్న ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు

టమోటా రైతులు ఆందోళన చెందవద్దు

- టమోటాలను గిట్టుబాటు ధరకు కొనుగోలు చేసేందుకు ప్రభుత్వం చర్యలు
- రాష్ట్ర రవాణా, యువజన, క్రీడాశాఖ మంత్రి రాంప్రసాద్‌రెడ్డి

రాయచోటిటౌన్, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని టమోటా రైతులెవ్వరూ ఆందోళన చెందవద్దని, గిట్టుబాటు ధరకు టమోటాలను కొనుగోలు చేసేందుకు కూటమి ప్రభుత్వం ఇప్పటికే అవసరమైన చర్యలు చేపట్టిందని రాష్ట్ర రవాణా, యువజన, క్రీడాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మార్కెట్‌లో టమోటా ధరలు తగ్గుతున్న పరిస్థితుల్లో కూటమి ప్రభుత్వం రైతులను ఆదుకునేందుకు ఇప్పటికే చర్యలు చేపట్టిందని, ఈ మేరకు సరైన గిట్టుబాటు ధర వచ్చేలా తీసుకోవాల్సిన చర్యలపై శుక్రవారం అన్ని జిల్లాల కలెక్టర్లు, వ్యవసాయశాఖ మార్కెటింగ్ అధికారులతో రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు టెలీకాన్ఫరెన్స్ ద్వారా తగు సూచనలు జారీ చేసినట్లు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా రబీలో మొత్తంగా 4,303 ఎకరాల్లో టమోటా పంటను రైతులు సాగు చేసినట్లు అధికారులు వివరించారని, జిల్లాలోని మదనపల్లె, ములకలచెరువుల్లో టమోటా మార్కెట్‌కు ప్రసిద్ధి చెందిందని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం తీసుకున్న చర్యల ఫలితంగా జిల్లాలోని మదనపల్లె మార్కెట్ నుంచి 12 మెట్రిక్ టన్నులు, మొలకలచెరువు మార్కెట్ నుంచి 7.50 మెట్రిక్ టన్నుల టమోటాలను మంచి ధరకు ప్రభుత్వం కొనుగోలు చేసి ఈనెల 22న వాటిని గుంటూరు, విజయవాడ, రాజమండ్రి, ఒంగోలు మార్కెట్లకు తరలిస్తున్నట్లు మంత్రి తెలిపారు. అలాగే కేంద్ర ప్రభుత్వ మార్కెట్ ఇంటర్వెన్షన్ పథకంలో భాగంగా నాఫెడ్, ఎన్సీసీ ఎఫ్ ద్వారా టమోటాలను అన్ని ఆపరేషన్ ఖర్చులను వారే భరించే విధంగా టమోటా కొరత ఉన్న ఇతర రాష్ట్రాలైన తమిళనాడు, తెలంగాణ, మధ్యప్రదేశ్, మహారాష్ట్రల్లో విక్రయించే విధంగా కేంద్ర ప్రభుత్వంతో వ్యవసాయశాఖ మంత్రి ఇప్పటికే సంప్రదించి అవసరమైన చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. తద్వారా కిలో టమోటా ధర సుమారు రూ.10 నుంచి రూ.15 వరకు రైతులకు అందే అవకాశం ఉందని, అంతేగాక ప్రాసెసింగ్ యూనిట్లకు టమోటాలను పంపి రైతులకు గిట్టుబాటు ధర వచ్చేలా చేయాలని కలెక్టర్లకు ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసినట్లు మంత్రి వివరించారు.

ఆశ నిరాశల మామిడి

- పూత ఘనం, పింజ శూన్యం
- పూతను నలిచేస్తున్న తెగుళ్లు
- నిరాశలో మామిడి సాగు రైతులు, వ్యాపారులు

వివరాలు..6లో



గిట్టుబాటు ధరలపై చర్యలు

- టమోట రైతులతో సబ్‌కలెక్టర్ ముఖాముఖి

6



వెలుగొచ్చింది..

- 'అక్షరం అండగా.. పరిష్కారమే అజెండా'కు స్పందన



6

విద్యుత్ బస్సులు నడపాలి

- పీలేరులో ఈయూ రాష్ట్ర అధ్యక్షుడు దామోదరరావు

6

భవనాలు.. ఖాళీ చేయండి..!

- 19 శాఖలకు ఉన్నతాధికారుల ఆదేశం
- అద్దె భవనాలు దొరికేనా ?
- వైసీపీ సర్కారు పాపం.. ప్రజలకు శాపం

జిల్లా కేంద్రంలోని 19 ప్రభుత్వ శాఖల జిల్లా కార్యాలయాలను ఖాళీ చేయాలని ఆయా శాఖలకు ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేసిన విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. దీంతో అధికారులు, సిబ్బంది ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు. గత వైసీపీ సర్కారు ప్రభుత్వ కార్యాలయాలకు భవనాలు నిర్మించాలన్న ఆలోచన చేయకపోవడంతో అధికారులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రస్తుతం అద్దె భవనాల కోసం వెతికే పనిలో పడ్డారు.

(రాయచోటి-ఆంధ్రజ్యోతి): రాజంపేట మార్గంలోని ఓదివీడు సమీపంలో గల ప్రభుత్వ మైనార్టీ పాలిటెక్నిక్ కళాశాల ఆవరణలో నిర్వహిస్తున్న 19 ప్రభుత్వ శాఖల జిల్లా కార్యాలయాలను వచ్చే మార్చి 31లోగా ఖాళీ చేయాలని సంబంధిత శాఖల ఉన్నతాధికారులకు ఆదేశాలు అందాయి. ఇటీవల జిల్లా రెవెన్యూ అధికారి సదరు శాఖల ఉన్నతాధికారులతో సమావేశం నిర్వహించి, ఆయా కార్యాలయాల కోసం రాయచోటి పట్టణంలో అద్దె భవనాలు చూసుకోవాలని సూచించినట్లు తెలిసింది. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం మైనార్టీ పాలిటెక్నిక్ కళాశాల అభివృద్ధి కోసం రూ.5 కోట్ల నిధులు కేటాయించింది. దీంతో సంబంధిత విద్యాశాఖాధికారులు జిల్లా కలెక్టర్‌ను కలిసి, అక్కడ ఉన్న ప్రభుత్వ కార్యాలయాలు ఖాళీ చేస్తే.. మైనార్టీ పాలిటెక్నిక్ కళాశాలను అభివృద్ధి చేసుకుంటామని చెప్పినట్లు తెలిసింది. ఈ నేపథ్యంలోనే జిల్లా ఉన్నతాధికారులు.. ఆ శాఖల జిల్లా అధికారులతో మాట్లాడి.. మార్చి 31లోగా ఆయా ప్రభుత్వ శాఖల జిల్లా కార్యాలయాలకు అద్దె భవనాలు చూసుకోమని చెప్పినట్లు సమాచారం. జిల్లా కేంద్రంలో సంచలనం కలిగించిన ఈ సంఘటన వివరాల్లోకి వెళితే..

2022లో అప్పటి వైసీపీ ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా కొత్త జిల్లాలను ఏర్పాటు చేసింది. ఈ నేపథ్యంలో.. రాయచోటి జిల్లా కేంద్రంగా అన్నమయ్య జిల్లాను ఏర్పాటు చేశారు. ఈ క్రమంలో అప్పట్లో.. రాయచోటి పట్టణంలో అందుబాటులో ఉన్న ప్రభుత్వ భవనాల్లో పలు ప్రభుత్వ కార్యాలయాలను ఏర్పాటు చేశారు. రాయచోటి రింగురోడ్డుకు సమీపంలో ట్రైబల్ వెల్ఫేర్ గురుకల పాఠశాల భవనాల్లో కలెక్టరేట్‌ను, ప్రభుత్వ బాలుర పాలిటెక్నిక్ కళాశాల భవనాల్లో జిల్లా పోలీసు సూపరింటెండెంట్ కార్యాలయాన్ని ఏర్పాటు చేసి పాలన మొదలుపెట్టారు. అదే సమయంలో రాజంపేట మార్గంలోని ఓదివీడు సమీపంలో ఉన్న మైనార్టీ పాలిటెక్నిక్ కళాశాల భవనంలో 19 ప్రభుత్వ శాఖల జిల్లా కార్యాలయాలను ఏర్పాటు చేశారు. ఇక ఆర్డీవో కార్యాలయం, జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయంతో పాటు మరికొన్ని ప్రభుత్వ కార్యాలయాలు అద్దె భవనాల్లో నడుస్తున్నాయి.

ఖాళీ చేయాల్సిన కార్యాలయాలు ఇవే..

ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్‌ఈ, ఏపీఎంఐపీ, డీపీఓ, అగ్రికల్చర్, హార్టికల్చర్, పంచాయతీరాజ్, డ్వామా, మత్స్యశాఖ, జిల్లా స్పోర్ట్స్ కార్యాలయం, బీసీ సోషియల్ వెల్ఫేర్, ఎస్సీ సోషియల్ వెల్ఫేర్, భూగర్భశాఖ, డీఆర్‌డీఏ, ఏపీ ఫైబర్ నెట్, జిల్లా సహకార శాఖ, ట్రైబల్ వెల్ఫేర్, ఎస్టీ గురుకుల శాఖ, మార్కెటింగ్, ఆడిట్ కార్యాలయాలు ఉన్నాయి.

అద్దె భవనాలు దొరికేనా ?

ఇప్పుడు ఉన్నపలంగా ప్రభుత్వ కార్యాలయాలను ఖాళీ చేసి.. అద్దె భవనాల్లో చేరడానికి అందుబాటులో అనువైన భవనాలు దొరుకుతాయా ? అనే అనుమానాలు అధికారులు వ్యక్తం చేస్తున్నారు. కొత్తగా జిల్లా ఏర్పడిన రోజుల్లోనూ.. అద్దెభవనాల కోసం పలువురు శాఖల అధికారులు పట్టణంలోని నలుమూలలా తిరిగి.. కొన్నిచోట్ల ఇళ్ల మధ్య కార్యాలయాలను ఏర్పాటు చేశారు. అనంతరం రాయచోటి పట్టణంలో ఇళ్ల అద్దెలను భారీగా పెంచేశారు. ఈ పరిస్థితుల్లో ప్రభుత్వ కార్యాలయాలకు అద్దె భారీగా చెల్లించాల్సి వస్తుంది.

రెండేళ్లని అప్పుడే చెప్పారా ?

మైనార్టీ పాలిటెక్నిక్ కళాశాలలో జిల్లా కార్యాలయాలను ఏర్పాటు చేసే ముందే.. రెండేళ్ల తర్వాత.. ఖాళీ చేయాలని సంబంధిత అధికారులు చెప్పినట్లు తెలిసింది. అయితే వైసీపీ ప్రభుత్వం ఎంతో ఆర్భాటంగా జిల్లాను ఏర్పాటు చేసిందే కానీ.. జిల్లా కేంద్రంలో ప్రభుత్వ శాఖలకు కార్యాలయాలను నిర్మించేందుకు దృష్టి పెట్టలేదని పలువురు ఆరోపిస్తున్నారు. రింగురోడ్డు సమీపంలో ఇంటిగ్రేటెడ్ కలెక్టరేట్ పేరుతో రూ.వంద కోట్లతో నిర్మాణం చేపడతామని హడావిడి చేసినా.. పైసా కూడా విదించలేదు. దీంతో అది కార్యరూపం దాల్చలేదు. ఈ నేపథ్యంలో 16 ప్రభుత్వ శాఖల జిల్లా కార్యాలయాలకు అద్దె భవనాలను వెతుక్కోవాల్సి వచ్చిందని పలువురు పేర్కొంటున్నారు. వైసీపీ చేసిన పాపం.. ప్రజలకు శాపంగా మారుతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



మైనార్టీ పాలిటెక్నిక్ కళాశాల ఆవరణలో ఏర్పాటు చేసిన ప్రభుత్వ కార్యాలయాల సముదాయం


మదనపల్లెలో విరబూసిన మామిడి పూత

అన్నమయ్య జిల్లా మామిడి సాగుకు పెట్టింది పేరు. ఇటు జిల్లా ప్రధాన కేంద్రం రాయచోటి మొదలు మదనపల్లె వరకు, అటు రాజంపేట మొదలు రైల్వేకోడూరు వరకు మామిడి తోటలకు ప్రసిద్ధి. సాధారణంగా డిసెంబరు నెల నుంచీ పూత రావాల్సి ఉండగా మదనపల్లెలో జనవరి వరకు పూత రాకపోవడంతో రైతులు ఆశలు వదులుకున్నారు. ఎండప్రభావం తోడుకావడంతో ఆలస్యంగా ఫిబ్రవరి చివరిలో వాతావరణ మార్పులు చోటుచేసుకోవడంతో పూత వచ్చింది. దీంతో ఆ ప్రాంత రైతుల్లో ఆనందం చిగురిస్తే ఇదే జిల్లాలోని రాయచోటి ప్రాంతమైన గాలివీడులో ఒక వైపున పూత ఉన్నా మరో వైపు పూత సరిగ్గా రాలేదు. తెగుళ్ల సోకడం, వాతావరణ ప్రభావం, పొగమంచు ఏర్పడడమే ఇందుకు కారణమని రైతులు చెబుతున్నారు. కాగా ఈఏడాది ఆలస్యంగానైనా వచ్చిన పూత సరిగా లేదు. అంతేకాకుండా వచ్చిన పూత కూడా పింజ దిగకుండా రాలిపోవడంతో రైతుకు కంటిమీదు కునుకు లేదాయె. ఈ విషయంలో అటు రైతులు, ఇటు తోటలను గుత్తకు తీసుకున్న వ్యాపారులు ఆందోళన చెందుతు న్నారు. ఈ విపత్కర పరిస్థితుల్లో ఉద్యాన అధికారులు రైతులకు సూచనలు చేస్తే మామిడి తోటలు సాగుదారులు కనీసం కొంతవరకైనా ఆదాయం పొందవచ్చని పలువురు రైతులు కోరుతున్నారు. వివరాల్లోకెళితే.....


పందికుంటలో సరిగ్గా రాని పూత

చిగురిస్తున్న ఆశలు

మదనపల్లె అర్బన్, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): సాధారణంగా డిసెంబరు నెలలో మామిడి పూత దశకు వస్తుంది. అప్పటి నుంచే మామిడి రైతులు రకర కాల సతవలు చెట్టుకు ఇస్తూ వస్తుంటారు. అయితే ఈఏడాది అను కోకుండా వచ్చిన తుపాన్‌లు, పొగ మంచు ప్రభావంతో వాతావరణ పరిస్థితులు అనుకూలంగా లేవని రైతులు భావించారు. అయితే జనవరి వరకు మామిడి పూత కనబ డక పోవడంతో రైతులు ఆశలు వదులుకున్నారు. ఎండ ప్రభావం తోడు కావడంతో ఆలస్యంగా ఫిబ్రవరి ప్రారంభం కాగానే పరిస్థితులు మార డం, పూత వస్తుండడంతో రైతుల్లో ఆశలు చిగురించాయి. ఫిబ్రవరి చివరిలో మామిడి తోటల్లో ఎక్కడ చూసినా పూతతో చెట్లు కళకళలాడుతున్నాయి. అప్పటికే పూతతో పాటు చెట్లల్లో పిందెలు కనబడుతున్నాయి. జిల్లా వ్యాప్తంగా 40 వేల హెక్టార్లలో మామిడి



- జిల్లాలో ఇబ్బడిగా మామిడిపూత
- 40 రకాలకు పైగా మామిడి సాగు
- యాజమాన్య పద్ధతుల్లో సాగు చేయాలి
- పూతను కాపాడుకుంటున్న రైతులు

సాగు చేస్తుండగా అందులో 40 రకాల మామిడి కాయలు సాగుచేస్తున్నారు. దీంతో రైతులు ఈ ఏడాది పంట బాగా ఉంటుందని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

ఆలస్యంగా మామిడి పూత

జిల్లాలోని పలు ప్రాంతాల్లో మామిడి పూత ఈ ఏడాది ఆలస్యంగా కనిపిస్తోందని రైతులు చెబుతున్నారు. ప్రస్తుతం జిల్లాలో మామిడితోపుల్లో ఇబ్బడి ముబ్బడిగా పూత కనిపిస్తోంది. మామిడి పంట సాధారణంగా డిసెంబరులో కొద్దిగా జనవరిలో పూర్తి పూత కనపడాల్సి ఉండగా ఈ సారి ఆలస్యంగా ఫిబ్రవరిలో పూత అల్లుకుంది. జిల్లాలోని చాలా మండలాల్లో ఇప్పుడి ప్పుడే పూత వస్తుడడంతో మామిడి రైతులు పంటపై ఆశలు పెట్టుకున్నారు. మరో పక్క మామిడి పూత రాలిపోకుండా నివారించేందుకు క్రిమిసంహారిణి పిచికారీ చేస్తూ పూత రాలకుండా కాపాడుకుంటున్నారు. ఇక యాజమాన్య పద్ధతులు పాటిస్తే ఈ ఏడాది కూడా మంచి దిగుబడి చేతికి వస్తుందని నిపుణులు చెబుతున్నారు.

జిల్లాలో 40 వేల హెక్టార్లలో మామిడి సాగు

అన్నమయ్య జిల్లాలో సుమారు 40 వేల హెక్టార్లకు పైగా రైతులు మామిడిని సాగు చేస్తున్నట్లు అధికారులు చెబుతున్నారు. ముఖ్యంగా జిల్లాలోని పలు ప్రాంతాలైన రైల్వేకోడూరు, రాయచోటి ప్రాంతాల్లో ఎక్కువగా సాగులో ఉన్నా ఆ తరువాత మదనపల్లె, రాజంపేట, పీలేరు, తంబళ్లపల్లె ప్రాంతాల్లో మామిడి తోటల సాగు పెరుగుతోంది. ఏటా మామిడి సాగు పెరుగుతోంది. రానురాను భవిష్యత్‌లో జిల్లాలో మామిడి సాగుకు ప్రసిద్ధి చెందుతుంది. వివిధ రకాల మామిడి కాయలు సాగు చేస్తూ ఇక్కడ రైతులు ఇతర రాష్ట్రాలకు ఎగుమతులు చేస్తున్నారు. ఈ ఏడాది మామిడి పూత ఆలస్యమైనా మెండుగా రావడంతో రైతుల ఆశలు చిగురిస్తున్నాయి. కాగా పూత తగ్గట్టుగా దిగుబడి వచ్చిందంటే మామిడిలో ఆశించినంత ఆదాయం వస్తుందని రైతాంగం ఆశిస్తోంది.

నాలుగు నెలలు మామిడి మార్కెట్....

జిల్లాలో పండించిన మామిడి పంటకు ఇతర రాష్ట్రాల్లో కూడా డిమాండ్ ఉంటుంది. ఇక్కడ ఎక్కువగా బేనీషా, నీలం, బెంగళూరు, లాల్‌బహార్, మల్‌గూబ, తోతాపురి, ఇమామ్, పసందు, ఎర్రనీలం, ఇతర అనేక రకాల మామిడి మార్కెట్‌లో అందుబాటులో ఉంటాయి. ప్రధానంగా రైల్వేకోడూరు ప్రాంతంలో మామిడి మార్కెట్ కళకళలాడుతుంటోంది. నాలుగు నెలల పాటు సీజన్‌లో మార్కెట్ ఉంటుంది. జిల్లాలోని దాదాపు అన్ని ప్రాంతాల నుంచి ముఖ్యంగా రైల్వేకోడూరు మార్కెట్ నుంచి ఢిల్లీ, హరియాణ, చండీఘర్, బెంగళూరు విజయవాడ, హైదరాబాదు, చైన్నై తదితర ప్రాంతాలకు జిల్లా నుంచి నిత్యం రవాణా జరుగుతోంది. వీరబల్లి, సుండుపల్లె ప్రాంతాల్లో పండించిన బేనీషాకు అధికంగా డిమాండ్ ఉంటుంది. ఇతర రాష్ట్రాల వ్యాపారులు కూడా ఈ ప్రాంతాల్లో పండిన మామిడిని ఎక్కువగా ఇష్టపడుతుంటారు. జిల్లాలో మామిడి పంట జూలై వరకు వస్తూనే ఉంటుంది.

ఆశ నిరాశల మామిడి

గాలివీడు, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): మామిడి రైతుకు ఈ ఏడాదిపూత దశలోనే కష్టకాలం మొదలైంది. సాధారణంగా డిసెంబరు తొలివారంలోనే పూతతో నిండుగా కనిపించే మామిడితోటలు ఫిబ్రవరి వచ్చినా సగం చెట్లే పూత దశకు చేరుకున్నాయి. గాలివీడు మండలం నూలివీడు, సీ.సీపల్లె, ఎగువగొట్టివీడు, గోరాన్చెరువు, గోపనపల్లె, పేరంపల్లె, గుండ్లచెరువుతో పాటు అన్ని పంచాయతీల్లో దాదాపుగా మూడు వేల ఎకరాలకు పైన మామిడి తోటలను రైతులు సాగు చేస్తున్నారు. నవంబరు, డిసెంబరు నెలల్లో సక్రమంగా వర్షాలు కురవక పోవడం, వాతావరణంలో మార్పుల వలన ఈ సారి పూత ఆలస్యమైందని రైతులు తెలియజేస్తున్నారు. అయితే తేనె మంచు పురుగు, నల్లి తదితర తెగుళ్లతో పూతదశలోనే చాలా వరకు రాలిపోతోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

వాతావరణ పరిస్థితుల ప్రభావం

వాతావరణ పరిస్థితులకు అనుగుణంగానే మామిడి పూత, కాపు ఆధారపడిపడి దిగుడిపై ప్రభావం చూపుతోంది. ఉష్ణోగ్రతలు తక్కువగా ఉంటే పూత సక్రమంగా రాదు. పూత వచ్చినవి కూడా విచ్చుకోక రాలిపోతోందని రైతులు వివరిస్తున్నారు. ఉష్ణోగ్రతలో పూత ఆలస్యం కావడం, వచ్చిన పూత కూడా సక్రమంగా నిలవక పోవడంతో దిగుబడిపై తీవ్ర ప్రభావం పడుతుందన్నారు. సాధారణంగా పూతను బట్టి లేత, పిందె దశలోనే దిగుబడిపై అంచ నాలు ఉంటా యని, ప్రస్తుత పరిస్థితుల్లో దిగుబడి అంచనాలు ఉంటాయి. అయితే దిగుబడి కూడా చెప్పలేని పరిస్థితుల్లో రైతులు ఆందోళన చెందుతున్నారు.

తీవ్రమైన తెగుళ్లు

పదేళ్ల కిందట మామిడి తోటలకు తెగుళ్లు సోకేవి కావని అప్పుడు ఒక్కసారి కూడా తెగుళ్లకు మందులు పిచికారీ చేసేవాళ్లము కాదని రైతులు అంటున్నారు. కానీ నేడు మామిడి తోటలకు ఎక్కువగా తెగుళ్లు సోకుతున్నాయని అక్టోబరు నుంచి ఇప్పటి వరకు ప్రతి నెలా మందులను కొట్టినా తెగుళ్ల తగ్గలేదన్నారు.

సబ్సిడీపై ఎరువులు

క్రిమిసంహారిణులు ఇవ్వాలి



ఏడాదికి ఒక ఎకరాకు రూ.30 వేల నుంచి రూ.40 వేల వరకు ఖర్చు అవుతోంది. ఎకరాకు రెండు టన్నుల దిగుబడి వస్తే ఉన్న రూ.30వేలకు పైబడి ధర పలి కితే పెట్టుబడి మాత్రమే వస్తోంది. అంతకన్నా తక్కువ దిగుబడి వస్తే తీవ్రంగా నష్టపోతాము. కావున ప్రభుత్వం మామిడి సాగురైతులకు కూడా సబ్సిడీపై ఎరువులు, పురుగు మందులు ఇచ్చి ఆదుకోవాలి.

- నక్కల యోగాంజుల్‌రెడ్డి, నూలివీడు

ఈ సారి అన్నీ సమస్యలే



మా కుటుంబం ఐదెకరాల్లో మామిడిని సాగు చేశాము. పూత రాక ముందు నుంచి ఇప్పటి వరకు నాలుగుసార్లు మందులను వాడినాము. ఎకరాకు 10 వేలకుపైన మందులను ఖర్చు చేశాము. అయినా పూత సక్రమంగా నిలబడలేదు. వచ్చిన పూత, పింజ దశ నుంచి కాయ దశ వరకు కూడా ఇంకా అనేక సార్లు మందులను వాడాలి, దిగుబడి ఎక్కువగా ఉంటే నష్టాలు రావు. దిగుబడి తక్కువగా ఉంటే తీవ్రంగా నష్టపోతాం.

- సుదర్శన్‌రెడ్డి, పందికుంట, గాలివీడు మండలం

- పూత ఘనం, పింజ శూన్యం
- పూతను నలిచేస్తున్న తెగుళ్లు
- నిరాశలో మామిడి సాగు రైతులు, వ్యాపారులు

ముఖ్యంగా పొగమంచు కురవడంతో పూతకు ఎక్కువగా తెగుళ్లు సోకుతున్నాయని తెలిపారు. ప్రస్తుతం మామిడి చెట్లకు, పూతకు పచ్చతెగుళ్లు, మంచు తెగుళ్లు, బూడిద తెగుళ్లు, పక్షికన్ను తెగుళ్లు, తామర పురుగు తెగుళ్లు సోకుతున్నాయని తెలిపారు. ఈ తెగుళ్లు సోకడంతో పూత అంతా పింజ పట్టకుండా రాలిపోతోందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ ఏడాది సకాలంలో వర్షాలు లేక పోవడంతో వరి, వేరేశనగ వంటి ఆదాయం వచ్చే పంటలను సాగు చేయలేదని రైతులు పేర్కొన్నారు. ఈ ఏడాదైనా మామిడి మామిడి తోటలు దిగుబడి ఎక్కువగా ఉంటారని ఆశపడినా ప్రస్తుత పరిస్థితులను బట్టి చూస్తే పంట అంత ఆశాజనకంగా లేదన్నారు. ప్రస్తుతం మామిడి తోటలకు పూత ఏపుగా రావడానికి,వచ్చిన పూత, పింజగా మారానికి ఇప్పటికే వేలకువేలు ఖర్చు పెట్టి వివిధ రకాల మందులను కొట్టినా పింజ సక్రమంగా పట్టలేదన్నారు. ఇదే పరిస్థితులు కొనసాగితే ఒక్కొక్కరు లక్షల్లో నష్టపోవాల్సి వస్తుందన్నారు.

లారీ, టాటాఏసీ ఢీ - డ్రైవర్ మృతి

మదనపల్లె అర్బన్, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): లారీ, టాటాఏసర్ ఢీకొనడంతో టాటాఏసర్ డ్రైవర్ మనోహర్ (24) అక్కడికి అక్కడే మృతి చెందాడు. ముదివేడు పోలీసుల కథనం మేరకు వివరాల్లోకెళితే... ములకలచెరువు మండలం, సోంపాళెం గ్రామం, రాయప్పగారిపల్లె వాసి ఉత్తన్న కుమారుడు మనోహర్ డ్రైవరుగా ఉన్నాడు. పనిలో భాగంగా ములకలచెరువు నుంచి మదనపల్లెలోని నీరుగట్టువారిపల్లె టమోటా మార్కెట్‌కు లోడుతో గురువారం రాత్రి వచ్చి టమోటాలు దించాడు. శుక్రవారం తెల్లవారు జామున తిరుగు ప్రయాణంలో కురబలకోట సమీప బ్రిడ్జిపై ములకలచెరువు నుంచి చైన్నై వైపు వెళ్లతున్న లారీ టాటాఏసర్ రెండూ ఎదురుఎదురుగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో డ్రైవర్ మనోహర్ రెండు వాహనాల మధ్యలో ఇరుక్కుని చనిపోయాడు. పోలీసులు మృతదేహాన్ని ఎక్స్‌కవేటర్‌తో వెలికి తీసి శవ పరీక్ష కోసం మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ముదివేడు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

బెంగుళూరులో గురుకుల విద్యార్థినుల సందడి



బెంగళూరులో విప్రో అవార్డుల కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థినులు

కలికిరి, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): బీసీ బాలికల గురుకుల పాఠశాల విద్యార్థినులు బెంగళూరులోని విప్రో అజీమ్ ప్రేమ్‌జీ యూనివర్సిటీలో శుక్రవారం సందడి చేశారు. విప్రో ఎర్తియన్-24 పోటీల్లో పాల్గొన్న ఐదుగురు విద్యార్థినులు జాతీయ స్థాయిలో అవార్డు సాధించిన విషయం తెలిసిందే. దేశ వ్యాప్తంగా మొత్తం 23 పాఠశాలలు జాతీయ స్థాయి అవార్డుకు ఎంపిక కాగా అందులో దక్షిణాదిన ఐదు రాష్ట్రాల నుంచి కలికిరి గురుకుల విద్యార్థినులు చోటు దక్కించుకోవడం విశేషం. రెండు రోజులు జరుగుతున్న అవార్డుల ప్రదాన ఉత్సవాల్లో వీరు పాల్గొంటున్నారు. శుక్రవారం ఒక్కో విద్యార్థినిని ఒక్కో రాష్ట్రం విజేతలతో కలిపి ప్రదర్శనలు, వర్క్‌షాపులు నిర్వహించారు. కలికిరి బీసీ గురుకుల పాఠశాలకు చెందిన కె.ఖ్యాతి, జె.రూపిక, టి.భవ్యశ్రీ, ఎం.చందన అగర్వాల్, పి.సుప్రియ జాతీయస్థాయి అవార్డును చేజిక్కించుకున్నారు. ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ అప్సానా ఆధ్వర్యంలో వీరు నిర్వహించిన పెప్పెట్రీ (తోలుబొమ్మలాట), ఆర్ట్ గ్యాలరీ, స్టోరీ టెల్లింగ్, విజువల్ ఆర్ట్ కార్యక్రమాలు ఆకట్టుకున్నాయని తెలిపారు. సీపీ రామస్వామి ఎన్విరాన్‌మెంటల్ ఎడుకేషన్ సెంటర్ (సీపీఆర్ ఈఈసీ)కి చెందిన ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ కోఆర్డినేటర్ వెంకటరత్నం కలికిరి విద్యార్థినులకు సమన్వయకర్తగా వ్యవహరిస్తున్నారు. శనివారం విప్రో ఎక్జిక్యూటివ్ చైర్మన్ రిషద్ ప్రేమ్‌జీ, అజీమ్ ప్రేమ్‌జీ, ఫౌండేషన్ సీఈఓ అనురాగ్ బేహర్ విజేతలకు అవార్డుగా రూ.50 వేల నగదు, ప్రశంసా పత్రాలు అందజేయనున్నారు.

'గ్రామ కంఠాన్ని ఆన్‌లైన్ చేశారు'

నందలూరు, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): సర్వేనంబరు 66/13లో ఎకరా 60 సెంట్లు గ్రామకంతం స్థలాన్ని కొందరు ఆన్‌లైన్ చేసుకున్నారని కుంపిణీపురం వాసులు ఆరోపించారు. గ్రామస్థులు మాట్లాడుతూ నూకినేనిపల్లె పంచాయతీ సర్వేనంబరు 66/13లో ఒక ఎకరా 60 సెంట్లు గ్రామకంతం స్థలం ఉందన్నారు. అందులో దాదాపు 20 ఇళ్లు, కొన్ని పాడుబడిన ఇళ్లు ప్రభుత్వ రోడ్, చేతిబోరు ఉన్నాయన్నారు. ఇక్కడే సుమారు 40 ఏళ్లగా వివిధ కులాలవారం జీవిస్తున్నామని, నేడు కొందరు వచ్చి ఆ స్థలం మాది అని మా పేరుతో రిజిస్టర్ అయిందని ఖాళీ చేయాలని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో ఆ స్థలంలోనే కుమ్మరి కుండలు చేసుకుని అమ్ముకునేవారని తెలిపారు. రెవెన్యూ వారిని మోసగించి వారిపేరుతో ఆన్‌లైన్ చేసుకున్నారన్నారు. 2024 డిసెంబరులో ఆ స్థలాన్ని రిజిస్టర్ చేసుకున్నారన్నారు. ఇప్పుడు వారు దౌర్జన్యంగా తాము నివశిస్తున్న స్థలాల్లో ఎక్స్‌కవేటర్లు పెట్టి చదును చేస్తూ తమను ఖాళీ చేయమని బెదిరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

వ్యక్తి ఆత్మహత్య

పుల్లంపేట, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): కుటుంబ సమస్యల కారణంగా కొండే నాగిరెడ్డి(43) గురువారం రాత్రి ఉరివేసుకున్నట్లు పుల్లంపేట పోలీసులు తెలిపారు. పోలీసుల కథనం మేరకు కేతవాండ్లపల్లె వాసి కొండే నాగిరెడ్డి కూలి పనులు చేసుకుంటూ జీవిస్తున్నాడు. నాలుగు నెలల కిందట యాక్సిడెంట్ జరగడంతో గాయపడి కోలుకున్నాడు. ప్రమాద సమయంలో గుండెపోటు వచ్చిందని, ఆరోగ్య సమస్యలు, కుటుంబ సమస్యలు తోడవడంతో ఇంట్లో ఉన్న కొక్కీకి లుంగీతో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

గిట్టుబాటు ధరలపై చర్యలు

క్రేటుకు రూ.300 ధర కల్పించండి: ఎమ్మెల్యే ● టమోట రైతులతో సబ్‌కలెక్టర్ ముఖాముఖి

నెల్లూరు, కావలి రైతుబజార్లకు మదనపల్లె టమోటా

మదనపల్లె టౌన్, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో మిర్చి ధరలు పడిపోతున్న నేపథ్యంలో రాబోయే రోజుల్లో టమోటకు గిట్టుబాటు ధరలు కల్పించాలని ప్రభుత్వం చర్యలకు ఉపక్రమించింది. కలెక్టర్ సూచనలతో మార్కెటింగ్ అధికారులతో కలసి సబ్‌కలెక్టర్ మేఘస్వరూప్ క్షేత్రస్థాయిలో వెళ్లి రైతులను, మార్కెట్‌యార్డులో వ్యాపారులు, అధికారులతో చర్చించారు. శుక్రవారం మదనపల్లె మండలం కాశీరావుపేట వద్ద టమోట రైతులతో సబ్‌కలెక్టర్ మాట్లాడుతూ ప్రస్తుతం మార్కెట్ లో టమోట ఎంత ధర, ఖర్చు, గిట్టుబాటుపై ప్రశ్నించారు. రైతులు మాట్లాడుతూ కిలో టమోటాకు రూ.12 ధర వస్తే గిట్టుబాటు అవుతుందని, పెట్టుబడి తిరిగి వస్తుందన్నారు. మార్కెటింగ్ ఏడీ త్యాగరాజు, ఏపీ మాస్ ప్రతినిధి మధుసూదన్ రెడ్డితో సబ్‌కలెక్టర్ చర్చించారు. బయట మార్కెట్‌కు రైతుల పొలం నుంచే టమోటా తరలిస్తే ఎలా వుంటుందని, అక్కడి ధరలు, ఇక్కడ ధరలు సరిపోల్చారు. సబ్‌కలెక్టర్ మాట్లాడుతూ డివిజన్‌లో ఏయే మండలాల్లో టమోట దిగుబడి వస్తుందో అక్కడికి వెళ్లి రైతులతో చర్చించి, వారికి గిట్టుబాటు ధరలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటామ న్నారు. అనంతరం టమోటా మార్కెట్‌లో ఎమ్మెల్యే షాజహాన్‌బాషాతో కలసి రైతులు, వ్యాపారులతో సబ్‌కలెక్టర్ చర్చించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రస్తుతం కిలో టమో టా కనిష్టంగా రూ.6 నుంచి గరిష్టంగా రూ.10 వరకు ధరలు పలుకుతున్నాయని, దీని వలన రైతులకు గిట్టుబాటు ధరలు రావడం లేదన్నా రు. 25 కిలోల క్రేట్ టమోటా రూ.300 నుంచి రూ.350 ధర కల్పించేలా అధికారులు చర్యలు తీసుకోవాల్సిన అవసరం వుందన్నారు. మదనపల్లె టమోటా యార్డులో నిత్యం 60 నుంచి 70 మెట్రిక్ టన్నులు టమోట విక్రయానికి వస్తున్నాయని, భవిష్యత్‌లో పెరిగితే తీసుకోవాల్సిన చర్యలపై మార్కెటింగ్ ఏడీఎంతో ఎమ్మెల్యే చర్చించారు. హార్టికల్చర్ అధికారి ఈశ్వర ప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.


కాశీరావుపేట వద్ద తోటలో టమోట రైతులతో మాట్లాడుతున్న సబ్‌కలెక్టర్ మేఘస్వరూప్

నెల్లూరు, కావలికి మదనపల్లె టమోట

మదనపల్లె టమోట యార్డు నుంచి నెల్లూరు, కావలి రైతుబజార్లకు 10 టన్నుల టమోట ఎగుమతి చేస్తున్నామని సబ్‌కలెక్టర్ మేఘస్వరూప్ ప్రకటించారు. శుక్రవారం మార్కెటింగ్ ఏడీ త్యాగరాజు ఆధ్వర్యంలో మదనపల్లె టమోట మార్కెట్‌లో రైతుల నుంచి కిలో రూ.8.46 పైసలు చొప్పున టమోటలను కొనుగోలు చేశారు. రైతుల నుంచి కొనుగోలు చేసిన 10 టన్నుల టమోటను నెల్లూరు, కావలి రైతు బజార్లకు రవాణా చేశారు. ఏడీఎం మాట్లాడుతూ పై రెండు రైతుబజార్లలో ప్రజలకు టమోట కిలో రూ.12 చొప్పున విక్రయిస్తామన్నారు. ధరలు స్థిరీకరణ అయ్యేంత వరకు మదనపల్లెలో టమోటలను కొనుగోలు చేసి రైతుబజార్లకు తరలిస్తామ న్నారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖ ఏడీ శివశంకర్, హార్టికల్చర్ అధికారి ఈశ్వరప్రసాద్, యార్డు సెక్రటరి తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ బస్సులు నడపాలి

అర్హులకు పదోన్నతులు ఇవ్వాలి ● కారుణ్య నియామకాలు చేపట్టాలి

● పీలేరులో ఎంప్లాయీస్ యూనియన్(ఈయూ) రాష్ట్ర అధ్యక్షుడు పలిశెట్టి దామోదరరావు

పీలేరు, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీలో కొత్తగా వస్తున్న విద్యుత్ బస్సులను ప్రభుత్వమే కొనుగోలు చేసి నిర్వహించాలని ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు పలిశెట్టి దామోదరరావు డిమాండ్ చేశారు. పీలేరులోని ఆర్అండ్‌బీ అతిథి గృహంలో శుక్రవారం జరిగిన ఎంప్లాయీస్ యూనియన్ జనరల్ బాడీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాలుష్య నివారణ, ప్రజలకు మెరుగైన వసతులు కల్పించాలన్న లక్ష్యంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 2035 నాటికి డీజిల్ బస్సుల స్థానంలో పూర్తిగా విద్యుత్ బస్సులు ఏర్పాటు చేయాలని నిర్ణయించారన్నారు. అయితే విద్యుత్ బస్సులను పూర్తిగా ప్రైవేటు సంస్థల ద్వారా నడపకుండా ప్రభుత్వమే కొనుగోలు చేసి నిర్వహించాలన్నారు. తద్వారా ఆర్టీసీలోని సిబ్బందిని కాపాడడమే కాకుండా నిరుద్యోగ సమస్యను తగ్గించవచ్చన్నారు. ఆర్టీసీలో ఇప్పటికే 35 శాతం అద్దె బస్సులు నడుస్తున్నాయని, విద్యుత్ బస్సుల రాకతో ఆ శాతం మరింత పెరిగే అవకాశం ఉందన్నారు. ప్రైవేటీకరణ కారణంగా తమ ఉద్యోగాలు ఉండవేమోనన్న ఆందోళనలో ఆర్టీసీ ఉద్యోగులు ఉన్నారన్నారు. ప్రైవేటు ఆపరేటర్ల కారణంగా ఇప్పటికే సంస్థకు చెడ్డ పేరు వస్తోందని, అలా కాకుండా ప్రస్తుతం ఉన్న సిబ్బందికి శిక్షణ ఇచ్చి విద్యుత్ బస్సుల్లో నియమించాలన్నారు. విద్యుత్ బస్సుల కారణంగా ఇప్పటికే తిరుపతిలోని అలిపిరి డిపో పూర్తిగా మూతపడిందన్నారు. రాష్ట్ర విభజన నాటికి ఆర్టీసీలో 62 వేల మంది సిబ్బంది ఉంటే ప్రస్తుతం 47 వేల మంది రెగ్యులర్ ఉద్యోగులు, 8 వేల మంది ఔట్ సోర్సింగ్ సిబ్బంది ఉన్నారన్నారు. వీరు కాకుండా అద్దె బస్సు డ్రైవర్లు, ఆన్ కాల్ డ్రైవర్లు మరో 20 వేల మంది పనిచేస్తున్నారన్నారు. ప్రస్తుతం సంస్థలో ఖాళీగా ఉన్న 12 వేల ఖాళీల్లో అర్హత ఉన్న వారిని పదోన్నతులు కల్పించాలని, రెగ్యులర్ ప్రాతిపదికన నియామకాలు చేపట్టాలన్నారు. అలాగే చాలా కాలంగా పెండింగ్‌లో ఉన్న కారుణ్య నియామకాలు కూడా పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో జోనల్ నేతలు జీఎస్‌మణ్యం, అన్నమయ్య జిల్లా అధ్యక్షులు ఆనంద బాబు, కార్యదర్శి బీసీ శేఖర్, పీలేరు డిపో అధ్యక్షులు ఏఆర్ చంద్ర, కార్యదర్శి ఖాదర్ బాషా, సీసీఎస్ డెలిగేట్స్ కేవీ రమణ, వేణు, జిల్లా కమిటీ సభ్యులు శోభారాణి, శ్రీనివాసులు, ప్రదీప్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న పలిశెట్టి దామోదరరావు

ఉరి వేసుకుని యువకుడు మృతి



రాజంపేట టౌన్, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): హత్యరాల సమీపంలో సింగమల హరిప్రసాద్(32) చెట్టుకు ఉరేసుకున్నాడు. పుల్లంపేట మండలం రామక్కపల్లె హరి జన వాడ వాసిగా పోలీసులు గుర్తించారు. విషయాన్ని తల్లి ఆదెమ్మకు తెలపడంతో కుమారుడు మృతదేహం చూసి ఆమె విలపించింది. తండ్రి నరసింహులు మృతి చెందిన ప్పటి నుంచీ హరిప్రసాద్ మతిస్థిమితం కోల్పోయి అనారోగ్యంతో బాధపడు తున్నాడని ఆమె తెలిపారు. ఐదు రోజులుగా హరిప్రసాద్ ఇంటి నుంచి వెళ్లిపోయాడని తల్లి ఆవేదన వ్యక్తం చేసింది. మన్నూరు పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

వెలుగొచ్చింది



మదనపల్లె, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): ప్రజాసమస్యల పరిష్కారమే ధ్యేయంగా ముందుకెళ్తున్న ఆంధ్రజ్యోతి చేపట్టిన 'అక్షరం అండగా.. పరిష్కారమే అజెండా'లో ప్రజలు ప్రస్తావించిన సమస్యలకు మున్సిపల్ అధికారులు శుక్రవారం స్పందించారు. మదనపల్లె పట్టణం ప్రశాంత్‌నగర్ 30వ వార్డులో జనవరి 28న జరిగిన కార్యక్రమంలో ప్రశాంత్ నగర్‌లోని వివిధ లేన్లు, సప్తగిరినగర్ ఏరియాల్లో విద్యుత్తు దీపాలు వెలగడం లేదని స్థానికులు ప్రస్తావించారు. దీనిపై స్పందించిన మున్సిపల్ కమిషనర్ కె.ప్రమీల ఇచ్చిన హామీ మేరకు సామగ్రి తెప్పించి పది వీధిలైట్లు ఏర్పాటు చేశారు. మున్సిపల్ డీఈ శ్రావణి, వార్డు అమెనిటీ సెక్రటరీ మానస, స్థానిక టీడీపీ నాయకుడు భాస్కర్ ముందుండి ఏర్పాట్లు చేశారు. ప్రశాంత్ నగర్‌లో ఒకటో లైన్ నుంచి తొమ్మిదో లైన్ వరకు, సప్తగిరినగర్‌లోని వివిధ ఏరియాల్లో మరమ్మతులకు గురైన లైట్లను తొలగించి కొత్తవాటిని ఏర్పాటు చేశారు. రాత్రివేళల్లో వీధి లైట్లు లేక అంధకారంలో ఉంటున్న స్థానికులు.. వీధిలైట్ల ఏర్పాటుతో సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఇదే కార్య క్రమంలో ఎ.వి.నాయుడు కాలనీలో ఓవర్ హెడ్ ట్యాంకు వద్ద, ట్యాంకు ఆవరణలో పారిశుధ్యం అధ్వానంగా ఉందని, కాల్వలు శుభ్రం చేయాలని స్థానికులు సమస్యలను పాలకులు, అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. ఇందులో భాగంగా మున్సిపల్ కమిషనర్ వారం కిందటే పారిశుధ్య కార్మికుల చేత గ్యాంగ్‌వర్క్స్ చేయించిన విషయం పాఠకులకు తెలిసిందే. ఆంధ్రజ్యోతి ద్వారా వెలుగులోకి వచ్చిన వివిధ సమస్యలను అంచెలంచెలుగా పరిష్కరిస్తామని కమిషనర్ పేర్కొన్నారు.


మరమ్మతుల అనంతరం వెలుగుతున్న వీధిలైటు

ప్రశాంత్‌నగర్‌లో విద్యుత్ స్తంభానికి వీధిలైటు ఏర్పాటు చేస్తున్న మున్సిపల్ సిబ్బంది



జలగల్లా... వడ్డీ వ్యాపారులు

పులివెందుల టౌన్, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో వడ్డీ వ్యాపారులు చెలరేగిపోతున్నారు. నూటికి 5, 10, 15 వడ్డీలు వసూ లు చేస్తూ సామాన్యులను జలగల్లా పీలుస్తున్నారు. పేద మధ్యతర గతి వారి అవసరాలను ఆసరాగా చేసుకుని వడ్డీలు కాజేస్తున్నారు. కొందరు సంస్థ పేరుతో రిజిస్ట్రేషన్ చేయించుకుని వడ్డీ వ్యాపారాలు చేస్తుండగా మరికొంత మంది ఎలాంటి రిజిస్ట్రేషన్లు లేకుండా అనధికారికంగా అప్పులు ఇచ్చి వసూళ్లకు పాల్పడుతున్నారు. ముఖ్యం గా ఆస్తులను రిజిస్ట్రేషన్ చేసుకుని అప్పులు ఇచ్చి అధిక వడ్డీలు గుంజుతున్నారు. ఇలా అప్పులు తీసుకున్న వారిలో కొందరు గతంలో రియల్ ఎస్టేట్ వ్యాపారం కూడా చేశారు. ప్రస్తుతం రియల్ భూం మందగించడంతో అప్పులు తీసుకున్న వ్యక్తులు సకాలంలో చెల్లించలేకపోతున్నారు. ఈనేపథ్యంలో ష్యూరిటీ కోసం రిజిస్ట్రేషన్లు చేసుకున్న ఆస్తులను వడ్డీవ్యాపా రులు స్వాధీనం చేసుకునే ప్రయత్నాలు చేస్తున్నారు, న్యాయబద్ధమైన వడ్డీ చెల్లిస్తామని చెబుతున్నప్ప టికీ వడ్డీ వ్యాపారులు వినిపించుకోవడం లేదు. దీంతో కొన్ని పంచాయితీలు పోలీసు స్టేషన్ వరకు వెళుతున్నాయి. మరికొన్ని వివాదాలకు దారితీస్తున్నాయి.

ఒక్కరోజు ఆలస్యమైనా వడ్డీపై వడ్డీ

నిబంధనలకు లోబడి వడ్డీ వ్యాపారాలు సాగించాల్సిన వ్యాపారులు సామాన్యుడిని పిండేస్తున్నారు. ఒక్కరోజు వడ్డీ చెల్లించడం ఆలస్య మైనా వడ్డీపై వడ్డీ వేస్తున్నారని బాధితులు వాపోతున్నారు. గతంలో ఇలాగే వడ్డీ వ్యాపారులు చెలరేగిపోయిన నేపథ్యంలో హత్యలకు దారితీసిన సంఘటనలు పులివెందులలో చోటుచేసుకున్నాయి. అయి తే కొద్దిరోజులు వ్యాపారులు స్తబ్ధుగా ఉండి మళ్లీ వడ్డీ వ్యాపా రం సాగిస్తున్నట్లు సమాచారం. వడ్డీ వ్యాపారులు మార్కెట్లో బహిరం గంగా 10 నుంచి 15 రూపాయలు వడ్డీలకు నగదు అప్పుగా ఇచ్చి.. అసలు కన్నా వేలకు వేలు వడ్డీల రూపంలో వసూలు చేస్తున్నారని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇక వడ్డీ వసూళ్లలో నగదు ఇచ్చి వడ్డీ వసూలు చేయడం ఒక పద్ధతి అయితే.. రోజువారీ వడ్డీలు చెల్లించేలా చిరు దుకాణాలకు, షాపుల్లో వర్కర్లకు అప్పులు ఇస్తారు. వీరి నుంచి సాధారణంగా పదివేలు టెండరు రూపంలో అప్పుగా తీసకుంటే పరిమితి గడువులో 13వేలు చెల్లించాలి. ఏ ప్రాతిపదికన ఈ వడ్డీని లెక్క కడతారో ఎవరికీ అర్థం కాదు. రూ.200 సంపాదించే కూలీ నుంచి వంద ఈ వడ్డీ వ్యాపారులే కాజేస్తున్నారు. తెలియక అప్పులు తీసుకుని ఇలా ఇరుక్కుపోతున్నామని పలువురు వాపోతున్నారు. ప్రశ్నిస్తే బెదిరిస్తున్నారని చెబుతున్నారు.


పంచాయితీలకు దారితీస్తూ...

పట్టణ పరిధిలో గత ఐదారు నెలల్లో వడ్డీ వ్యాపారుల పంచాయతీలు భారీ స్థాయిలో జరిగాయి. కొంతమంది రియల్ ఎస్టేట్ వ్యాపారుల వద్ద తీసుకున్న రుణాల విషయంలో చివరికి పోలీసుస్టేషన్కు వెళ్లి ఏదోరకంగా పరిష్కారం చేసుకోగా, మరికొన్ని పేచీలతో నడుస్తూనే ఉన్నాయి. గత టీడీపీ ప్రభుత్వంలో వడ్డీ వ్యాపారులు వేధిసున్న సంఘటనలు వెలుగులోకి రావడంతో విజయవాడలో కాల్మనీ కేసులు పెట్టిన విషయం తెలిసిందే. పులివెందుల ప్రాంతంలో ఈ పేచీలు రోజురోజుకూ పెరుగుతుండడంతో బాధితులు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసేందుకు సిద్ధమవుతున్నారు. ఏదోరకంగా న్యాయ బద్ధ వడ్డీతో అప్పులు చెల్లిస్తామని చెబుతున్నా ఆస్తులకు విలువలు పెరగడంతో వడ్డీవ్యాపారులు పేచీలు పెడుతుండడంతో సమస్యలు జటిలమవుతున్నాయి.

ఆన్లైన్ రుణాలతో ఇబ్బందులు

ఇటీవల కాలంలో ఆన్లైన్ రుణాలు తీసుకుని కొందరు యువకులు వారి వత్తిడి తట్టుకోలేక ఇబ్బంది పడుతున్న సంఘటనలు పులివెందులలో వెలుగులోకి వచ్చాయి. ఆన్లైన్లో యువకులను పరిచయం చేసుకుని మాయ మాటలు చెప్పి రుణాలు ఇస్తున్నారు. వారు వసూలు చేసే వడ్డీ చెల్లించలేక యువకులు ఏం చేయాలో పాలుపోక అల్లాడిపోతున్నారు. ఇటీవల పులివెందుల పట్టణంలో చిన్నకొండారెడ్డి కాలనీలో ఓవ్యక్తి ఆన్లైన్ రుణం తీసుకున్నాడు. గడువులోపు చెల్లించ లేకపోవడంతో ఆ యాప్ వారు వేధింపులకు పాల్పడ్డారు. సింహాద్రిపురం మండలం దిద్దకుంట గ్రామా నికి చెందిన ఒక కుటుంబం వడ్డీ వ్యాపారుల ఒత్తిళ్లతో ఆత్మహత్య చేసుకున్న సంఘటన తెలిసిందే. ఇప్పటికైనా ఉన్నతాధికారులు వడ్డీ వ్యాపారులపై ప్రత్యేక నిఘా పెట్టి కట్టడి చేయాలని పలువురు కోరుతున్నారు.

ప్రతిభ వెలికితీసేందుకు టాలెంట్ టెస్ట్



ప్రతిభ చూపిన విద్యార్థికి బహుమతి అందిస్తున్న డీఈవో షంషుద్దీన్

సికెదిన్నె, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీసి వారిని ప్రోత్సహించడానికే టాలెంట్టెస్ట్ నిర్వహిస్తున్నట్లు జిల్లా విద్యాశాఖాధికారి షంషుద్దీన్ తెలిపారు. మండలంలోని భారత్ కాలేజీలో 5 నుంచి 10వ తరగతి విద్యార్థులకు మండలస్థాయి టాలెంట్టెస్ట్ శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల్లో పోటీతత్వం పెంపొందించడానికి ఇటువంటి టెస్టులు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు విద్యార్థులను ప్రోత్సహించాల్సిన అవసరం ఉందన్నారు. సమగ్ర శిక్ష అబియాన్ కోఆర్డినేటర్ నిత్యానందరాజు మాట్లాడుతూ ప్రైవేటు, ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ఇటువంటి టెస్టులు నిర్వహించడం ద్వారా వారి ప్రతిభ బయటికి వస్తుందన్నారు. కార్యక్రమంలో మండల విద్యాశాఖాధికారులు వెంకటరామిరెడ్డి, రమాదేవి, వివిధ పాఠశాలల నుంచి వచ్చిన విద్యార్థులు పాల్గొన్నారు. గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు.

పొదుపు నైపుణ్యాలు ఆదాయ ప్రగతికి మార్గాలు



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ రఘునాథ్రెడ్డి

కడప ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): వ్యక్తిగత ఆర్థిక ప్రణాళిక, పొదుపు నైపుణ్యాలు ఆదాయ ప్రగతికి మార్గాలని యోగివేమన విశ్వవిద్యాలయం ప్రధాన ఆచార్యులు ప్రొఫెసర్ ఎస్.రఘునాథరెడ్డి అన్నారు. శుక్రవారం వైవీయూలో డిపార్ట్మెంట్ ఆఫ్ బిజినెస్ మేనేజ్మెంట్, ఎన్ఎస్ఎస్ యూనిట్ 1 మరియు సెక్యూరిటీస్ ఎక్స్ఛేంజ్ బోర్డ్ ఆఫ్ ఇండియా (ఎస్ఈబీఐ) సంయుక్త ఆధ్వర్యంలో ఫైనాన్షియల్ లిటరసీ - ఎ వే ఫర్ పర్సనల్ ఫైనాన్షియల్ ఎంపవర్మెంట్ టు స్టాక్ ఇన్వెస్ట్మెంట్స్ అనే అంశంపై వర్క్షాప్ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఎక్సెల్ నివేదికతో నెలవారీ బడ్జెట్ను ఎలా తయారు చేయాలో చూపించారు. ఉత్తమ పోర్ట్ఫోలియోలో స్టాక్ పెట్టుబడులలో అవకాశాలు, సవాళ్లను వివరించారు. విశ్లేషణాత్మక నైపుణ్యాలు మరింత అవసరమన్నారు. సంపాదనను పొదుపు వైపు మళ్లించి వివిధ పథకాల్లో పెట్టుబడుల ద్వారా వ్యక్తుల ఆర్థికస్థితి మెరుగై సాధికారత దిశగా వెళ్తారన్నారు. అనంతరం బిజినెస్ మేనేజ్మెంట్ విభాగాధిపతి డాక్టర్ పి.సరిత, ప్రొఫెసర్ టి.శ్రీనివాస్, సెబీ ట్రైనర్ శ్రీనివాసరావు అవగాహన కల్పించారు.

భూ సమస్యలను త్వరగా పరిష్కరించండి : ఆర్డీవో



రైతుల అర్జీలను పరిశీలిస్తున్న ఆర్డీవో సాయిశ్రీ, తహసీల్దారు రమాకుమారి

చాపాడు, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన భూ సమస్యలను త్వరగా పరిష్కరించాలని జమ్మలమడుగు ఆర్డీవో సాయిశ్రీ తహసీల్దారు రమాకుమారిని ఆదేశించారు. సిద్దారెడ్డిపల్లెలో శుక్రవారం భూ సమస్యలపై సమావేశం జరిగింది. ఇటీవల జరిగిన రెవెన్యూ సదస్సుల్లో 13 అర్జీలు రెవెన్యూ గ్రామం నుంచి రాగా 10 పరిష్కారం చేసినట్లు రమాకుమారి తెలిపారు. మిగిలిన మూడు సమస్యలను కూడా పరిష్కారం చేస్తామన్నారు. బెంగుళూరు- అమరావతి నేషనల్ హైవే రోడ్డు నిర్మాణానికి భూములు ఇచ్చిన రైతులకు చెల్లించిన నష్టపరిహారం గురించి ఆర్డీవో తహసీల్దారును అడిగి వివరాలు తెలుసుకున్నారు. ద్వారకానగరం, సిద్దారెడ్డి గ్రామాలకు కొంతమంది రైతులకు నష్టపరిహారం చెల్లించేందుకు నివేదికలు తయారు చేయాలని ఆర్డీవో ఆదేశించారు. అనంతరం ఆర్డీవో సాయిశ్రీ అల్లాడుపల్లె వీరభద్రస్వామి దేవాలయంలో స్వామిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఈనెల 26న జరిగే మహాశివరాత్రి ఉత్సవం గురించి ఉత్సవ కమిటీ ఛైర్మన్ వీరనారాయణ అధికారులకు వివరించారు.

నర్సాపురం బీపీఎం అరెస్ట్



అరెస్ట్ చేసిన బీపీఎం నాయక్ను చూపుతున్న పోలీసులు

కాశినాయన ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నర్సాపురం పోస్టాఫీస్లో బీపీఎం (బ్రాంచ్ పోస్టు మాస్టర్) గా పనిచేస్తున్న బుక్కె తిరుపాల్ నాయక్ను శుక్రవారం అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ హనుమంతు తెలిపారు. అన్నమయ్య జిల్లా గాలివీడు మండలం బత్తినవాండ్లపల్లి సుగాలి తాండకు చెందిన నాయక్ 14 సంవత్సరాలుగా నర్సాపురంలో బీపీఎంగా విధులు నిర్వహిస్తున్నాడు. ఈక్రమంలో పలువురి ఖాతాదారుల ఆర్డీలు, ఇతర పొదుపు సొమ్ములను అకౌంట్లో జమచేయకుండా సొంతఅవసరాలకు వాడుకుంటూ వచ్చాడు. విషయం బహిర్గతం కావడంతో విధులకు రాకుండా తప్పించుక తిరుగుతూ వచ్చాడు. ఈ నేపథ్యంలో నున్నా విజయలక్ష్మి అనే మహిళ నర్సాపురం పోలీస్ స్టేషన్లో 2024 సెప్టెంబరు 28న తన ఆర్డీ గడువు తీరగా వచ్చిన డబ్బు, తనకూతురి పేరున కట్టిన సుకన్య సమృద్ధియోజన పథకంలోని రూ2,90,000లను నాయక్ తనకు తెలియకుండా వాడుకున్నాడని ఫిర్యాదు చేసింది. ఈమేరకు కేసు నమోదు చేసి 55 మందిని విచారించగా ఇతను ఖాతాదారులకు చెందిన రూ.22,67,469 వాడుకున్నట్లు ప్రాథమిక దర్యాప్తులో తేలిందన్నారు. సదరు బీపీఎం శుక్రవారం ఓబుళాపురం క్రాస్ రోడ్డులో ఉన్నట్లు సమాచారం అందడంతో అదుపులోకి తీసుకొని కోర్టులో హాజరుపరిచామన్నారు.

ప్రమాద బాధితులకు సాయం చేస్తూ... యువకుడి మృతి



నరహరినాయుడు మృతదేహం, నరహరినాయుడు (ఫైల్)

ఖాజీపేట, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో గాయపడిన వారికి సాయం చేస్తుండగా విధి వక్రీకరించి ఓ యువకుడు మృత్యువాత పడిన సంఘటన పలువురిని కలిచివేసింది. వివరాల్లోకి వెళితే.. కడప-కర్నూలు జాతీయ రహదారిలోని కుమ్మరికొట్టాలు వద్ద లారీ ఢీకొనడంతో లగుడుపాటి నరహరినాయుడు (36) మృతి చెందాడు. నలుగురు స్నేహితులు తమ మిత్రుడికి జ్వరం రావడంతో చికిత్స చేయించి మైదుకూరులోని అతని స్వగృహం వద్ద వదిలి పెట్టారు. తిరిగి వెలుతుండగా కుమ్మరికొట్టాలు వద్దకు రాగానే కారు టైరు పగిలి డివైడర్ను ఢీకొంది. దీంతో కారులో ప్రయాణిస్తున్న వెంకట భానుప్రకాష్, నాగూర్నాగరాజు శివలీల కృష్ణ, జ్ఞానసాయికి స్వల్ప గాయాలయ్యాయి. వీరు రోడ్డుకు అడ్డంగా ఉన్న కారును పక్కకు తొలగిస్తుండగా.. అదే సమయంలో ఖాజీపేట నుంచి దువ్వూరు వెళుతున్న ఆటో డ్రైవర్ నరహరినాయుడు వారికి సాయం చేసేందుకు వెళ్లాడు. అందరూ కలిసి కారును తొలగిస్తుండగా ఖాజీపేట నుంచి మైదుకూరు వెళుతున్న లారీ ఢీకొట్టడంతో నరహరినాయుడు అక్కడికక్కడే మృతి చెందాడు. అతనికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. గాయపడిన వారిని 108 ద్వారా రిమ్స్కు తరలించారు. ఈమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ మోహన్ తెలిపారు.

అదుపు తప్పిన కంటైనర్

● డ్రైవర్, క్లీనర్కు స్వల్ప గాయాలు



గోటూరు బ్రిడ్జి కింద పడిపోయిన కంటైనర్

వల్లూరు, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): కడప-తాడిపత్రి రహదారిలోని గోటూరు బ్రిడ్జి వద్ద శుక్రవారం తెల్లవారుజామున కంటైనరు అదుపు తప్పి బ్రిడ్జి కిందికి దూసుకుపోవడంతో డ్రైవర్, క్లీనర్కు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు, పోలీసుల వివరాల మేరకు... మహారాష్ట్ర ట్రాన్స్పోర్టుకు సంబంధించిన లారీ చెన్నై నుంచి బాంబేకు వెళుతుండగా శుక్రవారం తెల్లవారుజామున డ్రైవరు నిద్రమత్తులోకి జారుకోవడంతో అదుపుతప్పి బ్రిడ్జికి కిందకు దూసుకుపోయింది. సమాచారం అందుకున్న పోలీసులు సంఘనాస్థలానికి వెళ్లి గాయపడిన డ్రైవరు, క్లీనరును రిమ్స్ తరలించి కేసు నమోదు చేశారు.

రసాభాసగా బద్వేలు మున్సిపల్ కౌన్సిల్ సమావేశం

● కమిషనర్, వైసీపీ కౌన్సిలర్ల మధ్య మాటల యుద్ధం ● కమిషనర్పై మండిపడ్డ ఎమ్మెల్యే సుధ



కమిషనర్పై మూకుమ్మడిగా ఆగ్రహం వ్యక్తం చేస్తున్న వైసీపీ కౌన్సిలర్లు, ఎమ్మెల్యే సుధ, రాజగోపాల్రెడ్డి, దీటుగా సమాధానం ఇస్తున్న మున్సిపల్ కమిషనర్ నరసింహారెడ్డి

బద్వేలుటౌన్, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): స్థానిక మున్సిపల్ కార్యాలయంలో శుక్రవారం మున్సిపల్ ఛైర్మన్ వాకమల్ల రాజగోపాల్రెడ్డి అధ్యక్షతన మున్సిపల్ సాధారణ కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. సమావేశానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే సుధ హాజరయ్యారు. అజెండాను ప్రారంభించక ముందే మున్సిపల్ కమిషనర్ వాకమల్ల నరసింహారెడ్డి ఏకపక్ష ధోరణితో వ్యవహరించడం సరికాదని, వార్డు సమస్యలపై వార్డుల్లో పర్యటించే సమయంలో అక్కడున్న ప్రజా ప్రతినిధులకు, కౌన్సిలర్లకు సమాచారం ఇవ్వకుండా వార్డు సమస్యలపై ఏకపక్షధోరణిగా నిర్ణయాలు తీసుకుంటున్నారంటూ ఎమ్మెల్యే సుధా, వైసీపీ కౌన్సిలర్లు కమి షనర్పై ధ్వజమెత్తారు. కాగా ప్రతి మునిసిపల్ సమావేశానికి ఎమ్మె ల్యేగా హాజరవుతున్నా అజెండాలో ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ పేర్లు నమోదు చేయక పోవడంలో అంతర్యం ఏమిటని ప్రశ్నించారు. ఇందుకు మున్సిపల్ కమిషనర్ కూడా ఘాటైన సమాధానాలు ఇస్తూ, సమావేశాన్ని హుందాగా నడపాలన్నారు. ఏవైనా వార్డుల్లో సమస్యలుంటే తమ దృష్టికి తీసుకువస్తే వెంటనే పరిష్కరిస్తామంటూ కౌన్సిలర్లపై ఒకింత అసహనం వ్యక్తం చేశారు. ఇందుకు కౌన్సిలర్లు సమావేశానికి వచ్చినప్పుడల్లా సమస్యలు విన్నవిస్తున్నామే తప్ప, వాటిని పరిష్క రించడం లేదంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. అలాగే గత వైసీపీ ప్రభుత్వంలో మీరు కూడా ఇదే ధోరణిలో వ్యవహరించారంటూ టీడీపీ కౌన్సిలర్లు వాదనకు దిగడంతో వాదనలు, ప్రతివాదనలతో మున్సిపల్ సమావేశం దద్దరిల్లిపోయింది. మున్సిపల్ వైస్ ఛైర్మన్ గోపాలస్వామి నాలా చట్ట ప్రకారం మున్సిపాలిటీలో ఎన్ని ఇళ్లకు అనుమతులు ఇచ్చారో సమాచారం ఇవ్వాలని అర్జీలు ఇచ్చినా, ఇవ్వలేదంటూ ప్రశ్నించారు. దీంతో కోర్టులో ఉన్న సమస్యలపై ఇక్కడ మాట్లాడకూ డదంటూ మున్సిపల్ కమిషనర్ చెప్పడంతో వీరి మధ్య మాటల యుద్ధం చోటు చేసుకుంది. వేసవిని దృష్టిలో పెట్టుకొని నీటి సమ స్యను తలెత్తకుండా నీటిని సరఫరా చేయాలని కొందరు కౌన్సిలర్లు సమావేశం దృష్టికి తీసుకువచ్చారు. జాతీయ రహదారిలో సెంట్రల్ లైటింగ్కు ఫ్లెక్సీలు పెట్టడంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, వెంటనే వాటిని తొలగించి అనుమతులు ఉన్నవాటికి ఫ్లెక్సీలు ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే వార్డుల్లో నెలకొన్న సమస్యలు సమావేశం దృష్టికి తీసుకు రావడంతో వాటన్నింటినీ సాధ్యమైనంత త్వరగా పరిష్కరించేలా చూస్తామన్నారు.

బుల్లెట్ అదుపు తప్పి యువకుడి మృతి



సుమంత్ మృతదేహం

సికెదిన్నె, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): బుల్లెట్ మోటారు సైకిల్ అదుపు తప్పి కింద పడటంతో సుమంత్ అనే యువకుడు మృతి చెందినట్లు సీఐ శివశంకర్నాయక్ తెలిపారు. నంద్యాల జిల్లా పున్నాపురంలో నివాసం ఉంటున్న కొండపల్లి సుమంత్ తన స్నేహితులతో కలిసి నంద్యాల నుంచి శుక్రవారం రాత్రి 12 గంటల సమయంలో తిరుమల దర్శనానికి బుల్లెట్ వాహనంలో బయలుదేరారు. తెల్లవారుజామున అయిదు గంటలకు కడప జయరాజ్ గార్డెన్స్ సమీపంలోకి రాగానే స్పీడ్బేకర్ వద్ద బుల్లెట్ వాహనం అదుపు తప్పడంతో ఎగిరి కిందపడ్డారు. దీంతో అతనితో పాటు ప్రశాంత్, శివకు గాయాలయ్యాయి. వారిని చికిత్స నిమిత్తం రిమ్స్కు తరలించగా.. సుమంత్ అప్పటికే చనిపోయినట్లు వైద్యులు నిర్ధారించారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

గ్రావెల్ అక్రమ తవ్వకాలు

● పట్టుబడ్డ వాహనాలకు రూ.2.85 లక్షలు జరిమానా


దువ్వూరు, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): దువ్వూరు సమీప గుట్ట ప్రాంతంలో అనుమతులు లేకుండా గ్రావెల్ తరలిస్తున్న 10 టిప్పర్లు, నాలుగు ఎక్స్కవేటర్లకు మైన్స్ అండ్ జియాలజీ డిప్యూటీ డైరెక్టర్ సూర్యచంద్ర జరిమానా విధించినట్లు తహసీల్దారు అక్బల్బాష తెలిపారు. ఈనెల 18వ తేదీ కూటమి సర్కార్లోనూ కొల్లగొడుతున్నారు అనే కథనం 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితం అయిన విషయం విధితమే. ఇందుకు స్పందించిన రెవెన్యూ అధికారులు, పోలీసులు దాడులు చేసి వాహనాలను సీజ్ చేశారు. అనంతరం పట్టుబడ్డ 10 టిప్పర్లకు రూ.85 వేలు, నాలుగు ఎక్స్కవేటర్లకు రూ.2 లక్షలు మొత్తం రూ.2.85 లక్షలు జరిమానా విధించినట్లు తహసీల్దారు పేర్కొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

సికెదిన్నె, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో గాయపడిన వెంకటేశ్వరరెడ్డి అనే వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందాడు. సీకేదిన్నె సీఐ శివశంకర్నాయక్ వివరాల మేరకు.. కడప-రాయచోటి జాతీయ రహదారిలో ఊటుకూరు రింగ్రోడ్డు వద్ద స్కూటర్ను కారు ఢీకొనడంతో ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో స్కూటర్పై వెళుతున్న వెంకటేశ్వరరెడ్డి గాయపడడంతో చికిత్స నిమిత్తం రిమ్స్కు తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం కర్నూలు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ గురువారం అర్ధరాత్రి మృతి చెందాడు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

యథేచ్ఛగా... ఇసుక అక్రమ రవాణా

● నిషేధాజ్ఞలు ఉల్లంఘిస్తున్న ఇసుక మాఫియా
● కానరాని వీఆర్వోల టాస్క్ఫోర్స్



రామేశ్వరం హెడ్ వాటర్ వర్క్స్ నుంచి ట్రాక్టర్లో ఇసుకను తరలిస్తున్న దృశ్యం

ప్రొద్దుటూరు, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): ప్రొద్దుటూరులో ఇసుక అక్రమ రవాణా ఆగడం లేదు. జనవరి 25న ఆంధ్రజ్యోతిలో వచ్చిన ఇసుకాసురుల విధ్వంసం కథనంతో రెవెన్యూ, మున్సిపల్ అధికారులు స్పందించారు. స్వయంగా తహసీల్దారు గంగయ్య, మున్సిపల్ కమిషనర్ మల్లికార్జునలు పెన్నానదిలో ప్రొహిబిటెడ్ ఏరియాలో ఇసుక తవ్వకాలపై దాడులు జరిపారు. రెండు ఇసుక ట్రాక్టర్లను పట్టుకున్నారు. పలు ట్రాక్టర్లకు ఫొటోలు తీశారు. అదేరోజు ప్రొద్దుటూరు పట్టణంలో ఎర్రగుంట్ల రోడ్డులోని బ్రిడ్జి దగ్గర నుంచి రామేశ్వరం హెడ్ వాటర్ వర్క్స్ దగ్గర రైల్వే వంతెన ఎగువ వరకు పెన్నానదిలో ఇసుక అక్రమ తవ్వకాలు జరుపరాదని... ఆప్రాంతం అంతా ప్రొహిబిటెడ్ ఏరియా కిందకు వస్తుందని తహసీల్దారు స్వయంగా విలేకరుల సమావేశంలో ప్రకటించారు. ప్రొద్దుటూరు పరిధిలో పెన్నానదిలో ఇసుక తవ్వకాలపై నిషేధాజ్ఞలు పెట్టిన ప్రాంతంలోనే ఇసుక తవ్వకాలు జరిపి ట్రాక్టర్లలో అక్రమంగా తరలిస్తున్నారు. రామేశ్వరం హెడ్ వాటర్వర్క్స్ నుంచి ఆర్టీసీపీ రోడ్డు మార్గాన ఇసుక ట్రాక్టర్లు కనపడితే సీజ్ చేయమని తహసీల్దారు ఆదేశాలు ఇచ్చినా.. యథేచ్ఛగా వాటర్ వర్క్స్ ప్రాంతం, రైల్వే వంతెన వద్ద నుంచి ఇసుకను తరలిస్తున్నారు. పెన్నానదిలో అనుమతిలేని ప్రాంతం నుంచి ఇసుక అక్రమంగా తర లించకుండా కట్టడి చేయడానికి వీఆర్వోలతో ఫిబ్రవరి 12న టాస్క్ ఫోర్స్టీంను తహసీల్దారు గంగయ్య నియమించారు. ఇందులో అమర్నాథ్రెడ్డి ఉదయం 6 గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు అక్కడ పర్యవేక్షించాలి. అలాగే బిల్లాల బాషా ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1గంట వరకు, మల్లికార్జున మధ్యాహ్నం 1గంట నుంచి సాయంత్రం 4 గంటల వరకు, కె.వెంకట బ్రహ్మయ్య సాయం త్రం 4 గంటల నుంచి రాత్రి 7 గంటల వరకు, వెంకట ప్రేమ్ సాయి రాత్రి 7గంటల నుంచి పర్యవేక్షించాలని తహసీల్దారు ఉత్తర్వులు ఇచ్చారు. కానీ పెన్నానది ప్రొహిబిటెడ్ ఏరియాలో వీళ్లు కానరావడం లేదు. దీంతో ఇసుకను తవ్వకాలు జరిపి పట్టపగలే తరలించుకు పోతున్నారు. కాగా, తహసీల్దారు గంగయ్య ప్రొద్దుటూరులో ఇళ్ల కట్టడాలకు ఇసుక కావాల్సిన వాళ్లు ప్రభుత్వం అనుమతిచ్చిన కల్లూ రు, నంగనూరుపల్లె, చౌడూరు రీచ్ల వద్దకు వెళ్లి మాత్రమే ఇసుకను తీసుకువెళ్లాలని తెలిపినా.. ఇసుక మాఫియా తహసీల్దారు ఆదేశా లను ఖాతరు చేయడం లేదు. కాగా, పెన్నా నదిలో అనుమతి లేని ప్రాంతంలో ఇసుక తవ్వకాలు జరిపితే కేసులు పెట్టి జైలుకు పంపుతామని హెచ్చరించారు.

మట్టి రోడ్లకు మహర్దశ

● పల్లెపండుగతో సీసీ రోడ్ల ఏర్పాటు ● ప్రజల హర్షం





పల్లె పండుగలో భాగంగా ఏర్పాటు చేసిన సీసీ రోడ్డు (ఇన్‌సర్ట్) గతంలో ఉన్న మట్టిరోడ్డు

రైల్వేకోడూరు, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): పల్లె పండుగ కార్యక్రమంతో గ్రామాల్లోని మట్టిరోడ్లకు మహర్దశ పడుతోంది. గత ప్రభుత్వ హయాంలో నిరాదరణ కారణంగా రోడ్లు అధ్వానంగా మారడంతో ఆ మార్గాల్లో కాలినడకన వెళ్లేందుకు సైతం గ్రామీణులు ఇబ్బందులు పడేవారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వ హయాంలో ఇలాంటి రోడ్లన్నీ అభివృద్ధికి నోచుకుంటున్నాయి.

రైల్వేకోడూరులోని లక్ష్మీప్యారడైజ్ సినిమాహాలు ఎదురుగా ఆర్టీసీ బస్టాండు, చిట్వేలి రోడ్డు, పగడాలపల్లెకు వెళ్లే రోడ్డును బుజ్జమ్మ రోడ్డుగా పిలుస్తారు. ఈ రోడ్డు అధ్వానంగా ఉండడంతో 30 ఏళ్ల క్రితం అప్పటి జడ్పీటీసీ సభ్యురాలు బండారు సుభద్రమ్మ సుమారు రూ.5 లక్షలు మంజూరు చేయించి, మట్టి రోడ్డు ఏర్పాటుకు కృషి చేశారు. ఆ తర్వాత వచ్చిన పాలకులెవరూ ఈ రోడ్డు అభివృద్ధిని పట్టించుకోలేదు .దాంతో రోడ్డు గోతులమయమై, ప్రమాదకరంగా మారింది. ఈ మార్గంలో వెళ్లేందుకు ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడేవారు. కూటమి ప్రభుత్వ హయాంలో పల్లె పండుగ కార్యక్రమం కింద సుమారు రూ. 40 లక్షల వ్యయంతో 25 అడుగుల వెడల్పుతో 267 మీటర్ల మేరకు సిమెంట్ రోడ్డుతో పాటు, అండర్ డ్రైనేజీ ఏర్పాటు చేశారు. ఇదే విధంగా 25 లక్షలు వెచ్చించి 216 మీటర్లు పొడవుతో 18 అడుగుల వెడల్పుతో కొత్తకోడూరు మార్గంలో సిమెంట్ రోడ్డు వేశారు. దీంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

నిరీక్షణ ఫలించింది



బుజ్జమ్మ రోడ్డు అభివృద్ధికి 30 ఏళ్లుగా నిరీక్షించాల్సి వచ్చింది. ఈ దారి లో వెళ్లే ప్రతి నాయకుడి వద్ద మా ఆవేదన వ్యక్తం చేశాం. ఎవరూ పట్టించు కోలేదు. . కూటమి ప్రభుత్వం రాగానే సిమెంటు రోడ్డుతో పాటు అండర్ గ్రౌండ్ డ్రైనేజీ ఏర్పాటు చేసింది

- చినాకుల బాలాంజనేయులు

చాలా సంతోషంగా ఉంది



నేను జడ్పీటీసీ సభ్యురాలిగా ఉన్న సమయంలో మట్టి రోడ్డు మంజూరు చేయించాను. ప్రజలకు అనుకూలంగా ఉండేందుకు అప్పట్లో రూ. 5 లక్షలతో అధికారులు మట్టి ఏర్పాటు చేయించారు. 30 ఏళ్లనాటి కల నేడు పల్లె పండుగతో నెరవేరింది.

- బండారు సుభద్రమ్మ(బుజ్జమ్మ), జడ్పీటీసీ మాజీ సభ్యురాలు

రైతు విశిష్ట గుర్తింపు సంఖ్య నమోదు తప్పనిసరి

● జేడీఏ చంద్రానాయక్



రైల్వేకోడూరు: రైతులతో మాట్లాడుతున్న జేడీఏ చంద్రానాయక్

రైల్వేకోడూరు/ఓబులవారిపల్లి, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): రైతు విశిష్ట గుర్తింపు నమోదు తప్పనిసరి అని జిల్లా వ్యవసాయశాఖాధికారి చంద్రా నాయక్ తెలిపారు. శుక్రవారం రైల్వే కోడూరు మండలంలోని రాఘవరాజపురం, ఓబనపల్లె గ్రామాలతోపాటు, ఓబులవారిపల్లె మండల కేంద్రంలో రైతు విశిష్ట గుర్తింపు నమోదు కార్యక్రమాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని అన్ని రైతు సేవా కేంద్రాల పరిధిలో ఈ కార్యక్రమం వేగవంతంగా జరుగుతోందన్నారు. పొలం ఉన్న ప్రతి రైతు తప్పనిసరిగా ఆధార్‌కార్డు, ఆధార్‌కు అనుసంధానమైన మొబైల్, పట్టాదారు పాసుపుస్తకంతో గ్రామ వ్యవసాయ సహాయకులు లేదా గ్రామ ఉద్యాన శాఖ సహాయకులను సంప్రదించి రైతు విశిష్ట సంఖ్య పొందాలని తెలిపారు. రైతు విశిష్ట సంఖ్య ద్వారా వ్యవసాయ సేవలు సులభతరం అవుతాయన్నారు. పీఎం కిసాన్, అన్నదాత సుఖీభవ, పెట్టుబడి సాయం, రాయితీపై , యంత్రపరికరాలు, విత్తనాలు, సూక్ష్మ పోషకాలు, వడ్డీ రాయితీ, పంటబీమా సౌకర్యం లభిస్తుం దని తెలిపారు. రైల్వేకోడూరు ఏడీఏ కవిత, వ్యవసాయశాఖ అధికారి జి. సుధాకర్, ఓబులవారిపల్లె వ్యవసాయాధికా మల్లిక సిబ్బంది లక్ష్మీనారాయణ, హరిబాబు, మండల వ్యవసాయాదికారి మల్లిక రైతులు, సిబ్బంది పాల్గొన్నారు.

పేదలకు అన్నదానం



పేదలకు అన్నదానం చేస్తున్న సాయివికాస్‌రెడ్డి, ఎమ్మెల్యే శ్రీధర్

రైల్వేకోడూరు, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): కుడా చైర్మన్, రైల్వేకోడూరు టీడీపీ ఇన్‌చార్జి ముక్కా రూపానంద రెడ్డి తనయుడు ముక్కా సాయి వికాస్ రెడ్డి పుట్టిన రోజు సందర్భంగా రైల్వేకోడూరు ఇంద్ర బస్టాండు వద్ద శుక్రవారం పేదలకు అన్నదానం చేశారు. బలిజవీధి లో టీడీపీ యువత ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. జనసేన ఎమ్మెల్యే అరవ శ్రీధర్, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

చిట్వేలి: స్థానిక శివాలయంలో ఎమ్మెల్యే అరవ శ్రీధర్, ముక్కా సాయివికాస్‌రెడి పూజలు చేశారు. అనంతరం ఓ ప్రైవేటు పాఠశాలలో గుత్తి నరసింహ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన భారీ కేక్ కట్‌చేసి పంచిపెట్టారు.

ఘనంగా లక్ష్మీనరసింహస్వామి ఆలయ వార్షికోత్సవం



హోమ పూజల్లో సుగవాసి బాలసుబ్రమణ్యం దంపతులు

రాయచోటిటౌన్, ఫిబ్రవరి21 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని గాలివీడు రోడ్డులో మాజీ ఎమ్మెల్యే సుగవాసి పాలకొండ్రాయుడు ఆధ్వర్యంలో నిర్మించిన లక్ష్మీనరసింహ స్వామి ఆలయ ప్రథమ వార్షికోత్సవాలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రాజంపేట నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి సుగవాసి బాలసుబ్రమణ్యం దంపతులు హోమంలో, రాష్ట్ర టీడీపీ కార్యనిర్వాహక కార్యదర్శి సుగవాసి ప్రసాద్‌బాబు పూజల్లో పాల్గొన్నారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. ఈ సందర్భంగా అర్చకులు సుగవాసి ప్రసాద్‌బాబును ఘనంగా సన్మానించి, తీర్థప్రసాదాలను అందజేశారు.

చేపల సాగు లాభదాయకం

వీరబల్లి, ఫిబ్రవరి21(ఆంధ్రజ్యోతి): చేపల సాగు లాభదాయకమని జిల్లా జీవనోపాధుల ప్రాజెక్టు మేనేజర్ గంగార్జున తెలిపారు. శుక్రవారం స్థానిక వెలుగు కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ సన్న, చిన్నకారు రైతులకు అర ఎకరా నుంచి ఎకరా భూమి ఉన్న రైతులు ఈ వ్యవసాయం ద్వారా సంవత్సరానికి ఒక లక్ష రూపాయలు ఆదాయం కల్పిస్తామన్నారు. ఉదయ్ ఆక్వా కనెక్ట్ ప్రతినిధి సుధాకర్ మాట్లాడుతూ ఒక టన్ను కొరమీను చేపల విలువ 4.42 లక్షలు ఉంటుందన్నారు. చేప పిల్లల నుంచి దాణా ఆరోగ్యం, మార్కెటింగ్ వరకు తమ సంస్థ సహకారం అందిస్తుందన్నారు.

ఘనంగా మాతృభాష దినోత్సవం

పెనగలూరు, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ మాతృభాష దినోత్సవం సందర్భంగా శుక్రవారం చక్రంపేట ఉన్నత పాఠశాలలో గిడు గు రామ్మూర్తి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్రధానోపాధ్యాయుడు లేబాక గోపాలకృష్ణ అధ్యక్ష తన తెలుగు పండితులు పద్మజ, లక్ష్మీదేవిని ఘనంగా సన్మానించారు. ఎస్టీయూ జిల్లా మాజీ అధ్యక్షుడు పిల్లి రామకృష్ణ పెనగలూరు ఉన్నత పాఠశాలలో భాషా పండితులు రహీంతుల్లా, బుజ్జిని సన్మానించారు.

నందలూరు: మండలంలోని నాగిరెడ్డిపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల లో మండల విద్యాశాఖాధికారులు నాగయ్య, అనంతకృష్ణ మాతృభాష ప్రాధాన్యతను విద్యార్థులకు వివరించారు. వివిధ పోటీల్లో విజే తలుగా నిలిచిన విద్యార్థులకు ఉపాధ్యాయులు బహుమతులందించారు.

రైతు ఉత్పత్తిదారుల సంఘం సమావేశం

ఓబులవారిపల్లె, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి) : స్థానిక మండల సమాఖ్య భవనంలో శుక్రవారం ఏసీ, ఏపీఎం మల్లికార్జునరాజు ఆధ్వర్యంలో మహిళా రైతు ఉత్పత్తిదారుల సంఘం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎఫ్‌పీవో సంఘం రిజిస్ట్రేషన్‌తో ఉపయోగాలను తెలియజేశారు. మండల పరిధిలో సుమారు 100 గ్రూపులు ఏర్పాటు కావాల్సి ఉండగా 75 గ్రూపులు ఏర్పడ్డాయన్నారు. ప్రతినెలా సమావేశం ఏర్పాటు చేసి రైతు ఉత్పత్తుల సమాచారం, పనిముట్లు, ఎరువులు, టార్పాలిన్లు, యంత్రాలు, బ్యాంకు లోన్లకు సంబంధించిన విషయాలు చర్చించాలన్నారు. వ్యవసాయాధి కారులు ప్రకృతి వ్యవసాయ సిబ్బంది సలహాలు, సూచనలిస్తారని తెలిపారు.

కిశోరి వికాసంపై అవగాహన

రైల్వేకోడూరు, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): కిశోరి వికాసంపై ఏసీడీపీవో సరళాదేవి ఆధ్వర్యంలో శుక్రవారం కోడూరు-2 సచివాలయం పరిధిలోని ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె బాల్య వివాహాలు అరికట్టేందుకు తీసుకోవాల్సిన చర్యలు, ఆత్మరక్షణ, బాలికల విద్య, తదితర అంశాలను వివరించారు. అనంతరం ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సుబ్బలక్ష్మి, వార్డు సభ్యులు నార్జాల హేమరాజ్, కోడూరు-1 జీఎంఎస్‌కే ఏ. సుజాత, ఆరోగ్య కార్యకర్త కలూడా, అంగన్వాడీ, ఆశ కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

'ఎస్‌ఏలకు ఇన్విజిలేషన్ బాధ్యతలు వద్దు'

లక్కిరెడ్డిపల్లె, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): పదో తరగతి పరీక్షలకు ఇన్విజిలేటర్లుగా స్కూల్ అసిస్టెంట్లకు నియమించాలంటూ పరీక్షల విభాగం డైరెక్టర్ కేవీ శ్రీనివాసరెడ్డి ఇచ్చిన మార్గదర్శకాలను విరమించుకోవాలని పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు మూడే సూర్యుడు నాయక్ డిమాండ్ చేశారు. శుక్రవారం లక్కిరెడ్డిపల్లెలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఈ మార్గదర్శకాలను అమలు చేస్తే విద్యా వ్యవస్థ దెబ్బతినడమే కాకుండా, మిగతా తరగతుల విద్యార్థుల సిలబస్ పూర్తయ్యే అవకాశం ఉండదన్నారు. టెన్త్ పరీక్షలకు టీజీటీలను ఇన్విజిలేటర్లుగా నియమించుకోవాలని సూచించారు.

నిత్యపూజ కోనలో పార్కింగ్‌కు ఏర్పాట్లు

సిద్దవటం, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి) : మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల సందర్భంగా మండలంలోని నిత్యపూజేశ్వరకోనలో వాహనాలు నిలిపేందుకు షాదీఖానా, నూతి రాయి కోన, పంచలింగాల రెండో ముఖద్వారం, ఆర్టీసీ బస్టాండు, బండి మునిరెడ్డి పొలం ప్రాంతాల్లో వాహనాల పార్కింగ్ కోసం ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక పోలీసు కానిస్టేబుల్ రాఘవ, ఎండోమెంట్ సిబ్బంది, చంద్ర తదితరులు పాల్గొన్నారు.

రోగులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ

రాయచోటి టౌన్, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): దివ్యాంగుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వంగిమళ్ల రంగారెడ్డి, కళావతమ్మ కుమారుడు నాగమల్‌రెడ్డి పుట్టినరోజు సందర్భంగా శుక్రవారం పట్టణంలోని ఏరియా ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు వైద్యులు మహేశ్వర్‌రాజు, కిరణ్‌కుమార్, లక్ష్మీప్రసన్నల చేతుల మీదుగా పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో రామచంద్రారెడ్డి , మండెం సుధీర్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆసుపత్రి సమీపంలో చెత్త డంపింగ్ అడ్డుకోవాలి

పెనగలూరు, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద చెత్త వేయకుండా అడ్డుకోవాలని మండల సీపీఐ నాయకులు శుక్రవారం పెనగలూరు ఎంపీడీవో ఎస్.విజయరావుకు విన్నవించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండల కేంద్రంలో సేకరించే చెత్తను ట్రాక్టర్ల ద్వారా ప్రభుత్వ ఆసుపత్రి వెనుక ఉన్న శ్మశానంలో డంపింగ్ చేస్తున్నారని, దీంతో చెత్త గుట్టలుగా పేరుకుపోయిందన్నారు. నిబంధనల ప్రకారం గ్రామాల్లో సేకరించిన చెత్తను ఊరికి దూరంగా డంపింగ్ చేయాల్సి ఉండగా ఊరికి మధ్యలో ప్రభుత్వ ఆసుపత్రి వెనుకాల పడేస్తున్నారని, దీనిని నెల, రెండు నెలలకోసారి కాల్చినప్పుడు ఆ దుర్వాసనతో చుట్టుపక్కల నిలబడడానికి కూడా ఆస్కారం లేకుండా పోతోందని తెలిపారు. ఉదయం 9 గంటలకు ఆసుపత్రికి విధులకు వచ్చే సిబ్బంది సాయంత్రం వరకు ముక్కు మూసుకుని విధులు నిర్వహించాల్సి న దుస్థితి ఏర్పడుతుందన్నారు. ఈ దుస్థితి నుంచి ఆరోగ్య సిబ్బంది, పరిసర ప్రాంతాల ప్రజలను కాపాడాలని ఎంపీడీవోను కోరారు. ఈ కార్యక్రమంలో మండల సీపీఐ కార్యదర్శి గానుగపెంట ఆదినారాయణ, కార్యవర్గ సభ్యులు రేవూరి శంకరయ్య, సహాధ్యక్షులు ఈరి లక్ష్మీనారాయణ, డీహెచ్‌ఎస్ మండల అధ్యక్షులు పి.శివశంకర్ తదితరులు పాల్గొన్నారు.



నిధులేమయ్యాయో చెప్పండి?

● రాయవరం సర్పంచ్ డిమాండ్ ● వాడివేడిగా సుండుపల్లె మండల సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ రాజమ్మ

సుండుపల్లె, ఫిబ్రవరి 21 (ఆంధ్ర జ్యోతి): మండల అభివృద్ధికి ప్రభుత్వం విడుదల చేస్తున్న నిధులు ఏమయ్యాయో చెప్పాలంటూ ఓ సర్పంచ్ ప్రశ్నించడంతో సుండుపల్లె మండల సర్వసభ్య సమావేశంలో వాగ్వాదం చేసుకుంది. శుక్రవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ రాజమ్మ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ప్రజా ప్రతినిధులు మండలంలో నెలకొన్న పలు సమస్యలను సమా వేశం దృష్టికి తీసుకువచ్చారు. వేసవి సమీపిస్తుండడంతో తాగునీటి సమస్య పరిష్కారానికి ప్రత్యేక శ్రద్ధ వహించాలని కోరారు. అనంతరం రాయవరం సర్పంచ్ షరీఫ్ మాట్లాడుతూ మండల అభివృద్ధికి విడుదలవుతున్న నిధులు ఏమవుతున్నాయని, ఏఏ పనులకు ఎంత మొత్తంలో వినియోగించారో తెలియజేయాలని ప్రశ్నించారు. సభాధ్యక్షురాలితోపాటు, ఉపాధ్యక్షురాలు రెడ్డెమ్మ సమాధానమిస్తూ పంచాయతీ నిధులు ఏమవుతున్నాయో సర్పంచులు ముందుగా సభకు తెలియజేయాలని వ్యాఖ్యానించడంతో వాగ్వాదం చోటుచేసుకుంది. దీంతో ఎంపీడీవో చొరవ తీసుకొని ఇరువురికీ సర్దిచెప్పారు. అనంతరం ఎంపీపీ మాట్లాడుతూ ప్రజాసమస్యల పరిష్కారంపై ప్రజాప్రతినిధులు, అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని ఎంపీపీ కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో సుధాకర్‌రెడ్డి, వైస్ ఎంపీపీ బాలచంద్రారెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ప్రసాద్, విద్యాశాఖ అధికారి రవీంద్రనాయక్, ఏపీవో మాలిక్‌బాషా, ఏవో మహబూబ్‌బాషా, హార్టికల్చర్ అధికారిణి వసంతబాయి, విద్యుత్‌శాఖ ఏఈ రమేశ్‌బాబు, సర్పంచులు పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌ను జయప్రదం చేయండి



లోక్‌అదాలత్‌పై సమీక్షిస్తున్న జిల్లా అదనపు న్యాయమూర్తి ప్రవీణ్‌కుమార్

రాజంపేట, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి) : రాజీ మార్గంలో వీలైనన్ని కేసులు పరిష్కారమయ్యేలా చర్యలు తీసుకోవాలని రాజంపేట జిల్లా అదనపు నాయమూర్తి ప్రవీణ్‌కుమార్ పోలీసు అధికారులకు సూచించారు. శుక్రవారం సాయంత్రం రాజంపేట కోర్టు ఆవరణలో మార్చి 8న నిర్వహించనున్న లోక్ అదాలత్‌పై పోలీసు అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ సివిల్ జడ్జి కేశవ, జూనియర్ సివిల్ జడ్జి భార్గవి, సెకండ్‌క్లాసు మేజిస్ట్రేట్ పసుపులేటి శంకర్, ఏపీపీ రసూల్ రహనా, సీఐలు అలీ, వెంకటేశ్వర్లు, ఎస్‌ఐ ప్రసాద్‌రెడ్డి పాల్గొన్నారు.

పంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



కలెక్టరేట్ వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న కార్మికులు

రాయచోటి(కలెక్టరేట్), ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): పంచాయతీ కార్మికులకు వేతన బకాయిలు చెల్లించాలని ఏపీ గ్రామ పంచాయతీ కార్మికుల సంఘం (సీఐటీయూ) రాష్ట్ర అధ్యక్షుడు వెంకట్రామయ్య డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక సీఐటీయూ కార్యాలయంలో నిర్వహించిన పంచాయతీ కార్మికుల జిల్లా కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. పంచాయతీ కార్మికుల వేతన బకాయిలు చెల్లించడంతోపాటు. ఈఎస్‌ఐ, పీఎఫ్ చెల్లించకుండా నిర్లక్ష్యం వహిస్తున్న అధికారులపై చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం కలెక్టరేట్ వద్ద ఆందోళన నిర్వహించి డీఆర్‌వో, డీపీవోలకు వినతిపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో గౌరవ అధ్యక్షుడు రామాంజులు, ప్రధాన కార్యదర్శి సురేంద్రబాబు, నాయకులు హరి, ఓబులేసు, కాంతమ్మ, పార్వతమ్మ, రెడ్డెయ్య, పలువురు కార్మికులు పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవాలకు ఇన్‌చార్జి మంత్రికి ఆహ్వానం

రాయచోటిటౌన్, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని భద్రకాళీ సమేత వీరభద్రాలయంలో ఈ నెల 23 నుంచి నుంచి మార్చి నెల 5 వరకు నిర్వహించనున్న బ్రహ్మోత్సవాలకు అన్నమయ్య జిల్లా ఇన్‌చార్జి మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డిని ఆలయ ఈవో డీవీ రమణారెడ్డి ఆహ్వానించారు. శుక్రవారం ఆయన మంగళగిరిలోని టీడీపీ జాతీయ కార్యాలయంలో మంత్రిని మర్యాదపూర్వకంగా కలిసి ఆహ్వానపత్రం అందజేశారు.

'కార్మికుల పక్షాన పోరాటాలకు సిద్ధం కావాలి'

రాయచోటి టౌన్, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల సమస్యల పరిష్కారంతో పాటు, కార్మికుల పక్షాన పోరాటాలకు సిద్ధం కావాలని సీపీఐ(ఎంఎల్) లిబరేషన్ పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యుడు ఉదయ్‌కిరణ్ పిలుపునిచ్చారు. శుక్రవారం ఆయన పాతరాయచోటిలో కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. జిల్లాలో సీపీఐ(ఎంఎల్) లిబరేషన్ పార్టీని బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమం లో ఆ పార్టీ అన్నమయ్య జిల్లా కార్యదర్శి మావులూరి విశ్వనాథ్, జిల్లా కమిటీ సభ్యురాలు సుజాత తదితరులు పాల్గొన్నారు.

'టోల్‌గేట్'తో హత్యరాలకు రూ.2.43 లక్షల ఆదాయం

రాజంపేట, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి) : శివరాత్రి ఉత్సవాల సందర్భంగా మండలంలోని హత్యరాల పుణ్యక్షేత్రంలో టోల్‌గేటు నిర్వహణ హక్కుల వేలం ద్వారా రూ.2.43 లక్షలు ఆదాయం వచ్చినట్లు ఎంపీడీవో వెంకట సుబ్బయ్య తెలిపారు. శుక్రవారం ఎంపీడీవో సభాభవనంలో వేలం నిర్వహించగా, తాళ్లపాక పెంచలయ్య అనేవ్యక్తి రూ. 2,43 లక్షలకు హక్కులు దక్కించుకున్నాడన్నారు. ఫిబ్రవరి 22వ తేదీ నుంచి మార్చి 2వ తేదీ వరకుఈ హక్కులు వర్తిస్తాయని, అంగళ్లు, ఇతర వ్యాపార సముదాయాలు దీని పరిధిలోకి వస్తాయన్నారు.

మట్టి తరలించకుండా చర్యలు తీసుకోవాలి



మట్టి తవ్వుతున్న ప్రాంతాన్ని పరిశీలిస్తున్న పోతుగుంట రమేష్‌నాయుడు

రాజంపేట, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మందపల్లె రెవెన్యూ పరిధిలోని మట్టిని అక్రమంగా తరలిస్తున్నవారిపై చర్యలు తీసుకోవాలని రాష్ట్ర బీజేపీ కార్యవర్గ సభ్యుబు పోతుగుంట రమేష్‌నాయుడు డిమాండ్ చేశారు. మట్టి తవ్వుతున్న ప్రాంతాన్ని శుక్రవారం ఆయన పరి శీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జవహర్ నవోదయ విద్యాల యం పక్కన 100 అడుగుల లోతు వరకు మట్టిని తవ్వి అక్రమంగా తర లించుకు పోతున్నారన్నారు. మట్టి తరలిస్తున్నవారిపై వెంటనే చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

సిమెంటు రోడ్లకు నాణ్యత పరీక్ష



సిమెంటురోడ్డు క్వాలిటీ పరీక్షకు నమూనా సేకరిస్తున్న అధికారులు

ఓబులవారిపల్లె, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలో ఈ మధ్యకాలంలో వేసిన సిమెంటు రోడ్ల నాణ్యతను పరిశీలించేందుకు శుక్రవారం డీఈ రామ్మోహన్ రెడ్డి, జేఈ రవిశంకర్, పంచాయతిరాజ్ ఏఈ అంజనేయ ప్రసాద్‌ల ఆధ్వర్యంలో జిల్లా స్థాయి క్వాలిటీ కంట్రోల్ అధికారులు ఓబులవారిపల్లె గ్రామ పంచాయతీ పరిధిలో నమూనాలు సేకరిం చారు. కార్యక్రమంలో నాయకులు పున్నాటి వాసుదేవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినిని మందలించాడని ఆందోళన

వీరబల్లి, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి):ఉపాధ్యాయుడు మందలించడంతో పాటు మోకాళ్లపై నిలుచోబెట్టడంతో చర్మం లేచి పోయిందంటూ ఓ విద్యార్థిని తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేశారు. మండల పరిధిలోని సోమవరం వడ్డెపల్లికి చెందిన విద్యార్థిని మట్లిలోని ఓ ప్రైవేటు స్కూల్‌లో మూడో తరగతి చదువుతోంది. హోంవర్కు చేయకపోవడంతో శుక్రవారం ఉపాధ్యాయుడు ఆమెను మోకాళ్లపై నిలుచోబెట్టాడు. దీంతో సాయంత్రం గ్రామానికి వచ్చిన పాఠశాల బస్సును ఆపివేసి నిరసన వ్యక్తం చేశారు. విషయం తెలుసుకున్న పాఠశాల కరస్పాండెంటు అక్కడికి చేరుకుని తల్లిదండ్రులకు నచ్చజెప్పారు.ఉపాధ్యాయుడిపై చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో వారు శాంతించారు..

ఉరి వేసుకుని యువతి ఆత్మహత్య

రాజంపేట టౌన్, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి) : కడుపు నొప్పి తాళలేక ఓ యువతి ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు కేసు నమోదు చేశారు. పట్టణంలోని రామ్‌నగర్‌లో నివాసముంటున్న రేవతి(18) శుక్రవారం సాయంత్రం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకు oది. ఇది గమనించిన తల్లిదండ్రులు, స్థానికులు ఆమెను రాజంపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఆ యువతి తరచూ కడుపునొప్పితో బాధపడుతూ ఉండేదని తల్లి రాణమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ లక్ష్మీప్రసాద్‌రెడ్డి తెలిపారు.


మదనపల్లెలో విరబూసిన మామిడి పూత

అన్నమయ్య జిల్లా మామిడి సాగుకు పెట్టింది పేరు. ఇటు జిల్లా ప్రధాన కేంద్రం రాయచోటి మొదలు మదనపల్లె వరకు, అటు రాజంపేట మొదలు రైల్వేకోడూరు వరకు మామిడి తోటలకు ప్రసిద్ధి. సాధారణంగా డిసెంబరు నెల నుంచీ పూత రావాల్సి ఉండగా మదనపల్లెలో జనవరి వరకు పూత రాకపోవడంతో రైతులు ఆశలు వదులుకున్నారు. ఎండప్రభావం తోడుకావడంతో ఆలస్యంగా ఫిబ్రవరి చివరిలో వాతావరణ మార్పులు చోటుచేసుకోవడంతో పూత వచ్చింది. దీంతో ఆ ప్రాంత రైతుల్లో ఆనందం చిగుర్చినా ఇదే జిల్లాలోని రాయచోటి ప్రాంతమైన గాలివీడులో ఒక వైపున పూత ఉన్నా మరో వైపు పూత సరిగ్గా రాలేదు. తెగుళ్ల సోకడం, వాతావరణ ప్రభావం, పొగమంచు ఏర్పడడమే ఇందుకు కారణమని రైతులు చెబుతున్నారు. కాగా ఈఏడాది ఆలస్యంగానైనా వచ్చిన పూత సరిగా లేదు. అంతేకాకుండా వచ్చిన పూత కూడా పింజ దిగకుండా రాలిపోవడంతో రైతుకు కంటిమీదు కునుకు లేదాయె. ఈ విషయంలో అటు రైతులు, ఇటు తోటలను గుత్తకు తీసుకున్న వ్యాపారులు ఆందోళన చెందుతు న్నారు. ఈ విపత్కర పరిస్థితుల్లో ఉద్యాన అధికారులు రైతులకు సూచనలు చేస్తే మామిడి తోటలు సాగుదారులు కనీసం కొంతవరకైనా ఆదాయం పొందవచ్చని పలువురు రైతులు కోరుతున్నారు. వివరాల్లోకెళితే.....


పందికుంటలో సరిగ్గా రాని పూత

చిగురిస్తున్న ఆశలు

మదనపల్లె అర్బన్, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి):
సాధారణంగా డిసెంబరు నెలలో మామిడి పూత దశకు వస్తుంది. అప్పటి నుంచే మామిడి రైతులు రకర కాల సతవలు చెట్టుకు ఇస్తూ వస్తుంటారు. అయితే ఈఏడాది అను కోకుండా వచ్చిన తుపాన్‌లు, పొగ మంచు ప్రభావంతో వాతావరణ పరిస్థితులు అనుకూలంగా లేవని రైతులు భావించారు. అయితే జనవరి వరకు మామిడి పూత కనబడక పోవడంతో రైతులు ఆశలు వదులుకున్నారు. ఎండ ప్రభావం తోడు కావడంతో ఆలస్యంగా ఫిబ్రవరి ప్రారంభం కాగానే పరిస్థితులు మార డం, పూత వస్తుండడంతో రైతుల్లో ఆశలు చిగురించాయి. ఫిబ్రవరి చివరిలో మామిడి తోటల్లో ఎక్కడ చూసినా పూతతో చెట్లు కళకళలాడుతున్నాయి. అప్పటికే పూతతో పాటు చెట్లల్లో పిందెలు కనబడుతున్నాయి. జిల్లా వ్యాప్తం గా 40 వేల హెక్టార్లలో మామిడి



పక్క మామిడి పూత రాలిపోకుండా నివారించేందుకు క్రిమిసంహారిణి పిచికారీ చేస్తూ పూత రాలకుండా కాపాడుకుంటున్నారు. ఇక యాజమాన్య పద్ధతులు పాటిస్తే ఈ ఏడాది కూడా మంచి దిగుబడి చేతికి వస్తుందని నిపుణులు చెబుతున్నారు.

- జిల్లాలో ఇబ్బడిగా మామిడిపూత
- 40 రకాలకు పైగా మామిడి సాగు
- యాజమాన్య పద్ధతుల్లో సాగు చేయాలి
- పూతను కాపాడుకుంటున్న రైతులు

సాగు చేస్తుండగా అందులో 40 రకాల మామిడి కాయలు సాగుచేస్తున్నారు. దీంతో రైతులు ఈ ఏడాది పంట బాగా ఉంటుందని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

ఆలస్యంగా మామిడి పూత

జిల్లాలోని పలు ప్రాంతాల్లో మామిడి పూత ఈ ఏడాది ఆలస్యంగా కనిపిస్తోందని రైతులు చెబుతున్నారు. ప్రస్తుతం జిల్లాలో మామిడితోపుల్లో ఇబ్బడి ముబ్బడిగా పూత కనిపిస్తోంది. మామిడి పంట సాధారణంగా డిసెంబరులో కొద్దిగా జనవరిలో పూర్తి పూత కనపడాల్సి ఉండగా ఈ సారి ఆలస్యంగా ఫిబ్రవరిలో పూత అల్లుకుంది. జిల్లాలోని చాలా మండలాల్లో ఇప్పుడి ప్పుడే పూత వస్తుడడంతో మామిడి రైతులు పంటపై ఆశలు పెట్టుకున్నారు. మరో

జిల్లాలో 40 వేల హెక్టార్లలో మామిడి సాగు

అన్నమయ్య జిల్లాలో సుమారు 40 వేల హెక్టార్లకు పైగా రైతులు మామిడిని సాగు చేస్తున్నట్లు అధికారులు చెబుతున్నారు. ముఖ్యంగా జిల్లాలోని పలు ప్రాంతాలైన రైల్వేకోడూరు, రాయచోటి ప్రాంతాల్లో ఎక్కువగా సాగులో ఉన్నా ఆ తరువాత మదనపల్లె, రాజంపేట, పీలేరు, తంబళ్లపల్లె ప్రాంతాల్లో మామిడి తోటల సాగు పెరుగుతోంది. ఏటా మామిడి సాగు పెరుగుతోంది. రానురాను భవిష్యత్‌లో జిల్లాలో మామిడి సాగుకు ప్రసిద్ధి చెందుతుంది. వివిధ రకాల మామిడి కాయలు సాగు చేస్తూ ఇక్కడ రైతులు ఇతర రాష్ట్రాలకు ఎగుమతులు చేస్తున్నారు. ఈ ఏడాది మామిడి పూత ఆలస్యమైనా మెండుగా రావడంతో రైతుల ఆశలు చిగురిస్తున్నాయి. కాగా పూత తగ్గట్టుగా దిగుబడి వచ్చిందంటే మామిడిలో ఆశించినంత ఆదాయం వస్తుందని రైతాంగం ఆశిస్తోంది.

నాలుగు నెలలు మామిడి మార్కెట్....

జిల్లాలో పండించిన మామిడి పంటకు ఇతర రాష్ట్రాల్లో కూడా డిమాండ్ ఉంటుంది. ఇక్కడ ఎక్కువగా బేనీషా, నీలం, బెంగళూరు, లాల్‌బహర్, మల్గూబ, తోతాపురి, ఇమామ్, పసందు, ఎర్రనీలం, ఇతర అనేక రకాల మామిడి మార్కెట్‌లో అందుబాటులో ఉంటాయి. ప్రధానంగా రైల్వేకోడూరు ప్రాంతంలో మామిడి మార్కెట్ కళకళలాడుతుంటోంది. నాలుగు నెలల పాటు సీజన్‌లో మార్కెట్ ఉంటుంది. జిల్లాలోని దాదాపు అన్ని ప్రాంతాల నుంచి ముఖ్యంగా రైల్వే కోడూరు మార్కెట్ నుంచి ఢిల్లీ, హరియాణ, చండీఘర్, బెంగళూరు విజయవాడ, హైదరాబాదు, చైన్నై తదితర ప్రాంతాలకు జిల్లా నుంచి నిత్యం రవాణా జరుగుతోంది. వీరబల్లి, సుండుపల్లె ప్రాంతాల్లో పండించిన బేనీషాకు అధికంగా డిమాండ్ ఉంటుంది. ఇతర రాష్ట్రాల వ్యాపారులు కూడా ఈ ప్రాంతాల్లో పండిన మామిడిని ఎక్కువగా ఇష్టపడుతుంటారు. జిల్లాలో మామిడి పంట జూలై వరకు వస్తూనే ఉంటుంది.

ఆశ నిరాశల మామిడి

గాలివీడు, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): మామిడి రైతుకు ఈ ఏడాదిపూత దశలోనే కష్టకాలం మొదలైంది. సాధారణంగా డిసెంబరు తొలివారంలోనే పూతతో నిండుగా కనిపించే మామిడితోటలు ఫిబ్రవరి వచ్చినా సగం చెట్లే పూత దశకు చేరుకున్నాయి. గాలివీడు మండలం నూలివీడు, సీసీ పల్లె, ఎగువగొట్టివీడు, గోరాన్‌చెరువు, గోపనపల్లె, పేరంపల్లె, గుండ్లచెరువుతో పాటు అన్ని పంచాయతీల్లో దాదాపుగా మూడు వేల ఎకరాలకు పైన మామిడి తోటలను రైతులు సాగు చేస్తున్నారు. నవంబరు, డిసెంబరు నెలల్లో సక్రమంగా వర్షాలు కురవక పోవడం, వాతావరణంలో మార్పుల వలన ఈ సారి పూత ఆలస్యమైందని రైతులు తెలియజేస్తున్నారు. అయితే తేనె మంచు పురుగు, నల్లి తదితర తెగుళ్లతో పూతదశలోనే చాలా వరకు రాలిపోతోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

వాతావరణ పరిస్థితుల ప్రభావం

వాతావరణ పరిస్థితులకు అనుగుణంగానే మామిడి పూత, కాపు ఆధారపడిపడి దిగుడిపై ప్రభావం చూపుతోంది. ఉష్ణోగ్రతలు తక్కువగా ఉంటే పూత సక్రమంగా రాదు. పూత వచ్చినవి కూడా విచ్చుకోక రాలిపోతోందని రైతులు వివరిస్తున్నారు. ఉష్ణోగ్రతలో పూత ఆలస్యం కావడం, వచ్చిన పూత కూడా సక్రమంగా నిలవక పోవడంతో దిగుబడిపై తీవ్ర ప్రభావం పడుతుందన్నారు.

సబ్సిడీపై ఎరువులు

క్రిమిసంహారిణులు ఇవ్వాలి



ఏడాదికి ఒక ఎకరాకు రూ.30 వేల నుంచి రూ.40 వేల వరకు ఖర్చు అవుతోంది. ఎకరాకు రెండు టన్నుల దిగుబడి వస్తే ఉన్న రూ.30వేలకు పైబడి దర పలి కితే పెట్టుబడి మాత్రమే వస్తోంది. అంతకన్నా తక్కువ దిగుబడి వస్తే తీవ్రంగా నష్టపోతాము. కావున ప్రభుత్వం మామిడి సాగురైతులకు కూడా సబ్సిడీపై ఎరువులు, పురుగు మందులు ఇచ్చి ఆదుకోవాలి.

- నక్కల యోగాంజుల్‌రెడ్డి, నూలివీడు

ఈ సారి అన్నీ సమస్యలే



మా కుటుంబం ఐదెకరాల్లో మామిడిని సాగు చేశాము. పూత రాక ముందు నుంచి ఇప్పటి వరకు నాలుగుసార్లు మందులను వాడినాము. ఎకరాకు 10 వేలకుపైన మందులను ఖర్చు చేశాము. అయినా పూత సక్రమంగా నిలబడలేదు. వచ్చిన పూత, పింజ దశ నుంచి కాయ దశ వరకు కూడా ఇంకా అనేక సార్లు మందులను వాడాలి, దిగుబడి ఎక్కువుగా ఉంటే నష్టాలు రావు. దిగుబడి తక్కువుగా ఉంటే తీవ్రంగా నష్టపోతాం.

- సుదర్శన్‌రెడ్డి, పందికుంట, గాలివీడు మండలం

సాధారణంగా పూతను బట్టి లేత, పిందె దశలోనే దిగుబడిపై అంచ నాలు ఉంటా యని, ప్రస్తుత పరిస్థితుల్లో దిగుబడి అంచనాలు ఉంటాయి. అయితే దిగుబడి కూడా చెప్పలేని పరిస్థితుల్లో రైతులు ఆందోళన చెందుతున్నారు.

తీవ్రమైన తెగుళ్లు

పదేళ్ల కిందట మామిడి తోటలకు తెగుళ్లు సోకేవి కావని అప్పుడు ఒక్కసారి కూడా తెగుళ్లకు మందులు పిచికారీ చేసేవాళ్లము కాదని రైతులు అంటున్నారు. కానీ నేడు మామిడి తోటలకు ఎక్కువగా తెగుళ్లు సోకుతున్నాయని అక్టోబరు నుంచి ఇప్పటి వరకు ప్రతి నెలా మందులను కొట్టినా తెగుళ్లు తగ్గలేదన్నారు.

- పూత ఘనం, పింజ శూన్యం
- పూతను నలిచేస్తున్న తెగుళ్లు
- నిరాశలో మామిడి సాగు రైతులు, వ్యాపారులు

ముఖ్యంగా పొగమంచు కురవడంతో పూతకు ఎక్కువగా తెగుళ్లు సోకుతున్నాయని తెలిపారు. ప్రస్తుతం మామిడి చెట్లకు, పూతకు పచ్చతెగుళ్లు, మంచు తెగుళ్లు, బూడిద తెగుళ్లు, పక్షికన్ను తెగుళ్లు, తామర పురుగు తెగుళ్లు సోకుతున్నాయని తెలిపారు. ఈ తెగుళ్లు సోకడంతో పూత అంతా పింజ పట్టకుండా రాలిపోతోందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ ఏడాది సకాలంలో వర్షాలు లేక పోవడంతో వరి, వేరేశనగ వంటి ఆదాయం వచ్చే పంటలను సాగు చేయలేదని రైతులు పేర్కొన్నారు. ఈ ఏడాదైనా మామిడి మామిడి తోటలు దిగుబడి ఎక్కువుగా ఉంటారని ఆశపడినా ప్రస్తుత పరిస్థితులను బట్టి చూస్తే పంట అంత ఆశాజనకంగా లేదన్నారు. ప్రస్తుతం మామిడి తోటలకు పూత ఏపుగా రావడానికి,వచ్చిన పూత, పింజగా మారానికి ఇప్పటికే వేలకువేలు ఖర్చు పెట్టి వివిధ రకాల మందులను కొట్టినా పింజ సక్రమంగా పట్టలేదన్నారు. ఇదే పరిస్థితులు కొనసాగితే ఒక్కొక్కరు లక్షల్లో నష్టపోవాల్సి వస్తుందన్నారు.

లారీ, టాటాఏసీ ఢీ - డ్రైవర్ మృతి

మదనపల్లె అర్బన్, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): లారీ, టాటాఏసర్ ఢీకొనడంతో టాటాఏసర్ డ్రైవర్ మనోహర్ (24) అక్కడికి అక్కడే మృతి చెందాడు. ముదివేడు పోలీసుల కథనం మేరకు వివరాల్లోకెళితే... ములకలచెరువు మండలం, సోంపాళెం గ్రామం, రాయప్పగారిపల్లె వాసి ఉత్తన్న కుమారుడు మనోహర్ డ్రైవరుగా ఉన్నాడు. పనిలో భాగంగా ములకలచెరువు నుంచి మదనపల్లెలోని నీరుగట్టువారిపల్లె టమోటా మార్కెట్‌కు లోడుతో గురువారం రాత్రి వచ్చి టమోటాలు దించాడు. శుక్రవారం తెల్లవారు జామున తిరుగు ప్రయాణంలో కురబలకోట సమీప బ్రిడ్జిపై ములకల చెరువు నుంచి చైన్నై వైపు వెళ్లుతున్న లారీ టాటాఏసర్ రెండూ ఎదురుఎదురుగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో డ్రైవర్ మనోహర్ రెండు వాహనాల మధ్యలో ఇరుక్కుని చనిపోయాడు. పోలీసులు మృతదేహాన్ని ఎక్సకవేటర్‌తో వెలికి తీసి శవ పరీక్ష కోసం మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ముదివేడు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

బెంగుళూరులో గురుకుల విద్యార్థినుల సందడి



బెంగళూరులో విప్రో అవార్డుల కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థినులు

కలికిరి, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): బీసీ బాలికల గురుకుల పాఠశాల విద్యార్థినులు బెంగళూరులోని విప్రో అజీమ్ ప్రేమ్‌జీ యూనివర్సిటీలో శుక్రవారం సందడి చేశారు. విప్రో ఎర్తియన్-24 పోటీల్లో పాల్గొన్న ఐదుగురు విద్యార్థినులు జాతీయ స్థాయిలో అవార్డు సాధించిన విషయం తెలిసిందే. దేశ వ్యాప్తంగా మొత్తం 23 పాఠశాలలు జాతీయ స్థాయి అవార్డుకు ఎంపిక కాగా అందులో దక్షిణాదిన ఐదు రాష్ట్రాల నుంచి కలికిరి గురుకుల విద్యార్థినులు చోటు దక్కించుకోవడం విశేషం. రెండు రోజులు జరుగుతున్న అవార్డుల ప్రదాన ఉత్సవాల్లో వీరు పాల్గొంటున్నారు. శుక్రవారం ఒక్కో విద్యార్థినిని ఒక్కో రాష్ట్రం విజేతలతో కలిపి ప్రదర్శనలు, వర్క్‌షాపులు నిర్వహించారు. కలికిరి బీసీ గురుకుల పాఠశాలకు చెందిన కె.ఖ్యాతి, జె.రూపిక, టి.భవ్యశ్రీ, ఎం.చందన అగర్వాల్, పి.సుప్రియ జాతీయస్థాయి అవార్డును చేజిక్కించుకున్నారు. ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ అప్సానా ఆధ్వర్యంలో వీరు నిర్వహించిన పెప్పెట్రీ (తోలుబొమ్మలాట), ఆర్ట్ గ్యాలరీ, స్టోరీ టెల్లింగ్, విజువల్ ఆర్ట్ కార్యక్రమాలు ఆకట్టుకున్నాయని తెలిపారు. సీపీ రామస్వామి ఎన్విరాన్‌మెంటల్ ఎడుకేషన్ సెంటర్ (సీపీఆర్ ఈఈసీ)కి చెందిన ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ కోఆర్డినేటర్ వెంకటరత్నం కలికిరి విద్యార్థినులకు సమన్వయకర్తగా వ్యవహరిస్తున్నారు. శనివారం విప్రో ఎక్జిక్యూటివ్ చైర్మన్ రిషద్ ప్రేమ్‌జీ, అజీమ్ ప్రేమ్‌జీ, ఫౌండేషన్ సీఈఓ అనురాగ్ బేహర్ విజేతలకు అవార్డుగా రూ.50 వేల నగదు, ప్రశంసా పత్రాలు అందజేయనున్నారు.

'గ్రామ కంఠాన్ని ఆన్‌లైన్ చేశారు'

నందలూరు, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): సర్వేనంబరు 66/13లో ఎకరా 60 సెంట్లు గ్రామకంఠం స్థలాన్ని కొందరు ఆన్‌లైన్ చేసుకున్నారని కుంపిణీపురం వాసులు ఆరోపించారు. గ్రామస్థులు మాట్లాడుతూ నూకినేనిపల్లె పంచాయతీ సర్వేనంబరు 66/13లో ఒక ఎకరా 60 సెంట్లు గ్రామకంఠం స్థలం ఉందన్నారు. అందులో దాదాపు 20 ఇళ్లు, కొన్ని పాడుబడిన ఇళ్లు ప్రభుత్వ రోడ్, చేతిబోరు ఉన్నాయన్నారు. ఇక్కడే సుమారు 40 ఏళ్లగా వివిధ కులాలవారం జీవిస్తున్నామని, నేడు కొందరు వచ్చి ఆ స్థలం మాది అని మా పేరుతో రిజిస్టర్ అయిందని ఖాళీ చేయాలని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో ఆ స్థలంలోనే కుమ్మరి కుండలు చేసుకుని అమ్ముకునేవారని తెలిపారు. రెవెన్యూ వారిని మోసగించి వారిపేరుతో ఆన్‌లైన్ చేసుకున్నారన్నారు. 2024 డిసెంబరులో ఆ స్థలాన్ని రిజిస్టర్ చేసుకున్నారన్నారు. ఇప్పుడు వారు దౌర్జన్యంగా తాము నివశిస్తున్న స్థలాల్లో ఎక్స్‌కవేటర్లు పెట్టి చదును చేస్తూ తమను ఖాళీ చేయమని బెదిరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

వ్యక్తి ఆత్మహత్య

పుల్లంపేట, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): కుటుంబ సమస్యల కారణంగా కొండే నాగిరెడ్డి(43) గురువారం రాత్రి ఉరివేసుకున్నట్లు పుల్లంపేట పోలీసులు తెలిపారు. పోలీసుల కథనం మేరకు కేతవాండ్లపల్లె వాసి కొండే నాగిరెడ్డి కూలి పనులు చేసుకుంటూ జీవిస్తున్నాడు. నాలుగు నెలల కిందట యాక్సిడెంట్ జరగడంతో గాయపడి కోలుకున్నాడు. ప్రమాద సమయంలో గుండెపోటు వచ్చిందని, ఆరోగ్య సమస్యలు, కుటుంబ సమస్యలు తోడవడంతో ఇంట్లో ఉన్న కొక్కికి లుంగీతో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

గిట్టుబాటు ధరలపై చర్యలు

క్రేటుకు రూ.300 ధర కల్పించండి: ఎమ్మెల్యే ● టమోట రైతులతో సబ్‌కలెక్టర్ ముఖాముఖి

నెల్లూరు, కావలి రైతుబజార్లకు మదనపల్లె టమోటా


కాశీరావుపేట వద్ద తోటలో టమోట రైతులతో మాట్లాడుతున్న సబ్‌కలెక్టర్ మేఘస్వరూప్

మదనపల్లె టౌన్, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో మిర్చి ధరలు పడిపోతున్న నేపథ్యంలో రాబోయే రోజుల్లో టమోటకు గిట్టుబాటు ధరలు కల్పించాలని ప్రభుత్వం చర్యలకు ఉపక్రమించింది. కలెక్టర్ సూచనలతో మార్కెటింగ్ అధికారులతో కలసి సబ్‌కలెక్టర్ మేఘస్వరూప్ క్షేత్రస్థాయిలో వెళ్లి రైతులను, మార్కెట్‌యార్డులో వ్యాపారులు, అధికారులతో చర్చించారు. శుక్రవారం మదనపల్లె మండలం కాశీరావుపేట వద్ద టమోట రైతులతో సబ్‌కలెక్టర్ మాట్లాడుతూ ప్రస్తుతం మార్కెట్ లో టమోట ఎంత ధర, ఖర్చు, గిట్టుబాటుపై ప్రశ్నించారు. రైతులు మాట్లాడుతూ కిలో టమోటాకు రూ.12 ధర వస్తే గిట్టుబాటు అవుతుందని, పెట్టుబడి తిరిగి వస్తుందన్నారు. మార్కెటింగ్ ఏడీ త్యాగరాజు, ఏపీ మాస్ ప్రతినిధి మధుసూదన్ రెడ్డితో సబ్‌కలెక్టర్ చర్చించారు. బయట మార్కెట్‌కు రైతుల పొలం నుంచే టమోటా తరలిస్తే ఎలా వుంటుందని, అక్కడి ధరలు, ఇక్కడ ధరలు సరిపోల్చారు. సబ్‌కలెక్టర్ మాట్లాడుతూ డివిజన్‌లో ఏయే మండలాల్లో టమోట దిగుబడి వస్తుందో అక్కడికి వెళ్లి రైతులతో చర్చించి, వారికి గిట్టుబాటు ధరలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటామ న్నారు. అనంతరం టమోటా మార్కెట్‌లో ఎమ్మెల్యే షాజహాన్‌బాషాతో కలసి రైతులు, వ్యాపారులతో సబ్‌కలెక్టర్ చర్చించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రస్తుతం కిలో టమో టా కనిష్టంగా రూ.6 నుంచి గరిష్టంగా రూ.10 వరకు ధరలు పలుకుతున్నాయని, దీని వలన రైతులకు గిట్టుబాటు ధరలు రావడం లేదన్నా రు. 25 కిలోల క్రేట్ టమోటా రూ.300 నుంచి రూ.350 ధర కల్పించేలా అధికారులు చర్యలు తీసుకోవాల్సిన అవసరం వుందన్నారు. మదనపల్లె టమోటా యార్డులో నిత్యం 60 నుంచి 70 మెట్రిక్ టన్నులు టమోట విక్రయానికి వస్తున్నాయని, భవిష్యత్‌లో పెరిగితే తీసుకోవాల్సిన చర్యలపై మార్కెటింగ్ ఏడీఎంతో ఎమ్మెల్యే చర్చించారు. హార్టికల్చర్ అధికారి ఈశ్వర ప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

నెల్లూరు, కావలికి మదనపల్లె టమోట

మదనపల్లె టమోట యార్డు నుంచి నెల్లూరు, కావలి రైతుబజార్లకు 10 టన్నుల టమోట ఎగుమతి చేస్తున్నామని సబ్‌కలెక్టర్ మేఘస్వరూప్ ప్రకటించారు. శుక్రవారం మార్కెటింగ్ ఏడీ త్యాగరాజు ఆధ్వర్యంలో మదనపల్లె టమోట మార్కెట్‌లో రైతుల నుంచి కిలో రూ.8.46 పైసలు చొప్పున టమోటలను కొనుగోలు చేశారు. రైతుల నుంచి కొనుగోలు చేసిన 10 టన్నుల టమోటను నెల్లూరు, కావలి రైతు బజార్లకు రవాణా చేశారు. ఏడీఎం మాట్లాడుతూ పై రెండు రైతుబజార్లలో ప్రజలకు టమోట కిలో రూ.12 చొప్పున విక్రయిస్తామన్నారు. ధరలు స్థిరీకరణ అయ్యేంత వరకు మదనపల్లెలో టమోటలను కొనుగోలు చేసి రైతుబజార్లకు తరలిస్తామ న్నారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖ ఏడీ శివశంకర్, హార్టికల్చర్ అధికారి ఈశ్వరప్రసాద్, యార్డు సెక్రటరి తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ బస్సులు నడపాలి

అర్హులకు పదోన్నతులు ఇవ్వాలి ● కారుణ్య నియామకాలు చేపట్టాలి

● పీలేరులో ఎంప్లాయిస్ యూనియన్(ఈయూ) రాష్ట్ర అధ్యక్షుడు పలిశెట్టి దామోదరరావు


సమావేశంలో మాట్లాడుతున్న పలిశెట్టి దామోదరరావు

పీలేరు, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీలో కొత్తగా వస్తున్న విద్యుత్ బస్సులను ప్రభుత్వమే కొనుగోలు చేసి నిర్వహించాలని ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు పలిశెట్టి దామోదరరావు డిమాండ్ చేశారు. పీలేరులోని ఆర్అండ్‌బీ అతిథి గృహంలో శుక్రవారం జరిగిన ఎంప్లాయిస్ యూనియన్ జనరల్ బాడీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాలుష్య నివారణ, ప్రజలకు మెరుగైన వసతులు కల్పించాలన్న లక్ష్యంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 2035 నాటికి డీజిల్ బస్సుల స్థానంలో పూర్తిగా విద్యుత్ బస్సులు ఏర్పాటు చేయాలని నిర్ణయించారన్నారు. అయితే విద్యుత్ బస్సులను పూర్తిగా ప్రైవేటు సంస్థల ద్వారా నడపకుండా ప్రభుత్వమే కొనుగోలు చేసి నిర్వహించాలన్నారు. తద్వారా ఆర్టీసీలోని సిబ్బందిని కాపాడడమే కాకుండా నిరుద్యోగ సమస్యను తగ్గించవచ్చన్నారు. ఆర్టీసీలో ఇప్పటికే 35 శాతం అద్దె బస్సులు నడుస్తున్నాయని, విద్యుత్ బస్సుల రాకతో ఆ శాతం మరింత పెరిగే అవకాశం ఉందన్నారు. ప్రైవేటీకరణ కారణంగా తమ ఉద్యోగాలు ఉండవేమోనన్న ఆందోళనలో ఆర్టీసీ ఉద్యోగులు ఉన్నారన్నారు. ప్రైవేటు ఆపరేటర్ల కారణంగా ఇప్పటికే సంస్థకు చెడ్డ పేరు వస్తోందని, అలా కాకుండా ప్రస్తుతం ఉన్న సిబ్బందికి శిక్షణ ఇచ్చి విద్యుత్ బస్సుల్లో నియమించాలన్నారు. విద్యుత్ బస్సుల కారణంగా ఇప్పటికే తిరుపతిలోని అలిపిరి డిపో పూర్తిగా మూతపడిందన్నారు. రాష్ట్ర విభజన నాటికి ఆర్టీసీలో 62 వేల మంది సిబ్బంది ఉంటే ప్రస్తుతం 47 వేల మంది రెగ్యులర్ ఉద్యోగులు, 8 వేల మంది ఔట్ సోర్సింగ్ సిబ్బంది ఉన్నారన్నారు. వీరు కాకుండా అద్దె బస్సు డ్రైవర్లు, ఆన్ కాల్ డ్రైవర్లు మరో 20 వేల మంది పనిచేస్తున్నారన్నారు. ప్రస్తుతం సంస్థలో ఖాళీగా ఉన్న 12 వేల ఖాళీల్లో అర్హత ఉన్న వారిని పదోన్నతులు కల్పించాలని, రెగ్యులర్ ప్రాతిపదికన నియామకాలు చేపట్టాలన్నారు. అలాగే చాలా కాలంగా పెండింగ్‌లో ఉన్న కారుణ్య నియామకాలు కూడా పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో జోనల్ నేతలు జీఎస్‌మణ్యం, అన్నమయ్య జిల్లా అధ్యక్షులు ఆనంద బాబు, కార్యదర్శి బీసీ శేఖర్, పీలేరు డిపో అధ్యక్షులు ఏఆర్ చంద్ర, కార్యదర్శి ఖాదర్ బాషా, సీసీఎస్ డెలిగేట్స్ కేవీ రమణ, వేణు, జిల్లా కమిటీ సభ్యులు శోభారాణి, శ్రీనివాసులు, ప్రదీప్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

ఉరి వేసుకుని యువకుడు మృతి



రాజంపేట టౌన్, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): హత్యరాల సమీపంలో సింగమల హరిప్రసాద్(32) చెట్టుకు ఉరేసుకున్నాడు. పుల్లంపేట మండలం రామక్కపల్లె హరి జన వాడ వాసిగా పోలీసులు గుర్తించారు. విషయాన్ని తల్లి ఆదెమ్మకు తెలపడంతో కుమారుడు మృతదేహం చూసి ఆమె విలపించింది. తండ్రి నరసింహులు మృతి చెందిన ప్పటి నుంచీ హరిప్రసాద్ మతిస్థిమితం కోల్పోయి అనారోగ్యంతో బాధపడు తున్నాడని ఆమె తెలిపారు. ఐదు రోజులుగా హరిప్రసాద్ ఇంటి నుంచి వెళ్లిపోయాడని తల్లి ఆవేదన వ్యక్తం చేసింది. మన్నూరు పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

వెలుగొచ్చింది



మదనపల్లె, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): ప్రజాసమస్యల పరిష్కారమే ధ్యేయంగా ముందుకెళ్తున్న ఆంధ్రజ్యోతి చేపట్టిన 'అక్షరం అండగా.. పరిష్కారమే అజెండా'లో ప్రజలు ప్రస్తావించిన సమస్యలకు మున్సిపల్ అధికారులు శుక్రవారం స్పందించారు. మదనపల్లె పట్టణం ప్రశాంత్‌నగర్ 30వ వార్డులో జనవరి 28న జరిగిన కార్యక్రమంలో ప్రశాంత్ నగర్‌లోని వివిధ లేన్లు, సప్తగిరినగర్ ఏరియాల్లో విద్యుత్తు దీపాలు వెలగడం లేదని స్థానికులు ప్రస్తావించారు. దీనిపై స్పందించిన మున్సిపల్ కమిషనర్ కె.ప్రమీల ఇచ్చిన హామీ మేరకు సామగ్రి తెప్పించి పది వీధిలైట్లు ఏర్పాటు చేశారు. మున్సిపల్ డీఈ శ్రావణి, వార్డు అమెనిటీ సెక్రటరీ మానస, స్థానిక టీడీపీ నాయకుడు భాస్కర్ ముందుండి ఏర్పాట్లు చేశారు. ప్రశాంత్ నగర్‌లో ఒకటో లైన్ నుంచి తొమ్మిదో లైన్ వరకు, సప్తగిరినగర్‌లోని వివిధ ఏరియాల్లో మరమ్మతులకు గురైన లైట్లను తొలగించి కొత్తవాటిని ఏర్పాటు చేశారు. రాత్రివేళల్లో వీధి లైట్లు లేక అంధకారంలో ఉంటున్న స్థానికులు.. వీధిలైట్ల ఏర్పాటుతో సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఇదే కార్య క్రమంలో ఎ.వి.నాయుడు కాలనీలో ఓవర్ హెడ్ ట్యాంకు వద్ద, ట్యాంకు ఆవరణలో పారిశుధ్యం అధ్వానంగా ఉందని, కాల్వలు శుభ్రం చేయాలని స్థానికులు సమస్యలను పాలకులు, అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. ఇందులో భాగంగా మున్సిపల్ కమిషనర్ వారం కిందటే పారిశుధ్య కార్మికుల చేత గ్యాంగ్‌వర్క్స్ చేయించిన విషయం పాఠకులకు తెలిసిందే. ఆంధ్రజ్యోతి ద్వారా వెలుగులోకి వచ్చిన వివిధ సమస్యలను అంచెలంచెలుగా పరిష్కరిస్తామని కమిషనర్ పేర్కొన్నారు.


మరమ్మతుల అనంతరం వెలుగుతున్న వీధిలైటు

ప్రశాంత్‌నగర్‌లో విద్యుత్ స్తంభానికి వీధిలైటు ఏర్పాటు చేస్తున్న మున్సిపల్ సిబ్బంది



జలగల్లా... వడ్డీ వ్యాపారులు

పులివెందుల టౌన్, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో వడ్డీ వ్యాపారులు చెలరేగిపోతున్నారు. నూటికి 5, 10, 15 వడ్డీలు వసూ లు చేస్తూ సామాన్యులను జలగల్లా పీలుస్తున్నారు. పేద మధ్యతర గతి వారి అవసరాలను ఆసరాగా చేసుకుని వడ్డీలు కాజేస్తున్నారు. కొందరు సంస్థ పేరుతో రిజిస్ట్రేషన్ చేయించుకుని వడ్డీ వ్యాపారాలు చేస్తుండగా మరికొంత మంది ఎలాంటి రిజిస్ట్రేషన్‌లు లేకుండా అనధికారికంగా అప్పులు ఇచ్చి వసూళ్లకు పాల్పడుతున్నారు. ముఖ్యం గా ఆస్తులను రిజిస్ట్రేషన్ చేసుకుని అప్పులు ఇచ్చి అధిక వడ్డీలు గుంజుతున్నారు. ఇలా అప్పులు తీసుకున్న వారిలో కొందరు గతంలో రియల్ ఎస్టేట్ వ్యాపారం కూడా చేశారు. ప్రస్తుతం రియల్ భూం మందగించడంతో అప్పులు తీసుకున్న వ్యక్తులు సకాలంలో చెల్లించలేకపోతున్నారు. ఈనేపథ్యంలో ష్యూరిటీ కోసం రిజిస్ట్రేషన్‌లు చేసుకున్న ఆస్తులను వడ్డీవ్యాపా రులు స్వాధీనం చేసుకునే ప్రయత్నాలు చేస్తున్నారు, న్యాయబద్ధమైన వడ్డీ చెల్లిస్తామని చెబుతున్నప్ప టికీ వడ్డీ వ్యాపారులు వినిపించుకోవడం లేదు. దీంతో కొన్ని పంచాయితీలు పోలీసు స్టేషన్ వరకు వెళుతున్నాయి. మరికొన్ని వివాదాలకు దారితీస్తున్నాయి.

ఒక్కరోజు ఆలస్యమైనా వడ్డీపై వడ్డీ

నిబంధనలకు లోబడి వడ్డీ వ్యాపారాలు సాగించాల్సిన వ్యాపారులు సామాన్యుడిని పిండేస్తున్నారు. ఒక్కరోజు వడ్డీ చెల్లించడం ఆలస్య మైనా వడ్డీపై వడ్డీ వేస్తున్నారని బాధితులు వాపోతున్నారు. గతంలో ఇలాగే వడ్డీ వ్యాపారులు చెలరేగిపోయిన నేపథ్యంలో హత్యలకు దారితీసిన సంఘటనలు పులివెందులలో చోటుచేసుకున్నాయి. అయి తే కొద్దిరోజులు వ్యాపారులు స్తబ్ధుగా ఉండి మళ్లీ వడ్డీ వ్యాపా రం సాగిస్తున్నట్లు సమాచారం. వడ్డీ వ్యాపారులు మార్కెట్లో బహిరం గంగా 10 నుంచి 15 రూపాయలు వడ్డీలకు నగదు అప్పుగా ఇచ్చి.. అసలు కన్నా వేలకు వేలు వడ్డీల రూపంలో వసూలు చేస్తున్నారని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇక వడ్డీ వసూళ్లలో నగదు ఇచ్చి వడ్డీ వసూలు చేయడం ఒక పద్ధతి అయితే.. రోజువారీ వడ్డీలు చెల్లించేలా చిరు దుకాణాలకు, షాపుల్లో వర్కర్లకు అప్పులు ఇస్తారు. వీరి నుంచి సాధారణంగా పదివేలు టెండరు రూపంలో అప్పుగా తీసకుంటే పరిమితి గడువులో 13వేలు చెల్లించాలి. ఏ ప్రాతిపదికన ఈ వడ్డీని లెక్క కడతారో ఎవరికీ అర్థం కాదు. రూ.200 సంపాదించే కూలీ నుంచి వంద ఈ వడ్డీ వ్యాపారులే కాజేస్తున్నారు. తెలియక అప్పులు తీసుకుని ఇలా ఇరుక్కుపోతున్నామని పలువురు వాపోతున్నారు. ప్రశ్నిస్తే బెదిరిస్తున్నారని చెబుతున్నారు.

పంచాయితీలకు దారితీస్తూ...

పట్టణ పరిధిలో గత ఐదారు నెలల్లో వడ్డీ వ్యాపారుల పంచాయతీలు భారీ స్థాయిలో జరిగాయి. కొంతమంది రియల్ ఎస్టేట్ వ్యాపారుల వద్ద తీసుకున్న రుణాల విషయంలో చివరికి పోలీసుస్టేషన్‌కు వెళ్లి ఏదోరకంగా పరిష్కారం చేసుకోగా, మరికొన్ని పేచీలతో నడుస్తూనే ఉన్నాయి. గత టీడీపీ ప్రభుత్వంలో వడ్డీ వ్యాపారులు వేధిసున్న సంఘటనలు వెలుగులోకి రావడంతో విజయవాడలో కాల్‌మనీ కేసులు పెట్టిన విషయం తెలిసిందే. పులివెందుల ప్రాంతంలో ఈ పేచీలు రోజురోజుకూ పెరుగుతుండడంతో బాధితులు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసేందుకు సిద్ధమవుతున్నారు. ఏదోరకంగా న్యాయ బద్ద వడ్డీతో అప్పులు చెల్లిస్తామని చెబుతున్నా ఆస్తులకు విలువలు పెరగడంతో వడ్డీవ్యాపారులు పేచీలు పెడుతుండడంతో సమస్యలు జఠిలమవుతున్నాయి.

ఆన్‌లైన్ రుణాలతో ఇబ్బందులు

ఇటీవల కాలంలో ఆన్‌లైన్ రుణాలు తీసుకుని కొందరు యువకులు వారి వత్తిడి తట్టుకోలేక ఇబ్బంది పడుతున్న సంఘటనలు పులివెందులలో వెలుగులోకి వచ్చాయి. ఆన్‌లైన్‌లో యువకులను పరిచయం చేసుకుని మాయ మాటలు చెప్పి రుణాలు ఇస్తున్నారు. వారు వసూలు చేసే వడ్డీ చెల్లించలేక యువకులు ఏం చేయాలో పాలుపోక అల్లాడిపోతున్నారు. ఇటీవల పులివెందుల పట్టణంలో చిన్నకొండారెడ్డి కాలనీలో ఓవ్యక్తి ఆన్‌లైన్ రుణం తీసుకున్నాడు. గడువులోపు చెల్లించ లేకపోవడంతో ఆ యాప్ వారు వేధింపులకు పాల్పడ్డారు. సింహాద్రిపురం మండలం దిద్దకుంట గ్రామా నికి చెందిన ఒక కుటుంబం వడ్డీ వ్యాపారుల ఒత్తిళ్లతో ఆత్మహత్య చేసుకున్న సంఘటన తెలిసిందే. ఇప్పటికైనా ఉన్నతాధికారులు వడ్డీ వ్యాపారులపై ప్రత్యేక నిఘా పెట్టి కట్టడి చేయాలని పలువురు కోరుతున్నారు.

భూసమస్యతో రైతు ఆత్మహత్యాయత్నం

● గుమ్మసముద్రం సచివాలయం వద్ద ఉద్రిక్తత

● సర్దిచెప్పిన తహశీల్దార్...పోలీసులు



నిరసనకు దిగిన రైతుకు సర్దిచెబుతున్న తహశీల్దార్..పోలీసులు

బి.కొత్తకోట, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): తన భూసమస్యను పరిష్కరించాలంటూ ఎన్నిసార్లు తిరిగినా ఫలితం లేకపోవడంతో సహనం కోల్పోయిన ఓ రైతు సచివాలయం ఎదుట ఒంటిపై పెట్రోలు పోసుకొని ఆత్మహత్యా యత్నానికి పాల్పడ్డాడు. శుక్రవారం మండలంలోని గుమ్మసముద్రం సచివాలం వద్ద జరిగిన ఈ ఘటన చర్చనీయాంశంగా మారింది. బి.కొత్తకోట మండలం గుమ్మసముద్రం పంచాయతీ గండువారిపల్లెకు చెందిన రైతు తన భూమిని ఆన్‌లైన్ చేయలేదని, తన ముటేషన్‌దరఖాస్తును తిరస్కరించారంటూ నిరసనకు దిగాడు. రెవెన్యూ అధికారులతో వాగ్వాదం చేశాడు. ఎట్టి పరిస్థితుల్లోనూ నా సమస్య తీర్చాలంటూ పట్టుబట్టాడు. అధికారులు స్పందించకపోవడంతో సచివాలయం ఎదుటే ఒంటిపై పెట్రోలు పోసుకొని ఆత్మహత్యాయత్నం చేశాడు. సచివాలయ సిబ్బంది, అక్కడే ఉన్న మరికొందరు రైతులు అడ్డుకొని రైతు సుదర్శన్‌ను రక్షించారు. ఘటనపై సమాచారం అందడంతో తహశీల్దార్ అజారుద్దీన్, ఏఎస్ఐ బొజ్జేనాయక్‌లు సచివాలయం వద్దకు చేరుకొని బాధిత రైతుతో మాట్లాడారు. సంబంధిత పొలం వద్దకు వెళ్లి పరిశీలించారు. సమస్యను పరిష్కరించి భూమిని ఆన్‌లైన్ చేస్తామని హామీ ఇవ్వడంతో రైతు శాంతించాడు. ఈ విషయమై రైతు సుదర్శన్ మాట్లాడుతూ తాను కొనుగోలు చేసిన భూమికి 1బి ఇవ్వాలంటూ ముటేషన్‌కు దరఖాస్తు చేశానని, రెవెన్యూ సదస్సులోనూ అర్జీ ఇచ్చానని అన్నాడు. అయినా రెవెన్యూ అధికారులు తనతో ఆడుకుంటున్నారని, అందుకే సహనం కోల్పోయానని అన్నాడు. స్థానిక వీఆర్వో కోటిరెడ్డి మాట్లాడుతూ సుదర్శన్ అనే రైతు రవీంద్ర దగ్గర సర్వేనంబరు 339లో 0.2675 సెంట్లు, 343లో 0.0475 సెంట్లు కొనుగోలు చేశాడని, సంబంధిత సర్వేనంబర్లకు జాయింట్ ఎల్‌పీఎం ఉన్నందున ముటేషన్ ఆమోదం జరగలేదు. రెవెన్యూసదస్సు అర్జీపై ఎండార్స్‌మెంట్ ఇచ్చాము. తదుపరి ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు నిర్ణయం తీసుకుంటామన్నారు.

పొదుపు నైపుణ్యాలు ఆదాయ ప్రగతికి మార్గాలు

కడప ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): వ్యక్తిగత ఆర్థిక ప్రణాళిక, పొదు పు నైపుణ్యాలు ఆదాయ ప్రగతికి మార్గాలని యోగివేమన విశ్వవిద్యాలయం ప్రధాన ఆచార్యులు ప్రొఫెసర్ ఎస్.రఘునాథరెడ్డి అన్నారు. శుక్రవారం వైవీ యూలో డిపార్ట్‌మెంట్ ఆఫ్ బిజినెస్ మేనేజ్‌మెంట్, ఎన్ఎస్ఎస్ యూనిట్ 1 మరియు సెక్యూరిటీస్ ఎక్స్ఛేంజ్ బోర్డ్ ఆఫ్ ఇండియా (ఎస్ఈబీఐ) సంయుక్త ఆధ్వర్యంలో ఫైనాన్షియల్ లిటరసీ - ఎ వే ఫర్ పర్సనల్ ఫైనాన్షియల్ ఎంపవర్‌మెంట్ టు స్టాక్ ఇన్వెస్ట్‌మెంట్స్ అనే అంశంపై వర్క్‌షాప్ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఎక్సెల్ నివేదికతో నెలవారీ బడ్జెట్‌ను ఎలా తయారు చేయాలో చూపించారు. ఉత్తమ పోర్ట్‌ఫోలియోలో స్టాక్ పెట్టుబడులలో అవకాశాలు, సవాళ్లను వివరించారు. అనంతరం బిజినెస్ మేనేజ్‌మెంట్ విభాగాధిపతి డాక్టర్ పి.సరిత, ప్రొఫెసర్ టి.శ్రీనివాస్, సెబీ ట్రైనర్ శ్రీనివాస రావు అవగాహన కల్పించారు.

నర్సాపురం బీపీఎం అరెస్ట్



అరెస్ట్ చేసిన బీపీఎం నాయక్‌ను చూపుతున్న పోలీసులు

కాశినాయన ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నర్సాపురం పోస్టాఫీస్‌లో బీపీఎం (బ్రాంచ్ పోస్టు మాస్టర్) గా పనిచేస్తున్న బుక్కె తిరుపాల్ నాయక్‌ను శుక్రవారం అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ హనుమంతు తెలిపారు. అన్నమయ్య జిల్లా గాలివీడు మండలం బత్తినవాండ్లపల్లి సుగాలి తాండకు చెందిన నాయక్ 14 సంవత్సరాలుగా నర్సాపురంలో బీపీఎంగా విధులు నిర్వహిస్తున్నాడు. ఈక్రమంలో పలువురి ఖాతాదారుల ఆర్డీలు, ఇతర పొదుపు సొమ్ములను అకౌంట్‌లో జమచేయకుండా సొంతఅవసరాలకు వాడుకుంటూ వచ్చాడు. విషయం బహిర్గతం కావడంతో విధులకు రాకుండా తప్పించుక తిరుగుతూ వచ్చాడు. ఈ నేపథ్యంలో నున్నా విజయలక్ష్మి అనే మహిళ నర్సాపురం పోలీస్ స్టేషన్‌లో 2024 సెప్టెంబరు 28న తన ఆర్డీ గడువు తీరగా వచ్చిన డబ్బు, తనకూతురి పేరున కట్టిన సుకన్య సమృద్ధియోజన పథకంలోని రూ2,90,000లను నాయక్ తనకు తెలియకుండా వాడుకున్నాడని ఫిర్యాదు చేసింది. ఈమేరకు కేసు నమోదు చేసి 55 మందిని విచారించగా ఇతను ఖాతాదారులకు చెందిన రూ.22,67,469 వాడుకున్నట్లు ప్రాథమిక దర్యాప్తులో తేలిందన్నారు. సదరు బీపీఎం శుక్రవారం ఓబుళాపురం క్రాస్ రోడ్డులో ఉన్నట్లు సమాచారం అంద డంతో అదుపులోకి తీసుకొని కోర్టులో హాజరుపరిచామన్నారు.

ప్రమాద బాధితులకు సాయం చేస్తూ... యువకుడి మృతి



నరహరినాయుడు మృతదేహం, నరహరినాయుడు (ఫైల్)

ఖాజీపేట, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో గాయపడిన వారికి సాయం చేస్తుండగా విధి వక్రీకరించి ఓ యువకుడు మృత్యువాత పడిన సంఘటన పలువురిని కలిచి వేసింది. వివరాల్లోకి వెళితే.. కడప-కర్నూలు జాతీయ రహదారిలోని కుమ్మరికొట్టాలు వద్ద లారీ ఢీకొనడంతో లగుడుపాటి నరహరినాయుడు (36) మృతి చెందాడు. నలుగురు స్నేహితులు తమ మిత్రుడికి జ్వరం రావడంతో చికిత్స చేయించి మైదుకూరులోని అతని స్వగృహం వద్ద వదిలి పెట్టారు. తిరిగి వెలుతుండగా కుమ్మరికొట్టాలు వద్దకు రాగానే కారు టైరు పగిలి డివైడర్‌ను ఢీకొంది. దీంతో కారులో ప్రయాణిస్తున్న వెంకట భానుప్రకాష్, నాగూర్‌నాగరాజు శివలీల కృష్ణ, జ్ఞానసాయికి స్వల్ప గాయాలయ్యాయి. వీరు రోడ్డుకు అడ్డంగా ఉన్న కారును పక్కకు తొలగిస్తుండగా.. అదే సమయంలో ఖాజీపేట నుంచి దువ్వూరు వెళుతున్న ఆటో డ్రైవర్ నరహరినాయుడు వారికి సాయం చేసేందుకు వెళ్లాడు. అందరూ కలిసి కారును తొలగిస్తుండగా ఖాజీపేట నుంచి మైదుకూరు వెళుతున్న లారీ ఢీకొట్టడంతో నరహరినాయుడు అక్కడికక్కడే మృతి చెందాడు. అతనికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. గాయపడిన వారిని 108 ద్వారా రిమ్స్‌కు తరలించారు. ఈమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ మోహన్ తెలిపారు.

అదుపు తప్పిన కంటైనర్

● డ్రైవర్, క్లీనర్‌కు స్వల్ప గాయాలు



గోటూరు బ్రిడ్జి కింద పడిపోయిన కంటైనర్

వల్లూరు, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): కడప-తాడిపత్రి రహదారిలోని గోటూరు బ్రిడ్జి వద్ద శుక్రవారం తెల్లవారుజామున కంటైనరు అదుపు తప్పి బ్రిడ్జి కిందికి దూసుకుపోవడంతో డ్రైవర్, క్లీనర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు, పోలీసుల వివరాల మేరకు... మహారాష్ట్ర ట్రాన్స్‌పోర్టుకు సంబంధించిన లారీ చెన్నై నుంచి బాంబేకు వెళుతుండగా శుక్రవారం తెల్లవారుజామున డ్రైవరు నిద్రమత్తులోకి జారుకోవడంతో అదుపుతప్పి బ్రిడ్జికి కిందకు దూసుకుపోయింది. సమాచారం అందుకున్న పోలీసులు సంఘనాస్థలానికి వెళ్లి గాయపడిన డ్రైవరు, క్లీనరును రిమ్స్ తరలించి కేసు నమోదు చేశారు.

రసాభాసగా బద్వేలు మున్సిపల్ కౌన్సిల్ సమావేశం

● కమిషనర్, వైసీపీ కౌన్సిలర్ల మధ్య మాటల యుద్ధం ● కమిషనర్‌పై మండిపడ్డ ఎమ్మెల్యే సుధ



కమిషనర్‌పై మూకుమ్మడిగా ఆగ్రహం వ్యక్తం చేస్తున్న వైసీపీ కౌన్సిలర్లు, ఎమ్మెల్యే సుధ, రాజగోపాల్‌రెడ్డి, దీటుగా సమాధానం ఇస్తున్న మున్సిపల్ కమిషనర్ నరసింహారెడ్డి

బద్వేలుటౌన్, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): స్థానిక మున్సిపల్ కార్యాలయంలో శుక్రవారం మున్సిపల్ చైర్మన్ వాకమల్ల రాజగోపాల్‌రెడ్డి అధ్యక్షతన మున్సిపల్ సాధారణ కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. సమావేశానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే సుధ హాజరయ్యారు. అజెండాను ప్రారంభించక ముందే మున్సిపల్ కమిషనర్ వాకమల్ల నరసింహారెడ్డి ఏకపక్ష ధోరణితో వ్యవహరించడం సరికాదని, వార్డు సమస్యలపై వార్డుల్లో పర్యటించే సమయంలో అక్కడున్న ప్రజా ప్రతినిధులకు, కౌన్సిలర్లకు సమాచారం ఇవ్వకుండా వార్డు సమస్యలపై ఏకపక్షధోర ణిగా నిర్ణయాలు తీసుకుంటున్నారంటూ ఎమ్మెల్యే సుధా, వైసీపీ కౌన్సిలర్లు కమి షనర్‌పై ధ్వజమెత్తారు. కాగా ప్రతి మునిసిపల్ సమావేశానికి ఎమ్మె ల్యేగా హాజరవుతున్నా అజెండాలో ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ పేర్లు నమోదు చేయక పోవడంలో ఆంతర్యం ఏమిటని ప్రశ్నించారు. ఇందుకు మున్సిపల్ కమిషనర్ కూడా ఘాటైన సమాధానాలు ఇస్తూ, సమావేశాన్ని హుందాగా నడపాలన్నారు. ఏదైనా వార్డుల్లో సమస్యలుంటే తమ దృష్టికి తీసుకువస్తే వెంటనే పరిష్కరిస్తామంటూ కౌన్సిలర్లపై ఒకింత అసహనం వ్యక్తం చేశారు. ఇందుకు కౌన్సిలర్లు సమావేశానికి వచ్చినప్పుడల్లా సమస్యలు విన్నవిస్తున్నామే తప్ప, వాటిని పరిష్క రించడం లేదంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. అలాగే గత వైసీపీ ప్రభుత్వంలో మీరు కూడా ఇదే ధోరణిలో వ్యవహరించారంటూ టీడీపీ కౌన్సిలర్లు వాదనకు దిగడంతో వాదనలు, ప్రతివాదనలతో మున్సిపల్ సమావేశం దద్దరిల్లిపోయింది. మున్సిపల్ వైస్ చైర్మన్ గోపాలస్వామి నాలా చట్ట ప్రకారం మున్సిపాలిటీలో ఎన్ని ఇళ్లకు అనుమతులు ఇచ్చారో సమాచారం ఇవ్వాలని అర్జీలు ఇచ్చినా, ఇవ్వలేదంటూ ప్రశ్నించారు. దీంతో కోర్టులో ఉన్న సమస్యలపై ఇక్కడ మాట్లాడకూ డదంటూ మున్సిపల్ కమిషనర్ చెప్పడంతో వీరి మధ్య మాటల యుద్ధం చోటు చేసుకుంది. వేసవిని దృష్టిలో పెట్టుకొని నీటి సమ స్యను తలెత్తకుండా నీటిని సరఫరా చేయాలని కొందరు కౌన్సిలర్లు సమావేశం దృష్టికి తీసుకువచ్చారు. జాతీయ రహదారిలో సెంట్రల్ లైటింగ్‌కు ప్లెక్సీలు పెట్టడంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, వెంటనే వాటిని తొలగించి అనుమతులు ఉన్నవాటికి ప్లెక్సీలు ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే వార్డుల్లో నెలకొన్న సమస్యలు సమావేశం దృష్టికి తీసుకు రావడంతో వాటన్నింటినీ సాధ్యమైనంత త్వరగా పరిష్కరించేలా చూస్తామన్నారు.

బుల్లెట్ అదుపు తప్పి యువకుడి మృతి



సుమంత్ మృతదేహం

సికెదిన్నె, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): బుల్లెట్ మోటారు సైకిల్ అదుపు తప్పి కింద పడటంతో సుమంత్ అనే యువకుడు మృతి చెందినట్లు సీఐ శివశంకర్‌నాయక్ తెలిపారు. నంద్యాల జిల్లా పున్నాపురంలో నివాసం ఉంటున్న కొండపల్లి సుమంత్ తన స్నేహితులతో కలిసి నంద్యాల నుంచి శుక్రవారం రాత్రి 12 గంటల సమయంలో తిరుమల దర్శనానికి బుల్లెట్ వాహనంలో బయలుదేరారు. తెల్లవారుజామున అయిదు గంటలకు కడప జయరాజ్ గార్డెన్స్ సమీపంలోకి రాగానే స్పీడ్‌బ్రేకర్ వద్ద బుల్లెట్ వాహనం అదుపు తప్పడంతో ఎగిరి కిందపడ్డారు. దీంతో అతనితో పాటు ప్రశాంత్, శివకు గాయాలయ్యాయి. వారిని చికిత్స నిమిత్తం రిమ్స్‌కు తరలించగా.. సుమంత్ అప్పటికే చనిపోయినట్లు వైద్యులు నిర్ధారించారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

గ్రావెల్ అక్రమ తవ్వకాలు

● పట్టుబడ్డ వాహనాలకు రూ.2.85 లక్షలు జరిమానా

దువ్వూరు, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): దువ్వూరు సమీప గుట్ట ప్రాంతంలో అనుమతులు లేకుండా గ్రావెల్ తరలిస్తున్న 10 టిప్పర్లు, నాలుగు ఎక్స్‌కవేటర్లకు మైన్స్ అండ్ జియాలజీ డిప్యూటీ డైరెక్టర్ సూర్యచంద్ర జరిమానా విధించినట్లు తహసీల్దారు అక్బర్‌బాష తెలిపారు. ఈనెల 18వ తేదీ కూటమి సర్కార్‌లోనూ కొల్లగొడుతున్నారు అనే కథనం 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితం అయిన విషయం విధితమే. ఇందుకు స్పందించిన రెవెన్యూ అధికారులు, పోలీసులు దాడులు చేసి వాహనాలను సీజ్ చేశారు. అనంతరం పట్టుబడ్డ 10 టిప్పర్లకు రూ.85 వేలు, నాలుగు ఎక్స్‌కవేటర్లకు రూ.2 లక్షలు మొత్తం రూ.2.85 లక్షలు జరిమానా విధించినట్లు తహసీల్దారు పేర్కొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

సికెదిన్నె, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో గాయపడిన వెంకటేశ్వరరెడ్డి అనే వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందాడు. సీకేదిన్నె సీఐ శివశంకర్‌నాయక్ వివరాల మేరకు.. కడప-రాయచోటి జాతీయ రహదారిలో ఊటుకూరు రింగ్‌రోడ్డు వద్ద స్కూటర్‌ను కారు ఢీకొనడంతో ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో స్కూటర్‌పై వెళుతున్న వెంకటేశ్వరరెడ్డి గాయపడడంతో చికిత్స నిమిత్తం రిమ్స్‌కు తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం కర్నూలు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ గురువారం అర్ధరాత్రి మృతి చెందాడు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

యథేచ్ఛగా... ఇసుక అక్రమ రవాణా

● నిషేధాజ్ఞలు ఉల్లంఘిస్తున్న ఇసుక మాఫియా

● కానరాని వీఆర్‌వోల టాస్క్‌ఫోర్స్



రామేశ్వరం హెడ్ వాటర్ వర్క్స్ నుంచి ట్రాక్టర్‌లో ఇసుకను తరలిస్తున్న దృశ్యం

ప్రొద్దుటూరు, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): ప్రొద్దుటూరులో ఇసుక అక్రమ రవాణా ఆగడం లేదు. జనవరి 25న ఆంధ్రజ్యోతిలో వచ్చిన ఇసుకాసురుల విధ్వంసం కథనంతో రెవెన్యూ, మున్సిపల్ అధికారులు స్పందించారు. స్వయంగా తహసీల్దారు గంగయ్య, మున్సిపల్ కమిషనర్ మల్లికార్జునలు పెన్నానదిలో ప్రొహిబిటెడ్ ఏరియాలో ఇసుక తవ్వకాలపై దాడులు జరిపారు. రెండు ఇసుక ట్రాక్టర్లను పట్టుకున్నారు. పలు ట్రాక్టర్లకు ఫొటోలు తీశారు. అదేరోజు ప్రొద్దుటూరు పట్టణంలో ఎర్రగుంట్ల రోడ్డులోని బ్రిడ్జి దగ్గర నుంచి రామేశ్వరం హెడ్ వాటర్ వర్క్స్ దగ్గర రైల్వే వంతెన ఎగువ వరకు పెన్నా నదిలో ఇసుక అక్రమ తవ్వకాలు జరుపరాదని... ఆప్రాంతం అంతా ప్రొహిబిటేడ్ ఏరియా కిందకు వస్తుందని తహసీల్దారు స్వయంగా విలేకరుల సమావేశంలో ప్రకటించారు. ప్రొద్దుటూరు పరిధిలో పెన్నా నదిలో ఇసుక తవ్వకాలపై నిషేధాజ్ఞలు పెట్టిన ప్రాంతంలోనే ఇసుక తవ్వకాలు జరిపి ట్రాక్టర్లలో అక్రమంగా తరలిస్తున్నారు. రామేశ్వరం హెడ్ వాటర్‌వర్క్స్ నుంచి ఆర్టీసీపీ రోడ్డు మార్గాన ఇసుక ట్రాక్టర్లు కనపడితే సీజ్ చేయమని తహసీల్దారు ఆదేశాలు ఇచ్చినా.. యథేచ్ఛగా వాటర్ వర్క్స్ ప్రాంతం, రైల్వే వంతెన వద్ద నుంచి ఇసుకను తరలిస్తున్నారు. పెన్నానదిలో అనుమతిలేని ప్రాంతం నుంచి ఇసుక అక్రమంగా తర లించకుండా కట్టడి చేయడానికి వీఆర్‌వోలతో ఫిబ్రవరి 12న టాస్క్ ఫోర్స్‌టీంను తహసీల్దారు గంగయ్య నియమించారు. ఇందులో అమర్‌నాథ్‌రెడ్డి ఉదయం 6 గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు అక్కడ పర్యవేక్షించాలి. అలాగే బిల్లాల బాషా ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1గంట వరకు, మల్లికార్జున మధ్యాహ్నం 1గంట నుంచి సాయంత్రం 4 గంటల వరకు, కె.వెంకట బ్రహ్మయ్య సాయం త్రం 4 గంటల నుంచి రాత్రి 7 గంటల వరకు, వెంకట ప్రేమ్ సాయి రాత్రి 7గంటల నుంచి పర్యవేక్షించాలని తహసీల్దారు ఉత్తర్వులు ఇచ్చారు. కానీ పెన్నానది ప్రొహిబిటెడ్ ఏరియాలో వీళ్లు కానరావడం లేదు. దీంతో ఇసుకను తవ్వకాలు జరిపి పట్టపగలే తరలించుకు పోతున్నారు. కాగా, తహసీల్దారు గంగయ్య ప్రొద్దుటూరులో ఇళ్ల కట్టడాలకు ఇసుక కావాల్సిన వాళ్లు ప్రభుత్వం అనుమతిచ్చిన కల్లూ రు, నంగనూరుపల్లె, చౌడూరు రీచ్‌ల వద్దకు వెళ్లి మాత్రమే ఇసుకను తీసుకువెళ్లాలని తెలిపినా.. ఇసుక మాఫియా తహసీల్దారు ఆదేశా లను ఖాతరు చేయడం లేదు. కాగా, పెన్నా నదిలో అనుమతి లేని ప్రాంతంలో ఇసుక తవ్వకాలు జరిపితే కేసులు పెట్టి జైలుకు పంపుతామని హెచ్చరించారు.

మల్లన్నకు ప్రత్యేక అలంకరణ చేస్తాం

తంబళ్లపల్లె, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): తంబళ్లపల్లెకు సమీపంలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన మల్లయ్యకొండ ఆలయాన్ని మహాశివరాత్రి రోజున ప్రత్యేక అలంకరణ చేయిస్తున్నట్లు గోపిదిన్నె చెరువుముందరపల్లెకు చెందిన పారిశ్రామికవేత్త, దాత నల్లగుండ్ల మల్లికార్జునరెడ్డి తెలిపారు. శుక్రవారం దాత మల్లికార్జున రెడ్డి, వైసీపీ నాయకుడు శివారెడ్డితో కలసి భ్రమరాంభిక సమేత మల్లికార్జున స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఈ సందర్భంగా మహాశివరాత్రి పర్వదినం రోజున ఆలయాన్ని సుమారు రూ.4లక్షలతో రకరకాల పూలు, పండ్లు, పుష్పాలు, పత్రాలతో ప్రత్యేకంగా అలంకరణ చేయిస్తున్నట్లు తెలిపారు. కాగా, గత రెండు, మూడేళ్లుగా మల్లికార్జునరెడ్డి సొంత నిధులతో ఆలయ అలంకరణ చేయిస్తున్నారు.

ఇంటి నిర్మాణానికి రూ.1.50 లక్షలు

కలికిరి, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కె.కొత్తపల్లె హౌసింగ్ కాలనీలో ఇల్లు మంజూరైనా ఆర్థిక స్థోమత సహకరించకపోవడంతో నిర్మాణం పూర్తి చేయని లబ్ధిదారు స్వర్ణకుమారికి రూ.1.50 లక్షల రుణం మంజూరు చేయించినట్లు కలికిరి మండల హౌసింగ్ ఏఈ చంద్రశేఖర్ రెడ్డి తెలిపారు. డ్వాక్రా మహిళా సంఘం సభ్యురాలైన స్వర్ణకుమారికి సంఘమిత్ర ద్వారా ఈ రుణం మంజూరు చేసినట్లు చెప్పారు. ఇదే విధంగా ఆర్థిక సహాయం కావలసిన లబ్ధిదారులకు డ్వాక్రా సంఘాల ద్వారా రుణాలు అందజేస్తామని చెప్పారు.

రామాపురం ఇసుక రీచ్ పరిశీలన

పెద్దతిప్పసముద్రం ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని రామాపురం సమీపంలోని పాపాఘ్ని నదిని అనుకుని సెటిల్‌మెంట్ భూముల్లో ఉన్న ఇసుక రీచ్‌ను మైన్స్ అధికారులు పరిశీలించారు. రైతులకు చెందిన పట్టా భూముల్లో ఉన్న ఇసుకను అక్రమంగా తరలించడానికి వీలులేదని, రీచ్‌లో ఇసుక లేకపోతే సెటిల్‌మెంట్ భూముల్లో ఇసుక ఉంటే రైతు వద్ద నుంచి ప్రభుత్వం కొనుగోలు చేసి లబ్ధిదారులకు అందించాలన్నారు.

10 ఎకరాల్లో కందిపంట దగ్ధం

పెద్దమండ్యం,ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి) పెద్దమండ్యం మండలం తెల్లవంక ప్రాంతంలో సాగులో ఉన్న కందిపంటను గుర్తు తెలియని వ్యక్తులు దగ్ధం చేశారని బాధితులు శ్రీనివాసులురెడ్డి చంద్రప్ప, సుగుణమ్మ ఆవేదన వ్యక్తం చేశారు. చేతికొచ్చిన కందిపంట దగ్ధం కావడంతో సుమారు రూ. 3 లక్షల పంట నష్టం వాటిల్లిందన్నారు. అగ్నిమాపక వాహనం వచ్చే లోపు 10 ఎకరాల్లో పంట దగ్ధమైనట్లు తెలిపారు.

శివయ్య దర్శనానికి..
ఆలయాలు ముస్తాబు

● వీరన్న కొండపై మూడురోజుల వేడుకలు




వాల్మీకిపురం పొలిమేరల్లోని దర్మపథం ఆలయం

వాల్మీకిపురం, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): వాల్మీకిపురం మండలం వ్యాప్తంగా మహా శివరాత్రి మహోత్సవాలకు ఆలయాలను ముస్తాబు చేస్తున్నారు. పట్టణానికి అత్యంత సమీపంలో ఉన్న వీరభద్రాద్రి (వీరన్నకొండ) పై వెలసిన శ్రీవీరభద్రస్వామి దేవాలయంలో మూడు రోజుల పాటుగా మహాశివరాత్రి ఉత్సవాలు వైభవంగా నిర్వహించనున్నారు. 24న (సోమవారం) కొండపై ప్రారంభమయ్యే వేడుకల్లో తొలిరోజు మహా నందీశ్వరుడి విగ్రహ ప్రతిష్ఠ, అభిషేకాలు, హోమాలు ఉంటాయన్నారు. 25న ఆలయ శోభాలంకరణ, 26న వీరభద్రస్వామికి అభిషేకాలు, హోమాలు, విశేష పూజలు జరగనున్నాయన్నారు. స్వామివారికి పూజలు, కొండపై తిరుణాల వేడుకలను వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఉత్సవాలకు వచ్చే భక్తుల సౌకర్యార్థం అన్నదాన ఏర్పాట్లు చేస్తున్నారు. అలాగే పట్టణ పడమర పొలిమేరల్లోని ధర్మపథం ఆలయం, కోనేటివీదిలో వెలసిన లక్ష్మీకామేశ్వరస్వామి దేవాలయాలలో శివరాత్రి రోజున అభిషేక పూజలు, శివపార్వతుల కల్యాణోత్సవ వేడుకలకు ఆలయాలను సర్వాంగ సుందరంగా ముస్తాబు చేస్తు న్నారు. ఈ ఏడాది వీరన్న కొండపై శివరాత్రి వేడుకలు ప్రత్యేకంగా నిలవనున్నాయి.







వీరభద్రాద్రి కొండపై వెలసిన వీరభద్ర స్వామి ఆలయం



వాల్మీకిపురంలోని లక్ష్మీకామేశ్వరస్వామి ఆలయం (ఇన్‌సెట్) స్వామివారు

నరసింహస్వామి ఆలయం ప్రారంభం

కురబలకోట, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి):మండలంలోని మండ్యంవారిపల్లెలో లక్ష్మీనరసింహస్వామి ఆలయాన్ని వైభవంగా శుక్రవారం ప్రారంభించారు. గ్రామంలో దాతల సహకారంతో ఈ ఆలయాన్ని నిర్మించారు. కాగా ఆలయ అభివృద్ధికి ఎమ్మెల్యే పి.ద్వారకనాథరెడ్డి రూ.1.50లక్షలు, నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి జయచంద్రారెడ్డి రూ. 1లక్ష, రాజంపేట పార్లమెంటరీ బీసీ సెల్ అధ్యక్షుడు సురేంద్రయాదవ్ రూ.50వేలు విరాళాన్ని ఆలయ కమిటీకి అందజేశారు.

ప్లాట్లలోకి వెళ్లకుండా అడ్డుకుంటున్నారని నిరసన

మదనపల్లె అర్బన్, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి):మా ప్లాట్లలోకి వెళ్లకుండా అడ్డుకొంటున్నారని శుక్రవారం బాధితులు స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన చేపట్టారు. బీకేపల్లెలోని 423-2లో 20 ఏళ్ల క్రితమే కొనుగోలు చేసిన మా ప్లాట్లలోకి వెళ్లనీయకుండా టీడీపీ నాయకుడు దౌర్జన్యానికి దిగుతున్నారని తమకు న్యాయం చేయాలని కోరారు.

యువత చేతుల్లోనే దేశభవిష్యత్



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న కరస్పాండెంట్ ఎన్.విజయభాస్కర్ చౌదరి

కురబలకోట, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): యువత చేతుల్లోనే దేశ భవిష్యత్. ఉంటుందని, వారు తలచుకుంటే ఏదైనా సాధించగలరని మిట్స్ ఇంజనీరింగ్ కళాశాల కరస్పాండెంట్ ఎన్.విజయ భాస్కర్ చౌదరి పేర్కొన్నారు. శుక్రవారం కళాశాలలో రెండు రోజుల పాటు నిర్వహిస్తున్న జాతీయస్థాయి టెక్నో కల్చరల్ స్పోర్ట్స్ ఫెస్ట్ అశ్వ-2కె25 కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ నమ్మకం, కృషి, పట్టుదలతో ముం దుకెళితే విజయాలు సాధించవచ్చన్నారు ఈ సందర్భంగా బిగ్‌బాస్ కంటెస్టెంట్స్ ఆర్.జె.సూర్య, గాయకులు సమీరా భరద్వాజ, దీపు, హారిక నారాయణన్ పాల్గొని విద్యార్థులను ఉత్సాహపరిచారు. అకాడమి ప్రెసిడెంట్ నాదెళ్ల ద్వారకనాథ్, ప్రిన్సిపాల్ సి.యువరాజ్ అభినందించారు.

చెత్త సేకరణను వేగవంతం చేయాలి

కలకడ, ఫిబ్రవరి21 (ఆంధ్రజ్యోతి): పంచాయతీలో ప్రతి ఇంటి నుంచి చెత్త సేకరణను వేగవంతం చేయాలని డీపీవో మస్తాన్‌వలి సిబ్బందిని ఆదేశించారు. శుక్రవారం ఆయన మదనపల్లి డీఎల్‌పీవో నాగరాజుతో కలిసి కలకడ చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని తనిఖీ చేశారు. అలాగే వర్మి కంపోస్టు తయారీ గురించి సూచనలిచ్చారు. కార్యక్రమంలో కార్యదర్శి దేవేంద్ర, పంచాయతీ కార్మికులు పాల్గొన్నారు.

కేంద్ర పథకాలపై ప్రచారం కల్పించాలి

పెద్దతిప్పసముద్రం ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర ప్రభుత్వం ప్రజలకు అందించే సంక్షేమ పథకాలను గ్రామీణ స్థాయిలో విస్తృత ప్రచారం కల్పించాలని జిల్లా బీజేపీ అధ్యక్షుడు సాయిలోకేష్ పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక కోదండరామాలయంలో మండల స్థాయి బీజేపీ నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బీజేపీని గ్రామీణ స్థాయిలో బలోపేతం చేయడానికి బూత్ కమిటీ సభ్యులు, మండల స్థాయి నాయకులే కీలకమన్నారు. కార్యక్రమంలో యల్లంపల్లె ప్రశాంత్, ఆకుల కృష్ణమూర్తి, గోపాల్‌రెడ్డి, మండల అధ్యక్షుడు శ్రీకాంత్, మండల ప్రధాన కార్యదర్శి రాపూరివాండ్లపల్లె శ్రీకాంత్‌రెడ్డి, మల్లెం శివయ్య, భాస్కర్‌రెడ్డి, నాగరాజు, రెడ్డెప్ప, వెంకట్రమణ పాల్గొన్నారు.

మాతృభాషను మరువరాదు

పెద్దమండ్యం, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి) మాతృభాషను మరచిపోవద్దని యల్లంవారిపల్లి ఉన్నత పాఠ శాల తెలుగు ఉపాధ్యాయుడు అవధాని లోకా జగన్నాథశాస్త్రి పేర్కొన్నారు. శుక్రవారం తెలుగు భాషాదినోత్సవం సందర్భంగా ఆయన మాట్లాడుతూ మమ్మీ, డాడి సంస్కృతి స్వస్తి పలికి, అమ్మ నాన్నలను ఆదరించాలని ఉద్భోధించారు. పాఠ శాల అవరణలో బాలబాలికల కోలాటం నృత్యాలు ఆకట్టుకున్నాయి. హెచ్‌ఎం శంకర్‌నాయక్ పాల్గొన్నారు.

దాడి ఘటనలో 24 మందిపై కేసు నమోదు

మదనపల్లె అర్బన్, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): ఇరువర్గాల దాడి కేసులో 24మందిపై కేసు నమోదు చేసినట్లు తాలుకా సీఐ కళా వెంకటరమణ తెలి పారు. అరవవాండ్లపల్లె, కృష్ణాపురానికి చెందిన ఇరువర్గాలు రోడ్డుపై కర్రలతో దాడి చేసుకొన్న ఘటనలో ఇరువర్గాలకు చెందిన 24 మందిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ చెప్పారు. ఇందులో ఒక వర్గానికి చెందిన గణేష్, దివాకర్, హరి, నారాయణస్వామి, సందీప్, దిలీప్, శివరాజ్, వర్ధన్, భాను, ప్రవీణ్, రెడ్డెమ్మ, మోహన, శివపైన మరో వర్గానికి చెందిన హరి, సురేష్, రవి, కళ్యాణ్, రెడ్డిప్రసాద్, నవీన్, పవన్, మోహన, మునిప్రసాద్, చక్రీ, నరసింహులుపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

భోజనం నాణ్యతగా ఉండాలి

ములకలచెరువు, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): మధ్యాహ్న భోజనంలో నాణ్యత లోపిస్తే కఠిన చర్యలు తప్పవని తహసీల్దార్ ప్రదీప్, ఎంపీడీవో హరినారాయణ హెచ్చరించారు. స్థానిక మోడల్ స్కూల్‌లను శుక్రవారం తనిఖీ చేశారు. అనంతరం పలు రికార్డులను పరిశీలించారు. తనిఖీల్లో ఎంఈవో వెంకటరమణ పాల్గొన్నారు.

బాధ్యతగా పనిచేయండి

ములకలచెరువు, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో మహిళలు, యువతుల రక్షణ కోసం బాధ్యతగా పనిచేయాలని ములకలచెరువు సీఐ లక్ష్మన్న సూచించారు. స్థానిక సర్కిల్ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో కొత్త వ్యక్తులు సంచరిస్తే తక్షణం తమకు సమాచారం ఇవ్వాలన్నారు.

శివరాత్రి ఉత్సవాలను కలిసికట్టుగా నిర్వహించాలి



పీస్ కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్ అమరనాథ్

నిమ్మనపల్లి ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): మండలంలోని తవళం పంచాయతి అటవీ ప్రాంతం రుషిభూమిలో వెలసిన శ్రీనేల మల్లేశ్వరస్వామి సన్నిధిలో ఈనెల 26, 27తేదీలలో జరిగే మహాశివరాత్రి ఉత్సవాలను కలసికట్టుగా నిర్వహి ంచాలని ఆలయ ఈవో మంజులు సూచించారు. శుక్రవారం నేలమల్లేశ్వస్వామి ఆలయంలో మండల స్థాయి అధికారులు, టీడీపీ నాయకులు గ్రామస్థులతో పీస్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ అమరనాథ్ మాట్లాడుతూ మహాశివరాత్రిని దృష్టిలో ఉంచుకొని ఆలయానికి వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చూడాలన్నారు. ఆలయ చైర్మన్ రామకృష్ణ, మండల టీడీపీ అధ్యక్షుడు వెంకటరమణ మాట్లాడుతూ ఆలయానికి వచ్చే వాహనాలకు మరో రోడ్డు మార్గం ఉందని దానికి మట్టితోలి చదును చేస్తే ట్రాఫిక్ సమస్యను అరికట్టవచ్చని తెలి పారు.కార్యక్రమంలో సర్పంచ్ రెడ్డెప్ప, మాజీ ఎంపీపీ రెడ్డెప్పరెడ్డి, మాజీ సర్పంచ్ రెడ్డెప్ప, నాయకులు లక్ష్మన్న, విజయ్, చెంద్రాయుడు, చినబాబు, రాజ న్న, శ్రీపతి తదితరులు పాల్గొన్నారు.

అంగళ్లులో మళ్లీ భూ రగడపై అధిష్ఠానం ఆరా

కురబలకోట, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): కురబలకోట మండలం అంగళ్లు సమీపంలోని మిట్స్ ఇంజనీరింగ్ కళాశాల పక్కనున్న భూ వివాదమై టీడీపీ అధిష్ఠానం శుక్రవారం ఆరా తీసింది. 'ఆంధ్రజ్యోతి'లో అంగళ్లులో మళ్లీ భూ రగడ శీర్షికన కథనం ప్రచురితమైంది. అంగళ్లు పంచాయతీ పరిధిలోని సర్వేనంబర్ 220లో గత కొన్నేళ్లుగా భూ వివాదం నడుస్తోంది. అయితే గత ప్రభుత్వం హయాంలో వైసీపీ సానుభూతి పరులు ఆ భూమిని ఆక్రమించుకోడానికి చర్యలు చేపట్టారు. కాగా కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఇలాంటి వాటికి స్వస్తి పలుకుతారని ప్రజలు ఎదురుచూశారు. అయితే టీడీపీ మద్దతుదారులు ఆ భూమి ఆక్రమించుకోవడానికి ప్రయత్నాలు చేపట్టడంపై కథనం ప్రచురితమైంది. ఈ విషయాన్ని టీడీపీ అధిష్ఠానం సీరియస్‌గా తీసుకుంది. అలాగే మళ్లీ భూరగడపై సమగ్ర నివేదిక ఇవ్వాలని రెవెన్యూ అధికా రులను జేసీ ఆదేశించగా ఇందుకు గతంలో పంచాయతీ అనుమతులు ఎవరైనా పొం దారా? అన్న వివరాలను అందించాలని పంచాయతీ అధికారులను డీపీవో ఆదేశించారు.

గ్రామాల్లో ఘర్షణలు తలెత్తకుండా చూడండి



కృష్ణాపురంలో పోలీసు పికెటింగ్ పెట్టాలని ఫోన్‌లో అధికారులకు సూచనలిస్తున్న ఎమ్మెల్యే

మదనపల్లె టౌన్, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): మదనపల్లె మండలం కృష్ణాపురం తదితర గ్రామాల్లో వర్గాల మధ్య ఘర్షణలు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే షాజహాన్‌బాషా పోలీసు అధికారులకు సూచించారు. శుక్రవారం స్థానిక ఎమ్మెల్యే నివాసం వద్దకు కృష్ణాపురం గ్రామానికి చెందిన ఇరువర్గాల ప్రజలు పెద్దసంఖ్యలో వచ్చి గురువారం రాత్రి జరిగిన ఘర్షణలు, దాడులపై ఎమ్మెల్యేకు ఫిర్యాదు చేశారు. చిన్న విషయానికి ఇద్దరు యువకుల మధ్య గొడవ గ్రామంలో ఇరువర్గాల ఘర్షణకు దారి తీసి ఇందులో పలువురు తీవ్రంగా గాయ పడ్డారని, విషయాన్ని పోలీసులకు ఫిర్యాదు చేశామన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే తాలూకా పోలీసులకు ఫోన్ చేసి కృష్ణాపురంలో పోలీసు పికెటింగ్ పెట్టాలని సూచిం చారు. పట్టణంలోని అయోధ్య నగర్‌లో దారి సమస్య పరి ష్కారానికి ఎమ్మెల్యే చర్యలు చేపట్టారు. ఎల్‌ఐసీ ఏజెంట్లకు ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని విన్నవించారు.

నవోదయం 2.0ను విజయవంతం చేయాలి

పీలేరు, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): రాష్ట్రాన్ని నాటుసారా రహితంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం ప్రతిష్ఠా త్మకంగా చేపట్టిన నవోదయం 2.0 కార్యక్రమాన్ని విజయవంతం చేయా లని జిల్లా ఎక్సైజ్, ప్రొహిబిషన్ అధి కారి మధుసూదన్ ఆదేశించారు. నవోదయం 2.0 అమలుపై శుక్రవా రం ఆయన పీలేరు ఎక్సైజ్, ప్రొహిబి షన్ సిబ్బందితో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పీలేరు మండలంలో మూడు గ్రామాల్లో నాటు సారా తయారీ ఎక్కువగా ఉన్నట్లు అధ్యయనాల్లో తేలిందని, ఆ గ్రామస్థులకు విరివిగా కౌన్సెలింగ్ నిర్వహించడమే కాకుండా ప్రత్యామ్నాయ జీవనోపాధులపై అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ జోగేంద్ర, పీలేరు సీఐ సుబ్బారెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యా సంస్థల వద్ద మద్యం షాపులు తొలగించండి



తహసీల్దారుకు వినతి పత్రం అందజేస్తున్న ఎస్ఎస్‌యూఐ, కాంగ్రెస్ నాయకులు

పీలేరు, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): విద్యాసంస్థలు, ప్రార్థనా మందిరాల వద్ద ఉన్న మద్యం షాపులను దూరంగా మార్చాలని ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మద్దెల అమృతతేజ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పీలేరు పట్టణంలోని అజంతా టాకీసు, నాలుగు రోడ్ల కూడలిలోని మద్యం షాపులు అటు విద్యాసంస్థలు, ఇటు ప్రార్థనా మంది రాలకు చాలా దగ్గరగా ఉన్నాయని దీంతో విద్యార్థులు, పలువురు భక్తులు తీవ్ర అసౌక ర్యానికి గురవుతున్నారన్నారు. వాటిని వెంటనే మరో చోట ఏర్పాటు చేసుకునేలా చర్య లు తీసుకోవాలని కోరారు. ఈ మేరకు ఆయన శుక్రవారం విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించి తహసీల్దారు భీమేశ్వరరావుకు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమం లో ఎన్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు సాయిసంపత్ కుమార్, కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యదర్శి యూసుఫ్ అలీ, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి పనుల అక్రమాలపై ఏపీడీ విచారణ

గుర్రంకొండ, ఫిబ్రవరి 21(ఆంధ్ర జ్యోతి):అమిలేపల్లె గ్రామంలో ఉపాధిహామి పథకంలో జరిగిన అవినీతి, అక్రమాలపై శుక్రవారం రాయచోటి ఏపీడీ లక్ష్మీనరసయ్య విచారణ జరిపారు. ఈ ఏడాది జనవరి 10వ తేదీన జరిగిన సా మాజిక తనిఖీ బహిరంగ సభలో అమిలేపల్లె గ్రామంలో పెద్ద ఎత్తున అవినీతి, అక్రమాలు వెలుగుచూసిన విషయం తెలిసిందే. అప్పట్లో డ్వామా పీడీ గ్రామంలో జరిగిన పనులను ఏపీడీ తనిఖీ చేసి నివేదిక జిల్లా అధికారులకు అందజేయాలని సూచించారు. ఇందులో భాగంగా అమిలేపల్లె గ్రామంలో ఉపాధి పనుల్లో భాగంగా చేసిన అమృత్ సరోవర్ ట్యాంక్, చెక్‌డ్యామ్ పూడికతీత పనులు, పనులు చేయకనే చేసినట్లు చూపిన రాయల్‌చెరువుకు నీరు వచ్చే వంక పనులను ఏపీడీ బృందం పరిశీలించింది.

మాయమాటలు చెప్పి ఆభరణాలతో దుండగుల పరార్

పీలేరు, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): ఓ మహిళకు మాయమాటలు చెప్పి ఆమె బంగారు ఆభరణాలతో దుండగులు ఉడాయించిన సంఘటన శుక్రవారం పీలేరులో జరిగింది. పీలేరు మండలం కొండ్రెడ్డిగారిపల్లెకు చెందిన కంభం కృష్ణమ్మ(50) వైద్యం కోసం శుక్రవారం మధ్యాహ్నం పీలేరు ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చింది. ఆసుపత్రి ప్రాంగణంలో గుర్తు తెలియని ఇద్దరు వ్యక్తులు ఆమెతో మాటలు కలిపి దొంగతనాలు ఎక్కువగా జరుగుతున్నాయని, ఒంటిపై ఉన్న బంగారు నగలను ఏదైనా బ్యాగులో పెట్టుకోవాలని ఆమెకు తమ చేతిలో ఉన్న ఆభరణాలు చూపించారు. దీంతో వారిని నమ్మిన ఆమె ఆభర ణాలను. పొట్లం కట్టుకుంటుండగా వాటిని తీసుకుని అక్కడి నుంచి ఉడాయించారు. మోసపోయానని గ్రహించిన కృష్ణమ్మ చేసేదిలేక పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఇందులో 40 గ్రాముల బొట్టు గొలుసు, 5 గ్రాముల మంగళసూత్రం, 2 గ్రాముల లక్ష్మీ కాసులు, 2 గ్రాముల గుండ్లు పోయాయని ఆమె పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఆమె ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ-2 లోకేశ్ తెలిపారు.

టమోటా రైతులకు కూటమి ప్రభుత్వం అండ

ములకలచెరువు, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): ధరలు పతనమై దిక్కుతోచని స్థితిలో పడ్డ టమోటా రైతులకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అండగా నిలిచారని తంబళ్లపల్లె నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి దాసరిపల్లి జయచంద్రారెడ్డి సతీమణి, టీడీపీ మహిళా నేత కల్పనారెడ్డి పేర్కొన్నారు. ములకలచెరువు మార్కెట్‌లో శుక్రవారం టీడీపీ ఇన్‌చార్జి జయచంద్రారెడ్డి ఆదేశాలతో పర్యటించి రైతులకు భరోసా కల్పించారు. టీడీపీ జిల్లా కార్యదర్శి యర్రగుడి సురేష్, మార్కెట్ కమిటీ మార్కెట్ మాజీ వైస్ చైర్మన్ కేవీ రమణ, నాయకులు పాల్గొన్నారు.

జూదరుల అరెస్టు

మదనపల్లె అర్బన్/పీలేరు, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి):మదనపల్లెలో ఏడుగురు జూదర్లను అరెస్టు చేసి వారి వద్ద నుంచి రూ.25,300 నగదు స్వాధీనం చేసుకున్నట్లు తాలుకా సీఐ కళావెంకట రమణ తెలిపారు. పేకాట స్థావరాలపై దాడిచేసి వారిపై కేసు నమోదు రిమాండ్‌కు తరలిస్తున్నట్లు సీఐ తెలిపారు. పీలేరులో జూదం ఆడుతున్న ఎనిమిది మందిని అరెస్టు చేసి వారి వద్ద నుంచి రూ.56,800లు స్వాధీనం చేసుకున్నట్లు పీలేరు ఎస్ఐ-2 లోకేశ్ తెలిపారు.